




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 99 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ | గురువారం 19 ఫిబ్రవరి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 99 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD | THU 19 FEBRUARY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur





# భవిష్యత్.. గ్రీన్ ఎనర్జీదే

- 2034 నాటికి నెట్ జీరో సిటీగా హైదరాబాద్
- సోలార్, గ్రీన్ పవరు ప్రాధాన్యం
- 30 లక్షల పంప్ సెట్లు,
- 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్
- కోర్ అర్బన్ రీజియన్లో పరిశ్రమలు ఉండవు
- త్రీ ట్రిలియన్ డాలర్
- ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యం : సీఎం రేవంత్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రాన్ని నెట్ జీరో స్టేట్ గా తీర్చిదిద్దుతామన్నారు సీఎం రేవంత్ రెడ్డి .అందులో భాగంగానే క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి నమూనాను తీసుకొచ్చామన్నారు. పట్టణాభివృద్ధిలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు సీఎం. తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 30 లక్షలకు పైగా పంప్ సెట్లు, 50లక్షల ఇండ్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నామని సీఎం చెప్పారు. 2034 నాటికి హైదరాబాద్‌ను నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు సీఎం రేవంత్ రెడ్డి.

- మిగతా 2లో...



## మంత్రి కాన్వాయ్‌పై దాడి... బాల్క సుమన్ అరెస్టు

- క్యాతనపల్లిలోని నివాసంలో సుమన్‌ను అరెస్టు చేసిన పోలీసులు
- అడ్డుకునే ప్రయత్నం చేసిన కార్యకర్తలపై లాఠీఛార్జ్
- కాన్వాయ్‌పై దాడి కేసులో ఏ1గా బాల్క సుమన్

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ రాష్ట్ర మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి కేసులో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

- మిగతా 2లో...


## మేం మళ్లీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతలు వడ్డీతో సహ చెల్లించుకోవాల్సి ఉంటుంది

- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకునే కుట్రలో భాగమే ఈ అరెస్ట్ అని ఆరోపణ
- అధికార పార్టీకి కొందరు పోలీసులు తొత్తులుగా మారారని విమర్శ
- సుమన్‌ను బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్




**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది పూర్తిగా అక్రమ అరెస్ట్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ అని ఆయన మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం చేసుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనతోనే కాంగ్రెస్ ఈ కుట్రకు తెరలేపిందని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు.ప్రజల

- మిగతా 2లో...




## చైనా రోబో డాగ్ కొని తామే అభివృద్ధి చేశామని ప్రచారం.. ఏఐ సదస్సులో యూనివర్సిటీ చీటింగ్

- సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ కావడంతో బయటపడ్డ మోసం
- గల్గోటియాస్ యూనివర్సిటీని సదస్సు నుంచి బహిష్కరించిన నిర్వాహకులు
- విద్యార్థుల పరిశోధనల కోసమే వాడుతున్నట్లు వర్సిటీ వివరణ

- మిగతా 2లో...

## కాంగ్రెస్ పార్టీ మురుగు రాజకీయాలు చేస్తోంది

- బాల్క సుమన్ అరెస్ట్ ను ఖండించిన హరీశ్ రావు
- చట్టాలను తుంగలో తొక్కుతోందని విమర్శ
- ఛైర్మన్ పీఠాలను అడ్డదారుల్లో ఆక్రమించుకుంటున్నారని మండిపాటు



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మురుగు రాజకీయాలు చేస్తోందని బీఆర్ఎస్ నేత,

2లో...

## నేను భారత్‌కు వస్తానో, రానో తెలియదు.. ఎందుకంటే!

### బాంబే హైకోర్టుకు తెలిపిన విజయ్ మాల్యా


- బ్రిటన్ దాటి రాకుండా చట్టపరమైన ఆంక్షలు ఉన్నట్లు వెల్లడి
- ఎప్పుడు తిరిగి వస్తానో తెలియదన్న విజయ్ మాల్యా
- మాల్యా తరపున స్టేట్‌మెంట్ సమర్పించిన న్యాయవాది అమిత్ దేశాయ్



పెన్ పవర్ డెస్క్:భారతీయ బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి లండన్ పారిపోయిన వ్యాపారవేత్త విజయ్ మాల్యా తాను భారత్‌కు తిరిగి రాలేనని బాంబే

- మిగతా 2లో...


## ఇబ్రహీంపట్నం ఛైర్మన్ ఎన్నికపై హైకోర్టు కీలక ఆదేశాలు




- ఛైర్మన్ ఎన్నికపై తుది నిర్ణయం ఆర్వోదేనని స్పష్టీకరణ
- ఆకుల యాదగిరిపై ఒత్తిడి తీసుకు రావొద్దని కలెక్టర్, పోలీసులకు ఆదేశం
- హైకోర్టు నిర్ణయంతో ఇబ్రహీంపట్నం ఛైర్మన్ ఎన్నికకు తొలగిన అడ్డంకి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికకు అడ్డంకి తొలగింది. ఛైర్‌పర్సన్ ఎన్నికకు సంబంధించి స్టేను తెలంగాణ హైకోర్టు ఎత్తివేసింది. ఛైర్మన్ ఎన్నికపై తుది నిర్ణయం రిటర్నింగ్

- మిగతా 2లో...



## రంజాన్ నెల ప్రారంభం..

### నేటి నుంచి ఉపవాస దీక్షలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ముస్లింల పవిత్ర రంజాన్ మాసం మొదలైంది. రంజాన్ మాసం ప్రారంభానికి సూచికగా భారత్ లో నెలవంక కనపించింది. గురువారం(ఫిబ్రవరి19) తెల్లవారుజామున ముస్లిం సోదరులు రంజాన్ ఉపవాసం దీక్షలు ప్రారంభిస్తారు. ప్రత్యేక నమాజు తరావీ ప్రార్థనలు బుధవారం (ఫిబ్రవరి 18) రాత్రి నుంచే

- మిగతా 2లో...

## దేశ భద్రతకు రాహుల్ అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి

- దేశ వ్యతిరేక శక్తులతో సంబంధాలు పెట్టుకున్నారని ఆరోపణ
- రాహుల్ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్న నిషికాంత్ దూబే
- ఆయనపై జీవితకాల నిషేధం విధించాలని డిమాండ్

- మిగతా 2లో...



## భారత్‌కు ఇది చరిత్రాత్మక సమయం

- భారత్ ఒక గొప్ప సాంకేతిక పరివర్తన దశలో ఉందన్న సుందర్ పిచాయ్
- దేశ భవిష్యత్తును ఏఐ నిర్దేశించబోతోందని ఉద్ఘాటన
- ప్రధాని మోదీతో భేటీ, ఏఐపై సహకారానికి చర్చలు
- గూగుల్ జెమినైకి భారత్ అతిపెద్ద మార్కెట్లలో ఒకటి అని వెల్లడి
- అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌తో కలిసి విద్యార్థులకు కోడింగ్, రోబోటిక్స్



పెన్ పవర్ డెస్క్:భారతదేశం ఒక గొప్ప సాంకేతిక పరివర్తనకు నాంది పలుకుతోందని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కీలక పాత్ర పోషించనుందని ఆల్ఫాబెట్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. ప్రస్తుత దశను పరివర్తన సమయంగా ఆయన అభివర్ణించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ఇది టెక్నాలజీ, ఆవిష్కరణలు, మరియు ఏఐ విస్తృత వినియోగంతో నడిచే ఒక దశాబ్ద కాలపు మార్పుకు నాందిలా అనిపిస్తోంది" అని పేర్కొన్నారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా లబ్ధి పొందేందుకు భారతదేశం ప్రత్యేకమైన స్థితిలో ఉందని,

- మిగతా 2లో...

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటిన బీసీలు!

- తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో 61 శాతానికి పైగా సీట్లు గెలుచుకున్న బీసీలు
- రిజర్వేషన్లను మించి జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థుల భారీ విజయం
- ఇది బీసీల రాజకీయ చైతన్యానికి నిదర్శనమని బీసీ కమిషన్ హర్షం
- 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని కేంద్రానికి కమిషన్ విజ్ఞప్తి



- మిగతా 2లో...

## ఎడిటర్ వ్యూ

# కఠోర నియమాలు... రంజాన్ దీక్షలు

పండగ, పర్వం అంటే శుభవేళ, ఉత్సాహంగా జరుపుకునే ఉత్సవ సమయం అని అర్థం. పండుగలు మానవ జీవన స్రవంతిలో భాగమై, జాతీయతకు, సామూహిక జీవన విధానానికి, సంస్కృతి వికాసానికి దోహదపడుతున్నాయి. పండుగ అనేది ఏ మతానికి సంబంధించినది అయినా సరే, దాని వెనుక ఒక సందేశం, ఒక శాస్త్రీయత, ఒక సదాచారం దాగి ఉంటాయి. పండుగ మానవాళికి హితాన్ని బోధిస్తుంది. ముస్లిములు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ సైతం ఇదే హితాన్ని మానవాళికి అందిస్తుంది. ముస్లిములు చాంద్రమానం క్యాలెండర్ ను అనుసరిస్తారు. చాంద్రమాన అనుసరణీయ, ఇస్లామియ క్యాలెండర్ తొమ్మిదవ నెల రంజాన్. క్రమశిక్షణ దాతృత్వం ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం. ముస్లిం సోదరులకు పరమ పవిత్రమైన రంజాన్ నెల సందర్భంగా, నెల రోజుల పాటు నిర్వహించనున్న ఉపవాస దీక్షలు... కఠోర నియమాలకు, దీక్షా దక్షతలకు ప్రబల నిదర్శనాలు. దివ్య ఖురాన్ అవతరించిన నెలలో విధిగా ఆచరించవలసిన నియమం ఉపవాస వ్రతం. ఉపవాసాన్ని "పార్సీ" భాషలో "రోజా" అంటారు. పరమ పవిత్రంగా ప్రత్యేక ప్రార్థనలతో, ఉపవాస దీక్ష కంకణులైన ధార్మికులు, భక్తి శ్రద్ధలతో అన్ని అలవాట్లకు దూరంగా ఉంటూ, నెల రోజులు దీక్షలో నిమగ్నమై ఉంటారు. "రంజాన్" పండగ పేరు కాదు. నెల పేరు. "రంజ్" అనగా కాలుట (జ్వలించుట) ఉపవాసము చేయుటచే, మను షులుచేయు పాపమును కాలి పోవునని భావము. నెల అంతయు, ఉదయం నుండి సూర్యా స్తమయం వరకు ఉపవాసం ఉండి, రోజా పాటిస్తూ రోజుకు 5 సార్లు నమాజ్ పఠిస్తూ, మసీదులలో ఎక్కువ సమయం గడుపుతారు. ఐదు సార్లు చేసే నమాజులు.....ఫజర్ (సూర్యోదయమునకు పూర్వము) జూహర్ ( మధ్యాహ్నం తర్వాత) అనర్ ( సూర్యాస్త మయానికి పూర్వము) మగరీబ్ (సూర్య సమయానికి ముందు చీకటి పడ్డాక) ఇషా (అర్ధరాత్రికి ముందు చేయాల్సిన సమాజులు. ఈ నెలలో రాత్రి చేయు ప్రత్యేక ప్రార్థనలు "తరావీహ్" అంటారు. నెలలో ఖురాన్ ను పూర్తిగా వరిస్తారు. ముస్లి సిద్ధాంతాలను విశ్వసించి పాటిస్తారు. ఆయన దూతలను హృదయ పూర్వకంగా విశ్వసించడం, రోజు 5 సార్లు నమాజు నమాజు పఠిచడం, పూర్తిగా ఉపవాస దీక్షను పాటించడం, పేదలకు దానం చేయడం మక్కా యాత్ర చేయడం, ప్రధాన సిద్ధాంతాలు. రోజా లో ఉండగా ఉమ్మిని మింగ రాదు. బీడీ, సిగరెట్ లాంటివి కాల్చడం చేయరాదు. మద్యం సేవించ రాదు. మందులు తీసుకొనరాదు. చాడీలు చెప్పుట, ఇతరులను దుర్భాషలాడడం, అబద్ధం చెప్పుట, చెడు పనులు చేయుట నిషిద్ధాలు, వీటిని పాటించ కుంటే, అల్లాహ్ దృష్టిలో తాను చేసిన వ్రతమునకు విలువ ఉండదు. బీదలకు సహాయం చేసి, వారి నుం దీవెనలు పొందాలి. సూర్యోదయానికి ముందు తినే ఆహారాన్ని "సహరీ" అంటారు. సూర్యాస్తమయం తర్వాత ఖర్జూరపు పండు గాని ఇతర ఫలాలను తీసుకోవడాన్ని "ఆఫ్తారీ" అంటారు. రంజాన్ మాసంలో మరొక విశేషం అత్యధిక దానధర్మాలు చేయడం. సంపాదనాపరులు, సంపన్నులైన వారు. రంజాన్ నెలలో పేదలను ఆదుకోవాలని ఖురాన్ బోధిస్తోంది. ఆస్తిలో నుంచి, నిర్ణీత మొత్తాన్ని, పేదలకు దానం చేయడాన్ని "జకాత్" అంటారు. దీనిని పేదల "ఆర్థిక హక్కు"గా పేర్కొంటారు. దీని ప్రకారం. ప్రతి సంవత్సరాంతంలో మిగిలిన, తన సంపద నుండి 30 శాతం చొప్పున ధన, వస్తు, కనకాది ఏవైనా, నిరుపేదలకు దానం ఇస్తారు. పేద వారు కూడా అందరితో పాటు పండుగను. జరుపుకోవడానికి, సంతోషంగా పాలుపంచుకు నేందుకు "జకాత్" ఎంతగానో ఉపయోగ పడుతుంది. జకాత్ తో పాటు 'ఫిత్రా దానానికి" రంజాన్ నెలలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. మూడు పూటలా తిండికి, ఒంటినిండా బట్టకు నోచుకోని పేదవారు, అభాగ్యులకు, పండగ సందర్భంలో దానం చేయాలని, ఇస్లాం మతం బోధిస్తోంది. "ఫిత్రా దానం" అని పిలుస్తారు. ఉపవాస వ్రతాలు విజయవంతం కావడానికి, దేవుని పట్ల కృతజ్ఞతగా, పేదలకు ఫిత్రా దానం చేయడం. ఫిత్రా దానాన్ని విధిగా నియ మించడానికి కారణం, ఉపవాస వ్రత నియమాన్ని పాటించే సమయంలో హృదయంలో కలిగే చెడు భావనలు, తలంపులు, ఆలోచనలు, నోటి నుండి వెలువడే అసత్యాలు, అనాలోచిత పొరపాటు, అన్నీ క్షమించ బడతాయని, మహమ్మద్ అనుచరుడు అబ్దుల్లా బిన్ మసూద్ ఉవాచ. రంజాన్ మాసంలో జరుపుకునే ఇస్తార్ విందులో, ఆత్మీయ స్వభావాలు ప్రస్ఫుటం అయితాయి. సామూహిక జీవన విధానానికి, విశాల ఆలోచన దృక్పథానికి, ఇఫ్తార్ విందులు నిదర్శనాలు. పవిత్ర ఆరాధనలకు, ధార్మిక చింతనకు, దైవభక్తికి, క్రమశిక్షణకు, ఇంద్రియ నిగ్రహమునకు, స్వీయ నియంత్రణకు దాతృత్వానికి, ఆలవాలమైన రంజాన్ మాంసం, మనిషి సత్ ప్రవర్తన దిశలో సాగడానికి, మార్గాన్ని సుగమం చేస్తుంది.

# నేను భారత్‌కు వస్తానో, రానో తెలియదు.. ఎందుకంటే!

- మొదటి పేజి తరువాయి

హైకోర్టుకు తెలియజేశారు. తాను భారత్‌కు ఎప్పుడు తిరిగి వస్తానో తెలియదని అన్నారు. తాను బ్రిటన్ దాటి రాకుండా చట్టపరమైన ఆంక్షలు ఉన్నాయని, అందుకే ఎప్పుడు తిరిగి వచ్చేది చెప్పలేనని తెలిపారు. ఈ మేరకు విజయ్ మాల్యా తరఫు న్యాయవాది అమిత్ దేశాయ్ బాంబే కోర్టులో ఒక స్టేట్‌మెంట్‌ను సమర్పించారు. మాల్యా దగ్గర యాక్టివ్ ఇండియన్ పాస్‌పోర్టు లేదని, అదేవిధంగా దేశం దాటి వెళ్లకుండా ఇంగ్లండ్, వేల్స్ కోర్టుల ఆంక్షలు ఉన్నాయని కోర్టుకు సమర్పించిన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రశేఖర్, జస్టిస్ గౌతమ్ అంఖద్‌లతో కూడిన ధర్మాసనం గత వారం విజయ్ మాల్యా పిటిషన్‌పై విచారణ జరపడానికి నిరాకరించింది. తనను పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటించడాన్ని ఆయన కోర్టులో సవాల్ చేశారు. అయితే మాల్యా భారత్‌కు రాకుండా ఈ పిటిషన్‌పై విచారణ జరపలేమని స్పష్టం చేసింది. మాల్యాకు భారత్‌కు తిరిగొచ్చే ఉద్దేశం ఉందా, లేదా? అని ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో మాల్యా తన తరఫు న్యాయవాది ద్వారా బాంబే హైకోర్టులో తాజా స్టేట్‌మెంట్‌ను సమర్పించారు. ఈ పిటిషన్ విచారణ జరిపేందుకు ఆయన ప్రత్యక్షంగా కోర్టుకు హాజరు కావాల్సిన అవసరం లేదంటూ అమిత్ దేశాయ్ కోర్టులో వాదనలు వినిపించారు.

# మేం మళ్లీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతలు వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉంటుంది

- మొదటి పేజి తరువాయి

ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ఈ దుర్మార్గాలన్నింటికీ వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి వస్తుందని కేటీఆర్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకుంటే మంచిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ... "క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉంది. అయినా సరే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి దౌర్జన్యంగా దాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. ఈ కుట్రలో భాగంగానే సుమన్‌పై అక్రమ కేసులు బనాయించి, ఇవాళ దుర్మార్గంగా అరెస్ట్ చేయించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా క్యాతన్‌పల్లి ప్రజలు సంపూర్ణ బంద్ పాటించి నిరసన తెలిపినా ఈ ప్రభుత్వానికి బుద్ధి రాలేదు" అని విమర్శించారు. కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. వారు తమ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అక్రమ కేసులో అరెస్ట్ చేసిన బాల్క సుమన్‌ను ప్రభుత్వం తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆయన డిమాండ్ చేశారు.

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటిన బీసీలు!

తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలు (బీసీలు) అద్భుతమైన విజయాన్ని నమోదు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా 61 శాతానికి పైగా వార్డులు, డివిజన్లను బీసీ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. వాస్తవానికి మున్సిపాలిటీల్లో బీసీలకు 28.22 శాతం, కార్పొరేషన్లలో 35.25 శాతం సీట్లు మాత్రమే రిజర్వ్ చేయగా, రిజర్వేషన్లను మించి జనరల్ స్థానాల్లోనూ వారు గెలుపొందడం విశేషం. ఈ ఫలితాలపై బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగూ బాలలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. బీసీ వర్గాల్లో పెరిగిన రాజకీయ చైతన్యానికి ఈ విజయాలే స్పష్టమైన నిదర్శనమని వారు అభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి 11న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగ్గా, 13న ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే.
ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ బీసీ అభ్యర్థులు 52.75 శాతం సీట్లు గెలుచుకున్నారని కమిషన్ గుర్తుచేసింది. ఇదే స్ఫూర్తితో త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ బీసీలు భారీ సంఖ్యలో గెలుపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 56.33 శాతం ఉన్నారని, వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీ చేసిన చట్టం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని కమిషన్ పేర్కొంది. ఈ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కొందరు కోర్టులను ఆశ్రయించారని తెలిపింది. తాజా ఎన్నికల ఫలితాల నేపథ్యంలో, 42 శాతం రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి వెంటనే ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీసీ కమిషన్ కోరింది. అలాగే, కోర్టులో కేసులు వేసిన వారు వాటిని ఉపసంహరించుకుని బీసీల అభ్యున్నతికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

# కాంగ్రెస్ పార్టీ ముగుగు రాజకీయాలు చేస్తోంది

- మొదటి పేజి తరువాయి

మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... క్యాతనపల్లిలో బీఆర్ఎస్‌కి పూర్తి మెజారిటీ వచ్చినా కాంగ్రెస్ పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని పరిహసించిన తీరును యావత్ తెలంగాణ అసహ్యించుకుంటోందని అన్నారు. అధికార బలం, ధన బలంతో చట్టాలను కాంగ్రెస్ తుంగలో తొక్కుతోందని విమర్శించారు. పోలీసులు కూడా అధికార పార్టీకి పూర్తిగా సహకరిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక చర్యలను అడ్డుకున్నందుకు దళిత నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అరెస్టు చేసి నిర్బంధించడాన్ని ఖండిస్తున్నామని హరీశ్ రావు పేర్కొన్నారు. "జనగాంలో దళిత మహిళా కౌన్సిలర్ బీఆర్ఎస్ కు మద్దతుగా చెయ్యి ఎత్తితే రిటర్నింగ్ ఆఫీసర్ సాక్షిగా కాంగ్రెస్ గూండాలు దాడి చేశారు. అధికారులు, పోలీసులు కళ్లప్పగించి చోద్యం చూశారే తప్ప అడ్డుకోలేదు" అని ఆయన మండిపడ్డారు. క్యాతనపల్లి, తొర్రూరు, జనగాం, ఇబ్రహీంపట్నం, జహీరాబాద్ సహా హంగ్ వచ్చిన ప్రతి చోటా ప్రజా తీర్పును కాంగ్రెస్ గౌరవించలేదని దుయ్యబట్టారు. చైర్మన్ పీఠాలను అడ్డదారుల్లో దక్కించుకుంటున్నారని ఆరోపించారు. భూములను కబ్జా చేసినట్లే, రాజకీయ పీఠాలను కూడా కబ్జా చేస్తున్నారని విమర్శించారు.

# ఇబ్రహీంపట్నం ఛైర్మన్ ఎన్నికపై హైకోర్టు కీలక ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

అధికారి (ఆర్వో)దేనని హైకోర్టు స్పష్టం చేసింది. 16వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన ఆకుల యాదగిరిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావొద్దని జిల్లా కలెక్టర్, పోలీసులను ఆదేశించింది.
ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 16వ వార్డు నుంచి గెలిచిన తన తండ్రి యాదగిరి అదృశ్యమయ్యారంటూ కుమారుడు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ఈరోజు విచారణ జరిపింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు యాదగిరిని హైకోర్టులో ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం ఛైర్మన్ ఎన్నికలపై హైకోర్టు పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది.

**తనను బలవంతంగా తీసుకెళ్లారు: యాదగిరి**

మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడగానే తనను బలవంతంగా చీరాలకు తీసుకువెళ్లారని యాదగిరి కోర్టుకు తెలిపారు. తనను రెండు రోజుల పాటు బలవంతంగా రిసార్టులో ఉంచారని అన్నారు. హైదరాబాద్‌లో 12 గంటల పాటు కారులో తిప్పారని కోర్టు దష్టికి తీసుకువెళ్లారు. హైకోర్టు ఉత్తర్వులతో తాను నిన్న కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యానని అన్నారు.

# చైనా రోబో డాగ్ కొని తామే అభివృద్ధి చేశామని ప్రచారం.. ఏఐ సదస్సులో యూనివర్సిటీ చీటింగ్

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి 'ఏఐ ఇంపాక్ట్' సదస్సులో ఓ యూనివర్సిటీ నిర్వాకంతో కలకలం రేగింది. చైనాకు చెందిన రోబో డాగ్ ను తమ ఆవిష్కరణగా ప్రదర్శించడమే ఈ కలకలానికి కారణం. ఉత్తరప్రదేశ్ కు చెందిన గల్గోటియాస్ యూనివర్సిటీ ప్రతినిధులు ఈ నిర్వాకానికి పాల్పడ్డారు. సోషల్ మీడియాలో ఈ రోబోట్ వీడియోలు వైరల్ కాగా.. చైనాకు చెందిన రోబో డాగ్ ను పోలి ఉందని నెటిజన్లు గుర్తించడంతో యూనివర్సిటీ మోసం బయటపడింది. దీంతో యూనివర్సిటీపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. సదస్సు నుంచి ఆ విద్యాసంస్థను తక్షణమే గెంటివేసి, వారికి కేటాయించిన స్టాల్‌ను అధికారులు ఖాళీ చేయించారు.

**అసలేం జరిగిందంటే..**

గ్రేటర్ నోయిడాకు చెందిన గల్గోటియాస్ యూనివర్సిటీ ఏఐ సదస్సులో ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. తమ విశ్వవిద్యాలయంలోని 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో 'హతీఅశీఅ' పేరుతో ఒక రోబోడాగ్‌ను స్వయంగా అభివృద్ధి చేశామని వర్సిటీ ప్రతినిధులు ప్రచారం చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

**మోసం బయటపడిందిలా..**

యూనివర్సిటీ ప్రదర్శించిన రోబోడాగ్ చైనాకు చెందిన రోబోటిక్ కంపెనీ 'యూనిట్రీ' అభివృద్ధి చేసిన '+శీ2' మోడల్‌ను పోలి ఉందని నెటిజన్లు గుర్తించారు. ఆన్‌లైన్ లో సుమారు రూ.2 లక్షల నుండి రూ.3 లక్షల ధరకు భారతీయులకూ ఈ రోబోడాగ్ అందుబాటులో ఉంది. దీంతో సదరు యూనివర్సిటీ మోసం బయటపడింది. విదేశీ టెక్నాలజీని కొనుగోలు చేసి, దానిని భారత్ ఆవిష్కరణగా ప్రచారం చేసుకోవడంపై నెటిజన్లు తీవ్రంగా విమర్శలు గుప్పించారు.

**యూనివర్సిటీ ఏమంటోందంటే..**

వివాదం ముదరడంతో యూనివర్సిటీ వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేసింది. తాము దానిని చైనా నుంచే కొనుగోలు చేశామని చెప్పింది. విద్యార్థుల పరిశోధనల కోసం ఒక సాధనంగా మాత్రమే
వాడుతున్నామని పేర్కొంది. ఆ రోబో డాగ్ ను తామే అభివృద్ధి చేశామని ఎక్కడా ప్రచారం చేసుకోలేదని పేర్కొంది. అయితే, సోషల్ మీడియాలో ఉన్న వీడియోల్లో మాత్రం ఆ విద్యాసంస్థ ప్రతినిధులు ఇది తమ సొంత ఆవిష్కరణ అని స్పష్టంగా చెప్పడం గమనార్హం.

**కేంద్రం సీరియస్.. కఠిన చర్యలు**

అంతర్జాతీయ ప్రతినిధులు, టెక్ దిగ్గజాలు హాజరైన సదస్సులో ఇలాంటి తప్పుదారి పట్టించే చర్యలకు పాల్పడటంపై కేంద్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశ గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించిన గల్గోటియాస్ యూనివర్సిటీ స్టాల్‌ను తొలగించి, సదస్సు నుంచి వారికి ఉద్వాసన పలికింది.

# భవిష్యత్.. గ్రీన్ ఎనర్జీదే

- మొదటి పేజి తరువాయి

పట్టణాభివృద్ధిలో భాగంగా కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)లో ఏ ఒక్క పరిశ్రమ ఉండదని స్పష్టం చేశారు. మహారాష్ట్రలో క్లైమేట్ వీక్ సదస్సులో ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి..పట్టణాలు, నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణమైన విధానాలపై తెలంగాణ విజన్ ను వివరించారు. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయని అన్నారు సీఎం. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం అభివృద్ధికి కొలమానంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధికి తెలంగాణను జఖ=జు,ూఖ=జు, =ూ=జు జోన్‌లుగా విభజించామని సీఎం తెలిపారు.

# రంజాన్ నెల ప్రారంభం..

## నేటి నుంచి ఉపవాస దీక్షలు

- మొదటి పేజి తరువాయి

ప్రారంభమయ్యాయి. ఈ మాసంలో ప్రతి రోజూ తెల్లవారు జామునుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉంటారు. ప్రత్యేక ప్రార్థనలు, ఆధ్యాత్మిక చింతన, దానధర్మాలు చేస్తారు. రంజాన్ ఇస్లామిక్ చాంద్రమాన క్యాలెండర్‌లో తొమ్మిదవ నెల, ప్రపంచవ్యాప్తంగా ముస్లింలకు అత్యంత పవిత్రమైన నెలగా భావిస్తారు. పవిత్ర మాసానికి ముందే రాష్ట్రవ్యాప్తంగా చాలా మసీదులు అందంగా ముస్తాబు చేశారు.

# దేశ భద్రతకు రాహుల్ అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి

లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ భారత వ్యతిరేక శక్తులతో సంబంధాలు పెట్టుకున్నారని ఆరోపించారు. దేశ భద్రతకు రాహుల్ అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అని మండిపడ్డారు. దేశీయంగా, విదేశీ పర్యటనల్లో రాహుల్ నక్సలైట్లు, తీవ్రవాదులు, జార్జ్ సోరోస్ వంటి దేశ వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో సమావేశాలు జరుపుతున్నారని ఆరోపించారు. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే కూడా రాహుల్ గాంధీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయాలని కోరుతూ లోక్ సభలో మోషన్ ప్రవేశపెట్టారు. జార్జ్ సోరోస్ వంటి దేశ వ్యతిరేక శక్తుల సాయంతో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ, దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆయనపై జీవితకాల నిషేధం విధించాలని కోరారు.

# భారత్‌కు ఇది చరిత్రాత్మక సమయం

- మొదటి పేజి తరువాయి

అయితే ఈ అవకాశంతో పాటు గొప్ప బాధ్యత కూడా ఉంటుందని సుందర్ పిచాయ్ నొక్కిచెప్పారు. ఏఐ పరిశోధనలలో బలమైన పెట్టుబడులు పెట్టాలని, దాని వినియోగాన్ని అన్ని రంగాలకు విస్తరించాలని ఆయన సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ, ఆర్థిక వ్యవస్థలోని ప్రతి విభాగానికి ఏఐ ప్రయోజనాలు చేరేలా పునాది స్థాయి నిర్మాణం జరగాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. గత కొన్నేళ్లుగా భారత్ డిజిటల్ రంగంలో అద్భుతమైన పురోగతి సాధించిందని పిచాయ్ ప్రశంసించారు. "భారతీయ వినియోగదారులు వాయిస్ ఆధారిత, ఇమేజ్ ఆధారిత సెర్చ్‌లను ప్రపంచంలోనే అత్యధికంగా స్వీకరిస్తున్నారు. ఇది దేశ ప్రజలు కొత్త టెక్నాలజీలను ఎంత వేగంగా అందిపుచ్చుకుంటున్నారో చూపిస్తోంది," అని ఆయన తెలిపారు. గూగుల్ ఏఐ టూల్ 'జెమినై'కి భారతదేశం అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా నిలవడం, ఇక్కడి వినియోగదారులలో ఏఐ పట్ల పెరుగుతున్న ఆసక్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా, సుందర్ పిచాయ్ ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏఐ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతి, దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, నిపుణులతో గూగుల్ ఎలా కలిసి పనిచేయగలదనే అంశాలపై వారు చర్చించారు. ఈ భేటీపై ప్రధాని మోదీ స్పందిస్తూ, ఏఐ రంగంలో ప్రభుత్వం, గూగుల్ మధ్య సహకారాన్ని మరింతగా పెంచుకునే అవకాశాలపై పిచాయ్‌తో ఫలవంతమైన చర్చలు జరిపినట్లు తెలిపారు.
భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయాల్సిన అవసరాన్ని కూడా పిచాయ్ ప్రస్తావించారు. పాఠశాల విద్యార్థులలో చిన్న వయసు నుంచే ఆవిష్కరణ, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో 'అటల్ టింకరింగ్ ల్యాబ్స్'తో కలిసి గూగుల్ పనిచేస్తోందని, తరగతి గదుల్లోకి రోబోటిక్స్, కోడింగ్‌ను తీసుకువెళుతున్నామని వివరించారు. సరైన పెట్టుబడులు, విధానాలు అమలు చేస్తే, భారతదేశ సమగ్ర అభివృద్ధికి, దీర్ఘకాలిక పరివర్తనకు ఏఐ ఒక శక్తివంతమైన సాధనంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# మంత్రి కాన్వాయ్‌పై దాడి... బాల్క సుమన్ అరెస్టు

- మొదటి పేజి తరువాయి

సుమన్‌ను అరెస్టు చేసే సమయంలో కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయగా, పోలీసులు వారిపై లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టారు. క్యాతనపల్లిలోని ఆయన నివాసంలో బాల్క సుమన్‌ను అరెస్టు చేసిన పోలీసులు మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం రామగుండం తరలించనున్నారు. వివేక్ కాన్వాయ్‌పై దాడికి సంబంధించి రామకృష్ణాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏ1గా బాల్క సుమన్, ఏ2గా మూల రాజిరెడ్డి పేర్లను పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి మెజారిటీ స్థానాలు వచ్చాయి. అయితే కుట్రపూరితంగా మున్సిపాలిటీని చేజిక్కించుకోవాలని మంత్రి వివేక్ ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ క్రమంలో ఈరోజు బీఆర్ఎస్, సీపీఐ పార్టీలు కలిసి క్యాతనపల్లి బంద్ కు పిలుపునిచ్చాయి.

## రేవంతన్న భరోసా..! ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన..

ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన కింద మొత్తం 232 మంది లక్ష్యంగా నిర్ణయించగా, ప్రస్తుతం పథకానికి అర్హులను 225 మందిని ఎంపిక చేసినట్లు మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు.. అందులో 5 మందికి మాత్రం మొదటి విడతలో చెక్కులను పంపిణీ చేశారు.. ప్రతి నిరుపేద మహిళకు రూ.50 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు.. అదేవిధంగా రేవంత్ అన్న భరోసా పథకం కింద మైనారిటీలకు బైకుల పంపిణీ చేపట్టారు. మేడ్చల్ జిల్లాలో 25 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, ప్రతి వాహనం రూ.1 లక్ష విలువ కలిగి ఉందని. ప్రస్తుతం 13 మందికి వాహనాలు అందజేస్తున్నట్లు మహేందర్‌రెడ్డి వివరించారు.మైనారిటీల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో సహాయ కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు..

# పెన్ పవర్ తెలంగాణ రౌండప్



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి..

యువతకు వాహనాలు అందిస్తున్న మంత్రి అజారుద్దీన్,మహేందర్ రెడ్డి.

# మైనారిటీలకు ఆర్థిక బలం..!

- రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యతపై నేతలు స్పష్టం..
- ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన కింద 232 మంది టార్గెట్..!
- ఎంపికైన 225 వారి నుండి 5 మందికి తొలి చెక్కులు పంపిణీ..
- ప్రతి నిరుపేద మహిళకు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్న ప్రభుత్వం..
- రేవంతన్న భరోసా పథకం కింద జిల్లాలో 25 మందికి వాహనాలు మంజూరు..
- మొదటి విడతలో ప్రస్తుతం 13 మందికి వాహనాలు అందజేత..
- మైనారిటీల స్వయం ఉపాధి, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం దృష్టి..

### మహిళలకు నగదు.. యువతకు వాహనాలు..!
### తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ సహాయ కార్యక్రమం ప్రారంభం..

మైనారిటీల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన, రేవంత్ అన్న భరోసా పథకాల కింద నగదు సహాయం, వాహనాల పంపిణీ చేపట్టింది. ఉమ్మడి రంగారెడ్డి- మేడ్చల్ జిల్లాల లబ్ధిదారులకు మొదటి విడతగా చెక్కులు, బైకులు అందజేశారు.. మైనారిటీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉందని కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు పేర్కొన్నారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఫిబ్రవరి 18:**

తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ కార్పొరేషన్ ద్వారా మైనారిటీలకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమం బుధవారం నిర్వహించబడింది.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం సలహాదారు షబ్బీర్ అలీ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కోత్వాల్, గురుకుల పాఠశాల చైర్మన్ ఫయిమ్, ఎంఎల్సీలు ఇంఫెండీ, మీర్జా రహమత్ బేగ్, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ సెక్రటరీ షఫీఉల్లా, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు..ఈ సందర్భంగా డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు.. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మైనారిటీల అభ్యున్నతికి కృషి చేస్తుండగా తాము అండగా నిలుస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.. రాష్ట్రవ్యాప్తంగా అందిస్తున్న ఆర్థిక సహాయం కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన మైనారిటీలకు సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని పేర్కొన్నారు..



షబ్బీర్ అలీ చేతుల మీదుగా మైనారిటీ మహిళలకు చెక్కులు అందజేత..

## వారాంతపు 'సంత'కు బ్రేక్..!
## ట్రాఫిక్ కష్టాలకు చెక్..!

సూరారం ఎక్స్ రోడ్డునుండి- సూరారం విలేజ్ మార్గంలో వారాంతపు సంత..

వారానికోసారి ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల నరకయాతన..

- పెద్దచెరువు కట్టుకాలువ బ్రిడ్జ్‌పై ఇరువైపులా శాశ్వత కూరగాయల మార్కెట్ ఒకవైపు..
- దీనికితోడు వారానికోసారి సంత ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య రాకపోకలకు అంతరాయం..
- జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసుల జోక్యంతో సంతను తిరుమల కాలనీకి మార్పు..
- ఊపిరి పీల్చుకున్న స్థానిక ప్రజలు ఇన్‌స్పెక్టర్‌కి శాలువాతో సన్మానం..
- పర్యావరణ ప్రేమికుడు సామాజిక వేత్త రవిందర్ ముదిరాజ్ ఇన్‌స్పెక్టర్‌కి కృతజ్ఞతలు.

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో..
## 'అనీశా' ఆకస్మిక తనిఖీలు..

అవినీతిపై ఫిర్యాదులు..! కార్యాలయం తెరవక ముందే కాచుకు కూర్చున్న ఏసీబీ..

- శానిటేషన్- రెవెన్యూ (ట్యాక్స్ విభాగం), టౌన్‌ప్లానింగ్‌పై ఆరోపణల ఫిర్యాదులు..
- ఉదయం ఉప కమిషనర్‌తో మొదలైన ఏసీబీ అధికారుల విచారణ..
- మధ్యాహ్నం నుండి టౌన్‌ప్లానింగ్ విభాగం, మరో రెండు విభాగాలపై ఆరా..!
- పలువురు సిబ్బంది గైర్హాజరు.. సెల్ ఫోన్‌లు స్విచ్ ఆఫ్..
- అర్ధరాత్రి వరకు వివిధ శాఖల అధికారులు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని విచారణ..
- ఏసీబీ నిఘా 6 నెలల పాటు ఉంటుంది: మీడియాతో "అనీశా డిఎస్‌పి"..
- విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఏసీబీ డిఎస్‌పి జి.శ్రీదర్..

-4 లో



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఏసీబీ అధికారుల వరుస సోదాలను అధికార యంత్రాంగం ముందే పసిగట్టే విధంగా ఉన్నాయని స్పష్టమవుతుంది.. మొన్న (మంగళవారం) చింతల్ జీహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టగా..! నిన్న (బుధవారం) దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో ఆకస్మిక సోదాలు నిర్వహించారు.. రేపు మిగిలిన నిజాంపేట్ సర్కిల్‌పై తనిఖీలు చేపట్టినా ఆశ్చర్యం లేదని పలువురు జోస్యం చెబుతున్నారు.. గతంలో ఓ ఘటన ఫిర్యాదుపై చింతల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై ఏసీబీ రైడ్స్ నిర్వహించగా..! దుండిగల్ సర్కిల్‌లో మాత్రం కొంచెం వ్యత్యాసంగా ఆకస్మిక సోదాలు నిర్వహించారు.. ఏదిఏమైనప్పటికీ మున్సిపాలిటీలు జీహెచ్ఎంసిలో విలీనంతో, పలు కీలక ఫైళ్ళు ఉన్నతాధికారులకు అప్పగించాక, ఈ ఏసీబీ సోదాలలో ఏం కనిపెడతారు, అనే విమర్శలు కూడా వస్తున్నాయి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఫిబ్రవరి 18:**

## మీ పార్టీ హామీలు,వైఫల్యాలపై
# చర్చించండి

### కాంగ్రెస్ అగ్రనేతలకు హరీశ్‌రావు బహిరంగ లేఖ



హైదరాబాద్ పెన్ పవర్: ఢిల్లీలో గురువారం తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులతో జరగనున్న సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, వాటి అమలులో వైఫల్యాలపై చర్చించాలని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు డిమాండ్ చేశారు. హామీల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డికి దిశానిర్దేశం చేయాలని కోరుతూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మీనాక్షి నటరాజన్, సిద్ధరామయ్యలకు బుధవారం హరీశ్‌రావు వేర్వేరుగా బహిరంగ లేఖలు రాశారు. "తెలంగాణ క్యాబినెట్‌ను ఢిల్లీకి పిలిపించుకుని.. మీరు చేయబోయే 'సమీక్ష'ను చూస్తుంటే ప్రజాస్వామ్యం సిగ్గుతో తలదించుకుంటోంది. స్వయంపాలన కోసం, స్వీయ రాజకీయ అస్తిత్వం కోసం ప్రాణత్యాగాలు చేసి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవాన్ని ఇది భంగపరుస్తోంది. తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై సమీక్ష నిర్వహిస్తున్న మీకు ఎన్నికల సమయంలో తెలంగాణకు వచ్చి ఇచ్చిన మీ హామీలను గుర్తు చేస్తున్నా. వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి.. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచింది. సోనియాగాంధీ స్వయంగా రాసిచ్చిన బాండ్ పేపర్లకు విలువ లేకుండా పోయింది. రైతు డిక్లరేషన్‌ను విస్మరించారు. రెండు లక్షల ఉద్యోగ నియామకాలు చేస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటించి క్రమం తప్పకుండా ఖాళీలు భర్తీ చేస్తామని, నిరుద్యోగులకు రూ.4,000 భృతి ఇస్తామని, 18 ఏళ్లు పైబడిన ప్రతి యువతికి ఎలక్ట్రిక్ స్కూటరు ఇస్తామని సరూర్‌నగర్ స్టేడియంలో చేసిన ప్రకటన ఇంతవరకూ అమలు కాలేదు. ఎస్సీల రిజర్వేషన్లు 18శాతానికి పెంచుతామని, అన్ని ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంట్లలో, కాంట్రాక్టుల్లో ఎస్సీలకు 18%, ఎస్టీలకు 12% రిజర్వేషన్లు కల్పిస్తామని చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను పూర్తిగా గాలికొదిలేశారు. ఇక వేటిపై సమీక్ష చేస్తారు? ఈ గడ్డ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాలని చూస్తే.. మీ కాంగ్రెస్‌ను చరిత్ర క్షమించదు" అని హరీశ్‌రావు లేఖల్లో విమర్శించారు.


డిప్యూటీ కమిషనర్ విచారణ సందర్భంలో, ఇతరులు లోనికి వెళ్ళకుండా..


గంగసాని శ్రీదర్.. ఏసీబి డీఎస్పి

- శానిటేషన్- రెవెన్యూ (ట్యాక్స్ విభాగం), టౌన్‌ప్లానింగ్‌పై ఆరోపణల ఫిర్యాదులు..
- ఉదయం ఉప కమిషనర్‌తో మొదలైన ఏసీబీ అధికారుల విచారణ..
- మధ్యాహ్నం నుండి టౌన్‌ప్లానింగ్ విభాగం, మరో రెండు విభాగాలపై ఆరా..!
- పలువురు సిబ్బంది గైర్హాజరు.. సెల్ ఫోన్‌లు స్విచ్ ఆఫ్..
- అర్ధరాత్రి వరకు వివిధ శాఖల అధికారులు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని విచారణ..
- ఏసీబీ నిఘా 6 నెలల పాటు ఉంటుంది: మీడియాతో "అనీశా డిఎస్పి"..
- విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఏసీబీ డిఎస్పి జి.శ్రీదర్..

# దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో...

# 'అనీశా' ఆకస్మిక తనిఖీలు

## అవినీతిపై ఫిర్యాదులు..! కార్యాలయం తెరవక ముందే కాచుకు కూర్చున్న ఏసీబీ..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఏసీబీ అధికారుల వరుస సోదాలను అధికార యంత్రాంగం ముందే పసిగట్టే విధంగా ఉన్నాయని స్పష్టమవుతుంది.. మొన్న (మంగళవారం) చింతల్ జీహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టగా..! నిన్న (బుధవారం) దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో ఆకస్మిక సోదాలు నిర్వహించారు.. రేపు మిగిలిన నిజాంపేట్ సర్కిల్‌పై తనిఖీలు చేపట్టినా ఆశ్చర్యం లేదని పలువురు జోస్యం చెబుతున్నారు.. గతంలో ఓ ఘటన ఫిర్యాదుపై చింతల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై ఏసీబీ రైడ్స్ నిర్వహించగా..! దుండిగల్ సర్కిల్‌లో మాత్రం కొంచెం వ్యత్యాసంగా ఆకస్మిక సోదాలు నిర్వహించారు.. ఏదిఏమైనప్పటికీ మున్సిపాలిటీలు జీహెచ్ఎంసిలో విలీనంతో, పలు కీలక ఫైళ్ళు ఉన్నతాధికారులకు అప్పగించాక, ఈ ఏసీబీ సోదాలలో ఏం కనిపెడతారు, అనే విమర్శలు కూడా వస్తున్నాయి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఫిబ్రవరి 18:**




పరిపాలనా సౌలభ్యం కోసం, సుమారు ఎనిమిదేళ్ళ క్రితం, హైదరాబాద్ శివారు గ్రామపంచాయతీలను, మున్సిపాలిటీలు, కార్పోరేషన్ లుగా రూపొందించారు.. అందులో దుండిగల్ పురపాలక సంఘం ఒకటి..! ఈ మున్సిపాలిటీని ఈ మధ్యనే జీహెచ్ఎంసిలో విలీనం చేసిన సంగతి తెలిసిందే.. ఈ దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (అనీశా) అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.. ఏసీబీ డిఎస్పి గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో బృందం, బుధవారం ఉదయం ఆఫీస్ తెరవక ముందే, కాచుకు కూర్చుని, కార్యాలయం తెరవగానే ఉన్నపళంగా అనీశా బృందం రంగంలోకి దిగి తనిఖీలు ప్రారంభించింది..అధికారులు నేరుగా డిప్యూటీ కమీషనర్ ఎన్. వెంకటేశ్వర్ నాయక్ క్యాబిన్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు.. ఆయా శాఖల అధికారుల తోపాటు వివిధ శాఖల ఉద్యోగుల సెల్ ఫోన్‌లు కంప్యూటర్లు స్వాధీనం చేసుకున్నారు.. ఏసీబి అధికారులు వరుస దాడులు నిర్వహిస్తుండడంతో అవినీతి అధికారులకు గుబులు పుట్టిస్తోంది.. మంగళవారం చింతల్ సర్కిల్‌లో తనిఖీలలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌పై విచారణ చేపట్టి, కేసునమోదు చేయగా..! దుండిగల్ సర్కిల్‌లో పలు విభాగాల అధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణల ఫిర్యాదులు స్వీకరించిన ఏసీబీ అధికారులు, బుధవారం ఉదయం నుండే తనిఖీలు నిర్వహించారు..


ఏసీబి అధికారుల వాహనాలు..

### నోటీసులు ఇచ్చుడే కానీ.. చర్యలు శూన్యం: ఏసీబి

ఏసీబీ టౌన్‌ప్లానింగ్ విభాగంపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్లు సమాచారం.. ఇటీవల మున్సిపాలిటీ నుండి జీహెచ్ఎంసికి మారడం వల్ల రికార్డులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవన్నారు, ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఎక్కువ అవినీతి జరిగిందన్నారు.. అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసి మూడు నెలలు గడుస్తున్నా వాటిపై చర్యలు తీసుకోలేదన్నారు.. ఆ దశలో పూర్తి స్థాయిలో విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్దేశ పూర్వకంగా గైర్హాజరు అయిన ఉద్యోగులపై చర్యలు ఉంటాయన్నారు.. మరికొన్ని రోజులు దాడులు తప్పవని హెచ్చరించారు..

### పలువురు అధికారులు గైర్హాజరు.. అనాథరైజ్డ్ సిబ్బందిని గుర్తింపు..

ఏసిబి అధికారులు దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో తనిఖీలు చేపడుతున్న సమాచారం తెలుసుకున్న రెవెన్యూ(ట్యాక్స్), శానిటరీ, టౌన్‌ప్లానింగ్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు చెందిన ఉన్నతాధికారుల తోపాటు, ఆయా శాఖల ఔట్ సోర్సింగ్ సిబ్బంది, బుధవారం గైర్హాజరు అయినట్టు ఏసిబి డిఎస్పి గంగసాని శ్రీదర్ అనుమానాలు వ్యక్తం చేశారు.. వారి సెల్ ఫోన్లు సైతం స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు తెలిపారు.. ఆయా విభాగాలకు చెందిన రికార్డులను పరిశీలించిన అధికారులు, టౌన్‌ప్లానింగ్ శానిటేషన్, రెవెన్యూ విభాగాల్లో అవినీతి జరిగినట్లు గుర్తించారు.. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్ పి గంగసాని శ్రీధర్ మాట్లాడుతూ, ఫిర్యాదుల్లో భాగంగానే ఈ ఆకస్మిక తనిఖీలు చేసినట్లు తెలిపారు.. అనాథరైజ్డ్ ఉద్యోగులను గుర్తించామన్నారు, సానిటేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి, రికార్డుల్లో చూపుతున్న సిబ్బందికి పొంతన లేదన్నారు, ఫిర్యాదులో భాగంగానే ప్రతి విభాగాన్ని క్షున్నంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.. ప్రతి శాఖలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు..

---

# వారాంతపు 'సంత'కు బ్రేక్..! ట్రాఫిక్ కష్టాలకు చెక్..!

## సూరారం ఎక్స్ రోడ్డునుండి- సూరారం విలేజ్ మార్గంలో వారాంతపు సంత..

## వారానికోసారి ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల నరకయాతన..


పెన్ పవర్ PEN POWER
3
పెన్ పవర్
తెలంగాణ రౌండప్
BHOGI
అక్షర్లేని మంటల్లో.. ఆనందాల భాగ్యాల్లో
వారాంతపు సంతలతో...
జనం ఉక్కిరిబిక్కిరి

వారాంతపు సంతతో ట్రాఫిక్ సమస్యపై 'పెన్ పవర్' దినపత్రికలో కథనం..

- పెద్దచెరువు కట్టుకాలువ బ్రిడ్జ్‌పై ఇరువైపులా శాశ్వత కూరగాయల మార్కెట్ ఒకవైపు..
- దీనికితోడు వారానికోసారి సంత ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య రాకపోకలకు అంతరాయం..
- జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసుల జోక్యంతో సంతను తిరుమల కాలనీకి మార్పు..
- ఊపిరి పీల్చుకున్న స్థానిక ప్రజలు ఇన్‌స్పెక్టర్‌కి శాలువాతో సన్మానం..
- పర్యావరణ ప్రేమికుడు సామాజిక వేత్త రవిందర్ ముదిరాజ్ ఇన్‌స్పెక్టర్‌కి కృతజ్ఞతలు.



జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహరావును శాలువాతో సత్కరిస్తున్న రవిందర్ ముదిరాజ్..


**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఫిబ్రవరి 18:** వారాంతపు సంతను, వేరేచోటకు మార్పుతో స్థానికులు, వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.. సాధారణంగానే సూరారం క్రాస్‌రోడ్డు నర్సాపూర్ హైవే అయినందున నిత్యం ట్రాఫిక్ జామ్‌తో రద్దీగా ఉంటుంది.. ఈ రద్దీ సమస్య గురించి అందిరికీ తెలిసిందే.. దీనికి తోడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సూరారం గ్రామానికి వెళ్లే మార్గంలో, మియాపూర్ హైవేను కలిపే 100 అడుగుల హెచ్‌ఎండీఏ రోడ్డుపై వారానికోసారి తీవ్రమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. ఈ రోడ్డులో మరో ప్రధాన సమస్య, జీహెచ్ఎంసి టౌన్‌ప్లానింగ్ నిర్లక్ష్యం, స్పష్టంగా కనిపిస్తుంది.. మాస్టర్ ప్లాన్ రోడ్డును, ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా పట్టించుకోకుండా, ముడుపులకే ప్రాధాన్యత ఇచ్చారు.. ఈ ట్రాఫిక్ సమస్యల పాపంలో, జీహెచ్ఎంసి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల పాత్ర కీలకమని చెప్పవచ్చు.. ఈ టౌన్‌ప్లానింగ్ నిర్లక్ష్యంతో 100 ఫీట్ల మాస్టర్ ప్లాన్ రోడ్డును 60 ఫీట్లకే కుదించి నికరం చేశారు.. ఈ 60 ఫీట్ల రోడ్డులోనే సూరారం వెళ్లే దారిలో ఉన్న పెద్దచెరువు కట్టుకాలువపై, బ్రిడ్జ విశాలంగా ఉన్నప్పటికీ..! స్థానిక చిన్నపాటి నాయకుల పెత్తనం కారణంగా బ్రిడ్జ్‌కి ఇరువైపులా శాశ్వత కూరగాయల మార్కెట్ ఏర్పడింది.. ఈ షాపుల నుండి కొందరు అనధికారికంగా అద్దె డబ్బులు వసూళ్ళు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు..

### ప్రతి శనివారం సంతతో నరకమే ఉండేది..!

మాస్టర్ ప్లాన్ 100 ఫీట్ల రోడ్డును, 60 ఫీట్లకు కుదించారు.. ఆ కుదించిన రోడ్డులో కూడా బ్రిడ్జ్‌పై ఇరువైపులా శాశ్వత కూరగాయల మార్కెట్ ఉండగా..! అది చాలదన్నట్టు ప్రతి శనివారం నిర్వహించే వారాంతపు సంతతో రాకపోకలు పూర్తిగా స్తంభించేవి.. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి లక్ష్మీనగర్ వరకు సంత విస్తరించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు మరింత పెరిగాయి. బ్రిడ్జ్‌పై ఉన్న శాశ్వత మార్కెట్ దుకాణాలను తొలగించాలని పలువురు స్థానికులు డిమాండ్ చేశారు.. ఈ ట్రాఫిక్ సమస్యలపై స్థానికుడు, పర్యావరణ ప్రేమికుడు సామాజిక వేత్త కోలా రవిందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పలుమార్లు ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.. దీంతో ఈ సమస్యపై స్పందించిన ట్రాఫిక్ పోలీసులు వారాంతపు సంతను తొలగించి, సమీపంలోని తిరుమల కాలనీకి మార్చడంతో వాహనదారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.. ప్రతి వారం సూరారం గ్రామానికి వెళ్లే రహదారిపై వందలాది వాహనాలు నిలిచిపోయే పరిస్థితి ఉండేదని స్థానికులు తెలిపారు. ట్రాఫిక్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవడంతో రవాణా సమస్య గణనీయంగా తగ్గిందని వారు కృతజ్ఞతలు తెలిపారు.. ఈ సందర్భంగా సూరారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహరావును పర్యావరణ ప్రేమికుడు, సామాజికవేత్త కొల రవీందర్ ముదిరాజ్ శాలువా, పూలమాలతో సన్మానం చేశారు.. సాయిబాబా నగర్ కాలనీ లోనూ ప్రతి బుధవారం ఇలాంటి సమస్యలు ఉన్నాయని, వాటికి పరిష్కారం చూపాలని కోరారు. అలాగే వారాంతపు సంతల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ పర్యావరణ హిత బ్యాగులు వినియోగించాలని వ్యాపారులకు మైక్ ద్వారా సూచించాలని, రవిందర్ ముదిరాజ్ అభ్యర్థించారు.. "మనమంతా ఏకమై పర్యావరణాన్ని కాపాడుకుందామని" పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, వేణు, కృష్ణ, విక్కీ తదితరులు పాల్గొన్నారు..

# రాజ్యసభ కోసం పోటీ

**హైదరాబాద్ పెన్ పవర్:** :తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. ప్రస్తుత సభ్యులు అభిషేక్ మను సింఘ్వీ , కె.ఆర్. సురేష్ రెడ్డి ల పదవీకాలం ఏప్రిల్ 9తో ముగియనుంది. వీరిలో సింఘ్వీ కాంగ్రెస్ నుంచి.. సురేష్ రెడ్డి బీఆర్ఎస్ నుంచి ఎంపికయ్యారు. మార్చి 16న జరగనున్న ఈ ఎన్నికల్లో శాసనసభలో ఉన్న బలాబలాల ప్రకారం ఈ రెండు స్థానాలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. పార్టీల బలాబలాల విశ్లేషణను పరిశీలిస్తే, 119 స్థానాలున్న తెలంగాణ అసెంబ్లీలో ఒక రాజ్యసభ సీటు గెలవడానికి సుమారు 40 మొదటి ప్రాధాన్యతా ఓట్లు అవసరం. కాంగ్రెస్ పార్టీకి సొంతంగా 65 మంది ఎమ్మెల్యేలు ఉండటమే కాకుండా, ఇతర పార్టీల నుండి చేరిన ఎమ్మెల్యేల మద్దతుతో రెండు స్థానాలను సులువుగా గెలుచుకునే అవకాశం ఉంది. మరోవైపు, ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ తన వద్ద ఉన్న సంఖ్యాబలం సరిపోకపోవడంతో ఈసారి తన స్థానాన్ని కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది. బీజేపీ, మజ్లిస్ ఎవరికీ మద్దతుగా ఓట్లేసే అవకాశం లేదు. మజ్లిస్ ఒక వేళ ఓటింగ్ లో పాల్గొంటే కాంగ్రెస్‌కు సహకరిస్తుంది. అందుకే రెండు సీట్లు కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్తాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.అందుకే కాంగ్రెస్‌లో అభ్యర్తులు ఎక్కువగా పోటీ పడుతున్నారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీకి రెన్యువల్ దాదాపు ఖాయమని తెలుస్తోంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ గళాన్ని వినిపించడంలో, పార్టీకి సంబంధించిన న్యాయపరమైన అంశాలను డీల్ చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఉప ఎన్నిక ద్వారా ఆయన తెలంగాణ నుంచి ఎంపికయ్యారు, ఇప్పుడు పూర్తి కాలానికి గాను ఆయనను హైకమాండ్ మళ్ళీ బరిలోకి దింపే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం.ఇక రెండో స్థానం కోసం తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. అలాగే మాజీ మంత్రి, సీనియర్ నేత టి. జీవన్ రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, మాజీ విసి సుదర్శన్ రెడ్డి, పార్టీలో సీనియర్ అయిన వి. హనుమంతరావు, ఇటీవల బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కె. కేశవరావు వంటి హేమాహేమీలు ఈ రేసులో ఉన్నారు. సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని అధిష్టానం ఎవరిని వరిస్తుందో చూడాలి.ఈ ఎన్నికల ప్రక్రియ ఫిబ్రవరి 26న నోటిఫికేషన్‌తో ప్రారంభమై మార్చి 16న పోలింగ్, అదే రోజు కౌంటింగ్‌తో ముగియనుంది. సింఘ్వీ అభ్యర్థిత్వం దాదాపు ఖరారు కావడంతో, మిగిలిన ఒక్క సీటు కోసం పైరవీలు ఢిల్లీ స్థాయికి చేరుకున్నాయి. పార్టీ విధేయులకే ప్రాధాన్యత ఉంటుందని అధిష్టానం సంకేతాలు ఇస్తున్న సమయంలో , ఈ రెండో బెర్త్ ఎవరికి దక్కుతుందనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.




## యాంత్రీకరణ స్కీం రైతుల పాలిట వరం:

## దేవరకద్ర ఎమ్మెల్యే



**దేవరకద్ర, ఫిబ్రవరి 18 పెన్ పవర్:**దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని రైతువేదిక వద్ద బుధవారం, ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న వ్యవసాయ పరికరాలు, రోటవేటర్, కల్టివేటర్, వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభివృద్ధికి కట్టుబడి ఉందని, గత ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## తాడిపర్తి రహదారి దుస్థితి: కొత్త రోడ్డుకు సర్పంచ్, గ్రామస్థుల విజ్ఞప్తి

**వనపర్తి, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం తాడిపర్తి గ్రామం నుంచి చెన్నూరు, వెనికితాండ, ముందరితాండకు వెళ్లే రహదారి అధ్వానంగా మారిందని సర్పంచ్ శారద సురేష్ నాయక్, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గుంతలమయమైన, కంకర తేలిన ఈ రోడ్డుపై బైకులు, ఆటోలు, స్కూల్ బస్సులు నడపడం ప్రమాదకరంగా మారిందని తెలిపారు. 24 గంటల పాటు రాకపోకలు సాగించే ఈ మార్గంలో అధికారులు వెంటనే స్పందించి కొత్త రోడ్డు నిర్మించాలని సర్పంచ్, గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

## బిజ్వారం గ్రామంలో కొత్త విద్యుత్ దీపాల ఏర్పాటు

**గద్వాల, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని బిజ్వారం గ్రామంలో, గ్రామ సర్పంచ్ శైలజ శ్రీనివాస్ రెడ్డి సహకారంతో 7వ వార్డులో కొత్త విద్యుత్ లైన్లు, స్తంభలకు దీపాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు నెంబర్ హరిన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బి. నారాయణ నాయుడు, తిమ్మప్ప, గోపాల్, రాముడు, పరుష, నరేష్, మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం.. కూలీకి తీవ్ర గాయాలు

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం భూత్ పూర్ మండల కేంద్రంలో బుధవారం డివైడర్ కు రంగులు వేస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. మదనపూర్ మండలం గోపన్నపేటకు చెందిన రంగన్న(55) అనే కూలీని వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రంగన్న కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను 108 అబులెన్స్ లో ప్రథమ చికిత్స నిమిత్తం మహబూబ్ నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## నారాయణపేటలో చిరుత బందీ.!

**నారాయణపేట, ఫిబ్రవరి 18 పెన్ పవర్:**నారాయణపేట జిల్లా మద్దూరు మండలం రేణివట్ల, మోమినాపూర్, అచ్చంపల్లి శివారులో సంచరిస్తున్న చిరుతపులిని బుధవారం అటవీ శాఖ అధికారులు ఎట్టకేలకు బంధించారు. స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన ఫారెస్ట్ సిబ్బంది, ప్రత్యేక జాలీలు (నెట్స్) ఏర్పాటు చేసి చిరుతను పట్టుకున్నారు. పరిసరాల్లో మరికొన్ని చిరుతలు ఉన్నట్లు సమాచారం అందడంతో, వాటిని పట్టుకునేందుకు కూడా గాలింపు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

## మర్రిగూడలో రోడ్డు మరమ్మతులు: సర్పంచ్‌కు గ్రామస్తుల కృతజ్ఞతలు

**మునుగోడు, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** నల్గొండ జిల్లా, మునుగోడు నియోజకవర్గంలోని మర్రిగూడ మండల కేంద్రంలో, స్థానిక రైతు వేదిక కార్యాలయం నుంచి ఎంపీడీఓ ఆఫీస్ వెళ్లే దారిలో చాలా కాలంగా రోడ్డుపై మురుగు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సమస్యపై స్పందించిన గ్రామ సర్పంచ్ వీరమళ్ళ శిరీష–లోకేష్ గౌడ్, దెబ్బతిన్న రోడ్డుకు నూతనంగా మరమ్మతులు చేపట్టి, సిమెంట్ పైపులు ఏర్పాటు చేసి, మట్టి పోసి రోడ్డును పునరుద్ధరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణలో సౌర విద్యుత్: రూ.944 కోట్లు మంజూరు

**నల్లగొండ, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలో సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 944 కోట్లను కేటాయించింది. హాలియాలో జరిగిన అవగాహన సదస్సులో టీజీఎస్‌పీడీఎల్ సీఎండీ ముషారఫ్ అలీఫారూఖీ ఈ వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలోని 81 గ్రామాల్లో సౌర విద్యుత్ ఏర్పాటు చేయనుండగా, కొండారెడ్డిపల్లిలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. అనుముల గ్రామాన్ని సోలార్ విద్యుదీకరణకు ఎంపిక చేశారు. గృహ జ్యోతి వినియోగదారులకు రెండు కిలోవాట్ల సోలార్ ప్యానెల్ బిగిస్తారు. అనుముల మండలంలో 605 మంది వినియోగదారులకు ఈ పథకం వర్తిస్తుంది. 7.5 కిలోమీటర్ల పరిధిలోని వ్యవసాయ వినియోగదారులకు కూడా సోలార్ ప్యానెల్స్ అమర్చుతారు. అనుముల గ్రామానికి పూర్తిస్థాయి సౌర విద్యుత్ అందించడానికి రూ.44.94 కోట్లు మంజూరు చేశారు.

# జీవన్గి కుస్తీ-పోటీలో ఫైనల్లో ఫైల్వాన్ మొదటి బహుమతి గెలుపొందిన కర్ణాటక వాసి సేడం మహేష్

**–రెండో బహుమతి మహారాష్ట్ర రామలింగ్**
**బహుమతులు అందజేసిన ఆలయ కమిటీ పూజారులు**

**జహీరాబాద్: పెన్ పవర్:** బషీరాబాద్ మండలంలో కర్ణాటక సరిహద్దులో ఉన్న జీవన్గి గ్రామంలో వెలిసిన అతి పూర్వకమైన శ్రీ మహాదేవ లింగేశ్వర జాతర ఉత్సవాల సందర్భంగా 40 సంవత్సరాల నుండి ఒక ఆనవాయితీగా వస్తున్న అవే ఈ కుస్తీ పోటీలు మంగళవారం కాగ్నా నది ఒడ్డున వెలిసిన శ్రీ మహాదేవ లింగేశ్వర దేవాలయం దగ్గర ఇసుక దిమ్మెలలో కుస్తీ పోటీలు ప్రారంభమైంది ఇక్కడ చిన్నపిల్లల నుండి సుమారుగా పది సంవత్సరాల వారు పూజ టెంకాయ నుంచి ప్రారంభమై, ఇక నగదు రూపంలో నుండి కుస్తీల నగదు రూపాయలు పెరుక్కుంటూ పోతుంది, ఫైనల్ కి వచ్చేవరకు 4000 రూపాయల వరకు దేవస్థానం కమిటీ వారు అందజేయడం జరిగింది పక్క రాష్ట్రం నుండి కర్ణాటక, మహారాష్ట్ర గుల్బర్గా, బీదర్, వంటి జిల్లాల నుండి సుమారుగా 150 మంది యువకులు కుస్తీ పోటీలో పాల్గొనడానికి వచ్చారు, వికారాబాద్ జిల్లా నుండి, మరియు తాండూర్ నియోజకవర్గంలో వివిధ గ్రామాల నుంచి కరణ్ కోట్, బషీరాబాద్, దామర్ చెడ్, గంగ్వార్, క్యాద్గిర, మైల్వార్, బషీరాబాద్, చంద్రవంచ, మంతటి, రెడ్డి ఘనపూర్, కొర్విచెడ్, మంతటి, రెడ్డి ఘనపూర్, దామర్చేడ్, అల్లాపూర్ ఇందర్ చెడ్, పలు గ్రామాల నుంచి భారీగా యువకులు 200 పైగా కుస్తీ పోటీలో పాల్గొనడం జరిగింది, ఆలయ కమిటీ వారు తాండూర్ డి.ఎస్.పి, సీఐ, ఎస్సైలు, కుస్తీ పోటీలను చూడడం జరిగింది ఇట్టి కుస్తీపోటులో గెలుపొందిన మొదటి బహుమతి సెడం మహేష్ కు 5తులాల వెండి కడియాన్ని, రెండవ బహుమతి మహారాష్ట్ర రామలింగ్ రెండున్నర తులాల వెండి కడియాన్ని ఆలయ కమిటీ పూజారులు గెలుపొందిన విజేతలకు శాల్వా పూలమాలతో సన్మానించి వెండి కడియాలను అందజేయడం జరిగింది...

# మెదక్ కలెక్టర్ కుజైలు శిక్ష నాలుగు వారాల గడువు సంచలనంగా మారిన వైనం

**మెదక్: పెన్ పవర్:** కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారంటూ మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కు హైకోర్టు జైలు శిక్ష విధించడం సంచలనంగా మారింది. చేగుంట మండలం బోనాల గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళ భూమి వివరాల కేసును పరిష్కరించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాలకు నోటీసులు జారీ చేసి భూ సమస్యను పరిష్కరించాలని హైకోర్టు కలెక్టర్ రాహుల్ రాజ్ ను ఆదేశించింది. సమస్యను పరిష్కరించకుండా గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను పట్టించుకోలేదంటూ లక్ష్మీ కోర్ట్ ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారించిన హైకోర్టు ఉద్దేశపూర్వకంగా కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విధిస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. తరువాత తీర్పు అమలును నాలుగు వారాలపాటు నిలిపివేసింది. ఆపిల్ చేసుకునేందుకు కలెక్టర్ కు నాలుగు వారాల పాటు హైకోర్టు గడువు ఇచ్చింది.

## శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు శాంతియుతంగా నిర్వహించండి

**మహబూబ్ నగర్ పెన్ పవర్:** ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా జిల్లాలో నిర్వహించబడే ఉత్సవాలు, ర్యాలీల దృష్ట్యా శాంతి భద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ మరియు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు జిల్లా ఎస్పి జి. జానకి నిర్వాహకులకు సూచనలు జారీ చేశారు.

ర్యాలీలు, కార్యక్రమాలు నిర్వహించడానికి ముందుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. . పోలీసులు సూచించిన మార్గాల్లోనే ర్యాలీ నిర్వహించాలి. ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా సమయపాలన పాటించాలి. ప్రధాన రహదారులను దిగ్బంధం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డీజేలు, అధిక శబ్ద పరికరాలు ఉపయోగించరాదు. శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

అశాంతి లేదా ఉద్రిక్తతలకు దారితీసే నినాదాలు, ప్రవర్తన చేయరాదు. ర్యాలీ భద్రత కోసం నిర్వాహకులు స్వచ్ఛంద సేవకులను నియమించాలి. మహిళలు, పిల్లలు, వృద్ధులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలి. ర్యాలీలో పాల్గొనే వాహనాలు నియంత్రిత వేగంతో నడపాలి. ప్రజా ఆస్తులకు నష్టం కలిగితే నిర్వాహకులపై బాధ్యత ఉంటుంది. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. మద్యం సేవించి ర్యాలీలో పాల్గొనడం పూర్తిగా నిషేధం. అత్యవసర వాహనాల రాకపోకలకు మార్గం ఖాళీగా ఉంచాలి. పోలీసు సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలి.6. అనుమతి నిబంధనలు ఉల్లంఘించినా, ట్రాఫిక్కు అంతరాయం కలిగించినా చట్టరీత్యా చర్యలు వుంటాయని అన్నారు.

డీజేలు లేదా నిషేధిత శబ్ద పరికరాలు ఉపయోగించినట్లయితే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. చట్టవ్యతిరేక చర్యలు,

శాంతి భద్రతలకు భంగం కలిగించే కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకోబడతాయి. పోలీసుల ఆదేశాలను పాటించని నిర్వాహకులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయబడతాయి. శాంతియుత వాతావరణం కాపాడేందుకు నిర్వాహకులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలి. శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని హెచ్చరించారు.

## కేసీఆర్ తన విధానాలను మార్చుకుంటారని ఆశ

**కొడుకు,అల్లుడు ని చక్కదిద్దుకోవాలి**
**మేడిపల్లి సత్యం,ఎంఎల్ ఏ చొప్పదండి**

**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయురు ఆరోగ్యాలతో వందేళ్లు జీవించాలని కోరుకుంటున్నాను. ఈ పుట్టిన రోజు నుంచైనా కేసీఆర్ తన విధానాలను మార్చుకుంటారని ఆశిస్తున్నానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు.

తన కొడుకు,అల్లుడు ని చక్కదిద్దుకోవాలి. మునిసిపల్ ఎన్నికల పలితాలు చూసైనా కేసీఆర్ సరిదిద్దుకోవాలి. మున్సిపాలిటీ లలో దాదాపు 90 శాతం గెలుచుకున్నాం. కార్పొరేషన్ లలో కరీంనగర్ మినహా అన్ని చోట్ల గెలిచాం. నగర, పట్టణ ప్రజలు కాంగ్రెస్ తో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ పైన అపోహలను తొలగిపోయాయి.

కేటీఆర్,హరీష్ రావు పనిగట్టుకుని ఇంత కాలం చేసిన ప్రచారాన్ని ప్రజలు మరో సారి తిప్పికొట్టారని అన్నారు. ఇక ముందు కేటీఆర్,హరీష్ రావు ఏ మొహం పెట్టుకొని ప్రజల్లో తిరుగుతారు. ప్రజలు చిత్కరించినా సిగ్గు లేకుండా ఇంకా మాట్లాడుతున్నారు. కేటీఆర్ ఇక ముందు నోరు మూసుకోవాలి. దౌర్జన్యం చేశారంటూ కేటీఆర్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. మాకు ఆ అవసరం లేదు..ప్రజలు మా వెంట ఉన్నారు. తొర్రూరు,జనగాం లో టాస్ లో కూడా అదృష్టం కాంగ్రెస్ నే వరించింది. దేవుడు కూడా మా వెంటే ఉన్నాడు. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనకు ప్రజలు పట్టం కట్టారు. ప్రజలు మా సీఎం వెంట ఉన్నారు. సింహం సింగిల్ గా వచ్చినట్లు మా సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో పార్టీ ని గెలిపించారు. దేశం లోనే ఉత్తమ ముఖ్యమంత్రి గా మా సీఎం పేరు తెచ్చుకుంటున్నారు.

కేటీఆర్,హరీష్ రావు రాజకీయ మరగుజ్జు లా మారుతున్నారు. వాళ్ల మాటలను తెలంగాణ ప్రజలు పట్టించుకోవడం లేదని అన్నారు.

## హైకోర్టులో ఆకుల యాదగిరిని ప్రవేశపెట్టిన పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇబ్రహీంపట్నం 19వ కౌన్సిలర్ ఆకుల యాదగిరి ని పోలీసులు హైకోర్టు లో హాజరు పరచారు. అయన కుటుంబ సభ్యులు ఆకుల యాదగిరి కనిపించడం లేదని హెబియస్ కార్పస్ వేసిన విషయం తెలిసిందే. యాదగిరిని హైకోర్టు ముందు హాజరు పరచాలని రెండు రోజులు క్రితం న్యాయస్థానం ఆదేశించింది. మరోవైపు క్యాంపు పేరుతో తన భర్తను కిడ్నాప్ చేశారని ఆకుల యాదగిరి భార్య వసంత పిర్యాదు చేసారు. మిస్సింగ్ పై పోలీసులు కేసు నమోదు చేసారు. ఇబ్రహీంపట్నం బి ఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అతని తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి పై ఆకుల యాదగిరి భార్య అనుమానాలు వ్యక్తం చేసింది.

## 22న నిర్వహించే గురుకులాల ప్రవేశ పరీక్ష ను సద్వినియోగం చేసుకోవాలి

**-పెద్దపెల్లి జిల్లా గురుకులాల సమన్వయ అధికారి శ్రీనాథ్**

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈనెల 22న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న తెలంగాణ గురుకులాల ప్రవేశ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని పెద్దపెల్లి జిల్లా గురుకులాల సమన్వయ అధికారి శ్రీనాథ్ బుధవారం పేర్కొన్నారు. ఉమ్మడి గురుకులాలు రాష్ట్రవ్యాప్తంగా ఐదవ తరగతి ఉమ్మడి పరీక్ష, 6, 7, 8, 9 తరగతుల మిగిలిన సీట్లకు ప్రవేశ పరీక్షను ఈనెల 22 న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నదన్నారు. పెద్దపెల్లి జిల్లాలో మొత్తం 8 పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, ఐదో తరగతి పరీక్ష కేంద్రాలు జిల్లాలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలికలు) మల్లాపూర్, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాల (బాలికలు) నంది మేడారం, మహాత్మ జ్యోతిరావు బాపులే సుల్తానాబాద్ (భూపతిపూర్), ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష కేంద్రాలు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల /కళాశాల (బాలురు) మంథని, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలికలు) రామగుండం, ఏడవ తరగతి ప్రవేశ పరీక్ష కేంద్రాలు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలికలు) గర్రెపల్లి, మహాత్మ జ్యోతిరావు పూలే (రంగంపల్లి) పెద్దపల్లి, ఎనిమిదో తరగతి ప్రవేశ పరీక్ష కేంద్రాలు మహాత్మ జ్యోతిరావు పూలే సప్తగిరి కాలనీ (గోదావరిఖని), 9వ తరగతి ప్రవేశ పరీక్ష కేంద్రాలు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల /కళాశాల (బాలికలు) గర్రెపల్లి ఆయా కేంద్రాలలో ప్రవేశ పరీక్షలు నిర్వహించబడతాయని దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని సూచించారు. పరీక్ష కేంద్రానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఉదయం 10 గంటల్లోపు చేరుకోవాలని ఆయన వివరించారు. పరీక్ష కేంద్రానికి వచ్చేటప్పుడు అభ్యర్థులు తమ వెంట ప్రవేశ పరీక్ష హాల్ టికెట్, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫోటో, బ్లూ/బ్లాక్ బాయిల్ పాయింట్ పెన్, పరీక్ష ప్యాడ్, వాటర్ బాటిల్ తప్పనిసరిగా తమ వెంట తీసుకురావాలని ఆయన సూచించారు. ఎలక్ట్రికల్ వస్తువులు, డిజిటల్ వాచీలు, వంటివి అభ్యర్థుల వెంట అనుమతించబడవని గుర్తుంచుకోవాలని ఆయన తెలిపారు.

## మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** కమాన్ పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోఎఫ్ పి ఎస్ టిపెద్దపల్లిల్ల వారి ఆధ్వర్యం లతి 8.9 వ తరగతుల విద్యార్థులకు మండల స్థాయి ఫిజకల్ సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టులో కమాన్ పూర్, జూలపల్లి మరియు రొంపికుంట ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా జి. రిషిక్ సాయి జిల్లా పరిషత్ పాఠశాల జూలపల్లి అనే విదార్థి మొదటి స్థానం లో కె. రుచిత జిల్లా పరిష త్ పాఠశాల కమాన్ పూర్ అనే విద్యార్థి ద్వితీయ స్థానం లో నిలిచారు. మొదటి, ద్వితీయ స్థానం సాధించిన ఇద్దరు విద్యార్థులు ఈనెల 23–నాడు పెద్దపల్లి బాలికల ఉన్నత పాఠశాల లో జరిగే జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ ఊలెంట్ టెస్టు లో పాల్గొంటారు. మొదటి, ద్వితీయ స్థానం సాధించిన ' విద్యార్థులను మండల విద్యాధికారి ఇల్లందుల విజయ్ కుమార్ అభినందిస్తూ జిల్లా స్థాయిలో కూడ మంచి ప్రతిభను కనబరిచి మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

# స్వరాజ్య సంస్థాపకుడు శివాజీ

**హైదరాబాద్ పెన్ పవర్:** ధర్మప్రతిష్టాపనే లక్ష్యంగా, కర్తవ్య పరాయణత్వమే ధ్యేయంగా జీవించి ధన్యుడైన వారిలో నిత్యస్మరణీయుడు ఛత్రపతి శివాజీ. అందుకే శివాజీ 'స్వరూపాన్నే ధ్యానించండి, ఆయన ప్రతాపాన్నే అనుష్ఠించండి' అని సమర్థ రామదాసు వంటి మహనీ యులు మన జాతికి ప్రబోధించారు. హిందూ ధ్వజాన్ని మళ్ళీ ఉత్తుంగ శిఖరాలపై ఎగురవేసి, హిందూత్వంలో అమృతాన్ని నింపి ప్రాణప్రతిష్ఠ చేసిన మహనీయుడు శివాజీ. స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి, మధ్య యుగంలో హిందూ మతధర్మాన్ని పరిరక్షించిన మహోన్నత వీరుడు శివాజీ. మహారాష్ట్ర ప్రాంతంలో యాదవులు స్థాపించిన హిందూ సామ్రాజ్యం 1307 మార్చి 24తో ఢిల్లీ సుల్తాను ఖిల్జీ ద్వారా నాశనం కాగా, ఆ తర్వాత 350 ఏళ్ల వరకూ మరో హిందూ సామ్రాజ్యమే లేకుండా పోయింది. 1630, ఫిబ్రవరి 19వ తేదీన భావి హైందవ సామ్రాజ్య నిర్మాతయైన శివాజీ జన్మించాడు. దేశభక్తిని ఉగ్గుపాలతోనే రంగరించుకున్న శివాజీ తన తల్లి జిజియాబాయి పెంపకంలో అనేక విషయాలు నేర్చుకున్నాడు. 'రామ రామరాజ్యం వంటి హైందవ సామ్రాజ్యం నిర్మాణం చేయాలనే కోరిక' శివాజీలో బాల్యంలోనే స్థిర పడింది. తల్లి సంరక్షణ, దాదాజీ ఖాండ్‌దేవ్ శిక్షణతో శివాజీ వీరుడిగా అవతరించారు. భారత రామాయణాల విశిష్టత, హిందూ మతం గొప్పదనం తల్లిద్వారా నేర్చుకున్నాడు. పరమత సహనం, స్త్రీల పట్ల గౌరవం కూడా ఆమె ద్వారా పెంపొందించుకున్నాడు. తండ్రి పరాజయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనతి కాలంలో యుద్ధ తంత్రంలో నిష్ణాతుడయ్యాడు. సకల విద్యా పారంగతుడైన శివాజీ, మరాఠా సామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా వ్యూహారచన చేశాడు. శివాజీ జాగీరులో రాంఝూ గ్రామ పటేలు ఒక స్త్రీని బలత్కారం చేయగా, శివాజీ 1645 జనవరి 28న పటేలును బంధించి, కాళ్ళు చేతులు నరికించి శిక్షించాడు. అలా క్రమంగా ప్రజల అభిమాన పాత్రుడైనాడు. అప్పట్లో కాశ్మీరం నుండి కావేరీ వరకు మధ్యనున్న చాందా, గోండువనం వదిలి మిగిలిన దేశమంతా తురుష్కుల అధీనంలో ఉండేది. దేవగిరి, విజయనగరం రాజ్యాలు అస్తమించాక, శివాజీ తన మిత్రులందరితో భవిష్యత్ సామ్రాజ్య నిర్మాణం కోసం దేవాలయం, కొండగుహ, కీకారణ్యం ఇసుకతిన్నెలు వంటి అనేక ప్రాంతాల్లో చర్చోపచర్చలు జరిపేవాడు. మొదట బీజాపూర్ సుల్తాన్ చే నిర్లక్ష్యం కాబడిన 'కాన' లోయలోని 'తోరణ' దుర్గాన్ని జయించి, హిందూ సామ్రాజ్య నిర్మాణానికి తోరణం కట్టాడు. తోరణ దుర్గానికి ఎదురుగా ఉన్న 'మురుంబదేవ' గిరిపై కొత్త కోటను నిర్మించి, "రాజ్ గఢ్" అని పేరు పెట్టాడు. తర్వాత 'కువారి' కోటను వశం చేసుకున్నాడు. ఇవన్నీ పదహారేళ్ళ ముక్కుపచ్చలారని ప్రాయంలో శివాజీ చేసిన గొప్ప పనులు. తర్వాత కొండణా కోటను తన

స్వరాజ్యంలో కలుపు కున్నాడు. శివరళ, సుభాను మంగళి దుర్గాలను వశపరు కున్నాడు. 1648 జూలై 25న వజీరు ముస్తాఫా, బాజీ ఘోర్పడేలు సైన్యంతో శివాజీ తండ్రి అయిన శహాజీని బంధించారు. శత్రువును శరణు వేడడమా? తండ్రి ప్రాణమా? స్వరాజ్యమా? అనే శివాజీ ప్రశ్నలకు... తల్లి జిజియా బాయి- తన మాంగల్యం కన్నా దేశభక్తి గొప్పదని చెప్పింది. పురంధర కోటలో ఉన్న శివాజీ సైన్యానికి, ఫతేఖాన్ సైన్యానికి భీకర యుద్ధం జరగగా శివాజీకే విజయం దక్కింది. 1648 ఆగస్టు 8న ఫతేఖాన్ ఓటమి పాలయ్యాడు. పురంధర దుర్గంలో ఫతేఖాన్, బెంగుళూరులో ఫరాదఖాన్ ఓటముల పాలు కాగా, బీజాపూర్ లో శివాజీ తండ్రి శహాజీ 1649 మే 16న బంధ విముక్తు డైనాడు. 1654 మే 23న బీజాపూర్ సుల్తాన్ మహరాజ్ పంత్ మరణించగా, ఆయన నలుగురు కుమారుల తగవుల కారణంగా శివాజీ వారిని బంధించి, ఉచిత పదవులు కట్టబెట్టి నేతాజీ పాల్కర్ అనే సర్దార్ ను అధికారిగా నియమించాడు. కృష్ణానదీ సమీపంలో టావళి అధిపతి దౌలత్ రావు మృతి చెందగా, ఆయనకు సంతానం లేకపోగా దత్తపుత్రుడైన యశ్వంతరావుకు పదవినిచ్చాడు. తన అధికారానికి ఇష్టపడని కారణాన 1656లో యుద్ధంలో యశ్వంతరావును ఓడించి శివాజీ స్వరాజ్యంలో కలుపుకున్నాడు. దీనిలో అంతర్భాగ కొండ ప్రాంతమైన 'రాయరి' కోటనే కొన్నేళ్ళకు శివాజీ రాజధానిగా రాయగఢ్ దుర్గం ఏర్పడింది. 1956 నవంబర్ 2న బీజాపూర్ సుల్తాన్ ఆదిల్షా చనిపోగా, మొగలు సామ్రాజ్య దక్షిణ సుబేదారైన ఔరంగజేబు అనుమతిని పొంది, 1957 ఏప్రిల్ 23న స్వరాజ్యంలో కలుపుకున్నాడు. శివాజీ బీజాపూర్ ప్రాంతం నుండి కోంద్వానా కొంకణ, దండరాజపురి, భీవండి కళ్యాణి, మాహు తదితర కోటలను పోర్చుగీసు వారి నుండి చోళ ప్రాంతాన్ని జయించాడు. కటావ్, మయణి, అష్టి, ఖరాహడ్, సుపే, కొల్హాపూర్, పనాళీ గడ్, యెగావ్ తదితర కోటలను జయించాడు. ఔరంగజేబు సలహాదారులైన కారతలబ్ ఖాన్, నామదర్ ఖాన్, ఇనాయత్ ఖాన్, షహిస్త ఖాన్, భావసింహ, జస్వంత సింహ తదితరులను ఓడించాడు. అహ్మద్ నగర్ , సూరత్, జున్నర్ నగ రాలను లూటీ చేశాడు. అలా సాగిన శివాజీ తన జైత్రయాత్ర ఫలితంగా 1674 జూన్ 6న సింహాసనాన్ని అధిష్టించాడు. ఆంగ్లేయుల రాయబారి హెన్రీ ఆక్సెం డర్ శివాజీ మహారాజుకు ప్రణమిల్లి భారీగా కానుకలు సమర్పించాడు. తన రాజ్యానికి అష్టప్రధానుల పారశీక నామాలను మార్చి సంస్కృత పేర్లను శివాజీ పెట్టాడు. ప్రభుత్వ పాలన సంస్కృతంలోనే సాగాలని రాజ్య వ్యవహార కోశం తయారు చేయించాడు. యుద్ధ తంత్రాలలో మాత్రమే కాకుండా పరిపాలనా విధానంలో కూడా

శివాజీ భారతదేశ రాజులలో అగ్రగణ్యుడు. మంత్రిమండలి, విదేశాంగ విధానం, పటిష్ఠమైన గూఢచారి వ్యవస్థ ఏర్పాటు చేశాడు. ప్రజలకోసమే ప్రభువు అన్న సూత్రం పాటించి, వ్యక్తిగత విలాసాలకు కాకుండా ప్రజాక్షేమం కోసమే పాటుపడ్డాడు. సుదీర్ఘంగా యుద్ధాలు చేసినా ఎన్నడూ పవిత్ర స్థలాలను ధ్వంసం చేయలేదు. ఓడిపోయిన శత్రురాజ్యంలో నిస్సహాయులు, మహిళలు, పసివారికి సహాయం చేశాడు. తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా గౌరవించాడు. కేవలం ఆలయాలే కాదు, మసీదులను సైతం కట్టించాడు. శివాజీ సైన్యంలో మూడు వంతులు ముస్లిములే. వారిని కూడా ఉన్నత పదవుల్లో నియమించాడు. ముప్ఫై సంవత్సరాలు శివాజీ, ఆయన అనుచరులు చూపిన పరాక్రమాలు, కర్తృత్వ శక్తి, త్యాగశీలత, ధ్యేయ నిష్ఠ హిందువులలో నూతనోత్తేజం నింపాయి. యాభై ఏళ్ళ సామ్రాజ్య నిర్మాణ కృషి ఫలితంగా దేహం పూర్తిగా అలసిపోగా ఆరోగ్యం క్షీణించడంతో, 1680 ఏప్రిల్ 3న శివాజీ తుది శ్వాస విడిచాడు. భారతీయుల ఆదర్శ పురుషునిగా నిలిచాడు.

# అప్పుల భారతం!

**హైదరాబాద్ పెన్ పవర్:** సామాన్యులే కాకుండా ప్రభుత్వాలు సైతం అప్పులు లేనిదే ముందుకు వెళ్లలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ అప్పులు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల గమనాన్ని నిర్దేశిస్తున్నాయి. సామాజిక సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక స్థిరత్వం కోసం దేశాలు చేస్తున్న అప్పులు అతి భారీ స్థాయికి చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) వెల్లడించిన గణాంకాల ప్రకారం 2025 -26 నాటికి ప్రపంచ దేశాల మొత్తం అప్పు 110.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ అప్పులో ఎక్కువ భాగం ప్రపంచంలోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన దేశాల్లోనే ఉండటం గమనార్హం. భారత దేశంలోని 147 కోట్ల మంది జనాభాలో ప్రతి ఒక్కరిపై ఈ ఏడాది మార్చి నాటికి రూ. 1.34 లక్షల కోట్ల అప్పు ఉంది. ఇది వ్యక్తులు చేసిన అప్పు కాదు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రుణం. అయినప్పటికీ ఈ సంవత్సరం (2026- 27) కూడా భారీ స్థాయిలో అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 14.61 లక్షల కోట్ల అప్పులు చేసిన కేంద్రం రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ.17.2 లక్షల కోట్ల రుణాలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న రుణం కంటే 17 శాతం ఎక్కువ కావడం గమనార్హం.

2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం రూ. 53.47 లక్షల కోట్లకు బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఇందులో మార్కెట్ నుంచి మొత్తం రూ. 17.2 లక్షల కోట్లు సేకరించాల్సి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. 2025 -26 సవరించిన అంచనాల ప్రకారం కేంద్రం మొత్తం అప్పులు రూ. 1,97,18,016 కోట్లు కాగా, మార్చి 2027 నాటికి ఇది 2,14,82,050 కోట్లకు చేరనుంది. ఇక జిడిపిలో రుణ నిష్పత్తిని 55.6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వాస్తవానికి ఈ నిష్పత్తి 2019లో 50 శాతంలోపే ఉంది. ఇక తాజా బడ్జెట్‌లో జిడిపిలో ద్రవ్యలోటును 4.3 శాతంగా అంచనా వేశారు. 2026 మార్చి 31 నాటికి భారత కేంద్ర ప్రభుత్వం మొత్తం అప్పులు రూ. 197.18 లక్షల కోట్లకు (సుమారు ట్రిలియన్ డాలర్లు) చేరుకుంటాయని అంచనా వేశారు.

ఇది 2026 -27 ఆర్థిక సంవత్సరంలో మరింత పెరిగి రూ. 214.82 లక్షల కోట్లకు చేరవచ్చని బడ్జెట్ అంచనాలు వెల్లడిస్తున్నాయి. 2024లో దేశం మొత్తం అప్పు సుమారు 85 శాతంగా ఉంది. 2026 వరకు దేశవ్యాప్త అప్పుల వివరాలు: కేంద్ర అప్పులు: 2025 -26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ అప్పులు రూ. 197.18 లక్షల కోట్ల నుండి 2026 -27 నాటికి రూ. 214.82 లక్షల కోట్లకు పెరుగుతాయని అంచనా. వ్యక్తిగత భారం: 2026 ప్రారంభానికి, దేశంలోని ప్రతి పౌరుడిపై సుమారు రూ. 1.34 లక్షల అప్పు (కేంద్రం చేసిన రుణాల ప్రకారం) ఉంది. ద్రవ్యలోటు : 2025- 26లో 4.4 శాతం , 2026 -27 నాటికి 4.3 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2025- 26 నాటికి 56.1 శాతంగా ఉన్న అప్పు- జిడిపి నిష్పత్తిని, 2026- 27 నాటికి 55.6 శాతంకి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2026 మార్చి నాటికి అప్పులు రూ. 7.46 లక్షల కోట్లకు చేరవచ్చనిఅంచనా వేశారు. 2026 -27 బడ్జెట్‌లో గ్రాస్ మార్కెట్ బోరోయింగ్ (మొత్తం అప్పులు) సుమారు రూ. 17.2 లక్షల కోట్లుగా అంచనా వేశారు.అంతర్జాతీయ ద్రవ్యనిధి తాజా గణాంకాల ప్రకారం ప్రపంచ దేశాల మొత్తం అప్పు 2025 నాటికి 110.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. అత్యధిక అప్పులు ఉన్న దేశాల జాబితాలో అమెరికా తొలి స్థానంలో ఉండగా, భారతదేశం 3.36 ట్రిలియన్ డాలర్లతో ఏడవ స్థానంలో ఉంది. ప్రభుత్వం తన రుణ నిష్పత్తిని 56.1 శాతం నుండి 55.6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచంలోనే అత్యధిక ప్రభుత్వ అప్పులు ఉన్న దేశంగా అగ్రరాజ్యం అమెరికా తొలి స్థానంలో నిలిచింది. అమెరికా మొత్తం అప్పు 38.27 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఇది ప్రపంచ మొత్తం అప్పులో మూడో వంతు కంటే ఎక్కువ కావడం గమనార్హం. నిరంతర బడ్జెట్ లోటు, పెరుగుతున్న వడ్డీ చెల్లింపులే ఇందుకు ప్రధాన కారణమని ఐఎంఎఫ్ పేర్కొంది.

ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనా ఈ విషయంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ డ్రాగన్ దేశం 18.68 ట్రిలియన్ డాలర్ల అప్పుల ఊబిలో ఉంది. చైనా అప్పులు 2025లో 13.6% వృద్ధితో అత్యంత వేగంగా పెరుగుతున్నట్లు ఐఎంఎఫ్ నివేదిక పేర్కొంది. రుణాల ఊబి జాబితాలో జపాన్ కూడా ఉంది. ఈ దేశం

9.83 ట్రిలియన్ డాలర్ల అప్పుతో 3వ స్థానంలో నిలిచింది. జపాన్ అప్పు దాని జిడిపిలో దాదాపు 230 శాతంగా ఉండటం ఆ దేశ ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోంది. ఇక యూరప్ దేశాల్లోని యునైటెడ్ కింగ్‌డమ్ 4.09 ట్రిలియన్ డాలర్లతో 4వ స్థానం, ఫ్రాన్స్ 3.92 ట్రిలియన్ డాలర్లతో 5వ స్థానం, ఇటలీ 3.48 ట్రిలియన్ డాలర్లతో 6వ స్థానంలో నిలిచాయి. ఆయా దేశాల్లో సామాజిక సంక్షేమం, పింఛన్ల కోసం కోసం ఇబ్బడిముబ్బడిగా ఖర్చు చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఐఎంఎఫ్ నివేదికలో పేర్కొంది. అన్ని దేశాల మాదిరిగానే భారత్ కూడా అప్పులు ఇబ్బడిముబ్బడిగా తీసుకుంటోంది. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. దీంతో అభివృద్ధి పనుల కోసం చేసే ఈ అప్పు సాధారణమేనని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఒక సానుకూల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దేశ అప్పుల నిష్పత్తిని జిడిపిలో 56.1 శాతం నుండి 55.6 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇండియా తర్వాత స్థానాల్లో జర్మనీ 3.23 ట్రిలియన్ డాలర్లు, కెనడా 2.60 ట్రిలియన్ డాలర్లు, బ్రెజిల్ 2.06 ట్రిలియన్ డాలర్ల అప్పులతో టాప్ 10 జాబితాలో నిలిచాయి. జర్మనీ ఆర్థిక క్రమశిక్షణ మారుపేరు. అయినప్పటికీ ఇంధన ఖర్చులు తదితర కారణాలతో అప్పుల పాలైంది. కెనడా, బ్రెజిల్ బడ్జెట్ లోటు, ప్రాంతీయ రుణాల కారణంగా అప్పుల ఊబిలో చిక్కుకున్నాయి.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

**దుబ్బాక, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** కొండపాక మండలం దుద్దెడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 21 ఏళ్ల మధు అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామానికి చెందిన మధు, స్థానిక పెట్రోల్ బంకులో పనిచేస్తూ శిక్షణ నిమిత్తం సిద్దిపేట వెళ్లి తిరిగి వస్తుండగా, దుద్దెడ శివారులో ముందు వెళ్తున్న ఆటోను ఢీకొని కిందపడి తీవ్ర గాయాలతో మరణించాడు. ఈ ఘటనపై సిద్దిపేట త్రీటౌన్ సీఐ లక్ష్మీబాబు తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## ఆన్లైన్ యూరియా మాయం: రైతుల ఆవేదన, బీజేపీ ధర్నా

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 18 పెన్ పవర్:**నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలోని వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో ఆన్లైన్ యూరియా కొద్ది సెకన్లలోనే మాయం అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత పద్ధతిలోనే యూరియాను రైతులకు అందించాలని కోరుతూ, ప్రాథమిక వ్యవసాయ కేంద్రం వద్ద బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. యూరియా దొరకక పొలాలు ఎండిపోతున్నాయని, తక్షణమే పాత పద్ధతిలో యూరియాను రైతులకు అందించాలని బీజేపీ మండల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సంఘటన 2026 ఫిబ్రవరి 18న జరిగింది.

## సివిల్ సర్వెంట్స్... ఖద్దరు చొక్కా బాగ్యం లేదా

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, పెన్ పవర్:**
సివిల్ సర్వీసెస్.. దేశంలోనే అత్యున్నత స్థాయి బాధ్యత. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా వీరు వ్యవస్థను శాసిస్తారు, ఫైళ్ల మీద సంతకాలతో వేలమంది జీవితాలను మారుస్తారు. కానీ, అదే అధికారులు ఖాకీ లేదా తెల్ల చొక్కా వదిలేసి ఖద్దరు చొక్కా కట్టుకోగానే సీన్ రివర్స్ అవుతోంది. తాజాగా మాజీ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ ప్రత్యక్ష రాజకీయాలకు స్వస్తి పలికి, ప్రైవేటు సంస్థలో చేరడం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. అటు జయప్రకాశ్ నారాయణ నుంచి ఇటు లక్ష్మీనారాయణ వరకు.. వీరి ప్రయాణాలు ఒకే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. సిస్టమ్‌ను బయట ఉండి మార్చడం వేరు, సిస్టమ్‌లో భాగంగా మారి రాజకీయ రొంపిలో నెగ్గుకురావడం వేరు అని రుజువు చేస్తున్నాయి.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక వెలుగు వెలిగిన ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ. 'లోక్ సత్తా' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా పాలనా సంస్కరణల కోసం పోరాడి, ఆ తర్వాత దానిని రాజకీయ పార్టీగా మార్చారు. జేపీ రాజకీయాల్లో 'నైతికత' గురించి మాట్లాడారు. కానీ భారతీయ ఓటరు నాడి కేవలం సిద్ధాంతాల మీద మాత్రమే పనిచేయదు. కుల, మత సమీకరణలు, ధన ప్రభావం ఉన్న రాజకీయ క్షేత్రంలో జేపీ మేధోమథనం సామాన్య ఓటరుకు చేరువ కాలేకపోయింది. కూకట్‌పల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, అసెంబ్లీలో ఆయన ఒంటరి అయ్యారు. చివరకు రాజకీయాల్లో తన గళం వినిపించే అవకాశం లేదని గ్రహించి, ప్రస్తుతం ఆయన కేవలం సామాజిక విశ్లేషకుడిగానే మిగిలిపోయారు.సీబీఐ మాజీ జేడీగా లక్ష్మీనారాయణ పేరు చెబితే అవినీతిపరుల వెన్నులో వణుకు పుట్టేది. ఆ క్రేజ్‌తోనే ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. 2019 ఎన్నికల్లో విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ, గణనీయమైన ఓట్లు సాధించారు. కానీ అక్కడితోనే ఆయన గ్రాఫ్ ఆగిపోయింది. ముందుగా జనసేనలో చేరడం, ఆ తర్వాత రాజీనామా చేయడం, మళ్ళీ సొంతంగా జై భారత్ నేషనల్ పార్టీ పెట్టడం.. లాంటివన్నీ ప్రజల్లో అయోమయాన్ని సృష్టించాయి. పోలీసు అధికారిగా కఠినంగా ఉండటం అలవాటైన లక్ష్మీనారాయణకు, రాజకీయాల్లో ఉండే అనునిత్యం రాజీపడే తత్వం సెట్ కాలేదు. రాజకీయాల్లో మార్పు తీసుకురావడం కంటే, ప్రైవేటు రంగంలో సేవ చేయడం ఉత్తమమని భావించి ఆయన 'ఈవీ ట్రాన్స్' సంస్థలో బాధ్యతలు చేపట్టారు. ఇది ఆయన రాజకీయ ప్రస్థానానికి దాదాపు ముగింపు పలికినట్టే అని విశ్లేషకులు భావిస్తున్నారు.రాజకీయాల్లోకి వచ్చే ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వైఫల్యానికి ఎన్నో కారణాలున్నాయి. అధికారులుగా ఉన్నప్పుడు వారి మాట శాసనం. అందరూ వారి కింద పని చేస్తారు. కానీ రాజకీయాల్లో 'ప్రజల వద్దకు వెళ్లి అడుక్కోవాలి'. ఈ మనస్తత్వ మార్పు అందరికీ సాధ్యం కాదు. సివిల్ సర్వెంట్లు ప్రతిదీ చట్టబద్ధంగా, సిద్ధాంతపరంగా ఉండాలని కోరుకుంటారు. కానీ రాజకీయం అనేది 'గెలుపే లక్ష్యం'గా సాగే చదరంగం. ఇక్కడ ఎథిక్స్ కంటే స్ట్రాటజీలకే ప్రాధాన్యత ఎక్కువ. రాజకీయ పార్టీ నడపాలంటే క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఉండాలి. అధికారులు కేవలం మీడియాలో కనిపించి ఓట్లు రాబట్టలేరు. జేపీ, జేడీ ఇద్దరూ ఈ విషయంలోనే వెనుకబడ్డారు.సివిల్ సర్వెంట్లు రాజకీయాల్లోకి రావడం ప్రజాస్వామ్యానికి మంచిదే అయినా, క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహించకపోతే పరాజయం తప్పదని ఈ ఇద్దరి ఉదాహరణలు నిరూపిస్తున్నాయి. జేపీ మేధస్సు, జేడీ నిజాయితీ రాజకీయ వ్యవస్థకు అవసరమే, కానీ ఆ వ్యవస్థలో ఇమడలేక వారు వెనక్కి వెళ్లడం దురదృష్టకరం. వ్యవస్థను మార్చాలనే తపనతో వచ్చి, చివరకు వ్యవస్థ గాలికి కొట్టుకుపోవడం లేదా పక్కకు తప్పుకోవడం ఒక చేదు నిజం.

## గాంధీనగర్ ట్రాన్స్ఫార్మర్ వద్ద ముళ్ళ పొదలు:

**వైరా, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా, సింగరేణి మండలం గాంధీనగర్ లోని మెయిన్ రోడ్ లో ఉన్న ట్రాన్స్ఫార్మర్ చుట్టూ ముళ్ళ పొదలు పెరిగిపోవడంతో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. ట్రాన్స్ఫార్మర్ వద్దకు వెళ్లడానికి కూడా ప్రజలు భయపడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి, ట్రాన్స్ఫార్మర్ పరిసరాలను శుభ్రం చేసి, ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

**వరంగల్ వెస్ట్, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** రాత్రి వరంగల్ రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, చింతలపల్లి-ఎలుగూరు రైల్వేస్టేషన్‌ల మధ్య గోదావరి ఎక్స్‌ప్రెస్ కిందపడి ఈ ఘటన జరిగింది. సుమారు 20-25 ఏళ్ల వయసున్న యువకుడు వంకాయ రంగు షార్ట్, రెడ్ కలర్ టీ-షర్ట్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించనందున, వివరాలు తెలిసినవారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## ప్రియురాలిపై పెట్రోల్ పోసి, ఆపై తాను ఆత్మహత్యాయత్నం చేసుకున్న వ్యక్తి మృతి

**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** వరంగల్ జిల్లా కేంద్రంలో అంజయ్య అనే వ్యక్తి, వివాహిత అయిన తన ప్రియురాలిపై పెట్రోల్ పోసి నిప్పు అంటించాడు. అనంతరం, అతను కూడా తనపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. ఇద్దరూ తీవ్రంగా గాయపడటంతో వరంగల్ ఎంజీఎంలో చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ అంజయ్య మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం: వేం నరేందర్ రెడ్డితో నేతల భేటీ

**వర్ధన్నపేట, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** ఉమ్మడి వరంగల్ జిల్లా, మహబూబాబాద్‌లోని మరిపెడ బంగ్లాలో, మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన విజయానంతరం, సీనియర్ నాయకుడు తాదూరి రమేష్, డోర్నకల్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ విప్ రామచంద్ర నాయక్, సీఎం రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయానికి కృషి చేసిన కార్యకర్తలను అభినందిస్తూ, అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ భేటీ కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.

## త్రిశక్తి పీఠం కూల్చివేత వెనుక కొందరి కుట్ర దాగి ఉంది:

**నర్సంపేట, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** వరంగల్ నగరంలోని త్రిశక్తి పీఠం దేవాలయాన్ని కూల్చివేయడానికి స్థానిక మద్యం వ్యాపారి, మాజీ ఎమ్మెల్యే, కొండ వర్గీయులు కుట్ర పన్నుతున్నారని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోనే అరుదైన ఈ దేవాలయాన్ని రాజకీయ నాయకులు కూల్చాలని చూస్తున్నారని, దేవాలయాలకు కులాలను ఆపాదించకూడదని ఆయన అన్నారు. రోడ్ల మధ్యలో ఉన్న అన్ని నిర్మాణాలను తొలగించాలని ఆయన సూచించారు.

## హిందూ వాహిని భారీ శోభాయాత్ర, బహిరంగ సభకు పిలుపు

**పరకాల, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** ఫిబ్రవరి 19న చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని హిందూ వాహిని ఆధ్వర్యంలో వరంగల్ కాజీపేట హనుమకొండలో భారీ శోభాయాత్ర, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసారి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు బుధవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రముఖ సూర్య ప్రకాష్ రెడ్డి, వరంగల్ సంయోజాక్ చత్రపతి శివాజీ, రామ్ శర్మ, ప్రవీణ్ దాదా, సాగర్ పాల్గొన్నారు.

## నర్సాపూర్ అభివృద్ధికి కృషి చేయాలి:



**నర్సాపూర్, ఫిబ్రవరి 18 పెన్ పవర్:**నర్సాపూర్ పురపాలిక వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైన వనముల బుచ్చేష్ యాదవ్, బీజేపీ కౌన్సిలర్లు చింతకుంట శ్రీకాంత్, నిరంజన్ దాస్‌లు బుధవారం హైదరాబాదులో మెదక్ ఎంపీ రఘునందన్ రావును ఆయన నివాసంలో కలిశారు. ఎంపీ వారిని సన్మానించి, నర్సాపూర్ పురపాలిక అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. వీరితో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దస్ మల్లేష్ గౌడ్, నాయకులు కూడా ఉన్నారు.

## ట్రాక్టర్ ఢీకొట్టి మహిళ దుర్మరణం

**మెదక్, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** మెదక్-జోగిపేట రహదారిపై రంగంపేట శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కౌడిపల్లి మండలం ఎర్రమట్టి తండాకు చెందిన నునావత్ శాంతి (52) మృతి చెందారు. బైక్‌పై వెళ్తున్న దంపతులను వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన ఆమె భర్త ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్ తీగ తగిలి గీత కార్మికుడు మృతి

**సిద్దిపేట, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** కంది మండలంలోని బ్యాతోల్ గ్రామంలో కల్లు గీసేందుకు వెళ్లిన భోగిని సురేందర్ (42) అనే గీత కార్మికుడు విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. రెండు నెలలుగా వేలాడుతున్న తీగల గురించి అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, వారి నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందని మృతుడి కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్‌గా చందన రవీందర్ బాధ్యతలు స్వీకరించారు

**గజ్వేల్, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గా గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్ పర్సన్ గా కళ్యాణ్కర్ నర్సింగరావు పద్మా బాయ్ గురువారం మున్సిపల్ కార్యాలయంలో నూతన పాలకవర్గం, కౌన్సిలర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ నూతన పాలక వర్గానికి, కౌన్సిలర్స్ కు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు.

## తనపై అనవసర వ్యాఖ్యలు ఎమ్మెల్యేకు తగదు




**ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వేడి రాజుకుంది. ఎమ్మెల్యే తన వ్యక్తిగత లాభం కోసం పదవిని అమ్ముకున్నారని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. పార్టీ కార్యకర్తల నమ్మకాన్ని వమ్ము చేశారని, ఈ విషయంపైనే అంతటా చర్చ జరుగుతోందని ఆయన విమర్శించారు. ఓటమి భయంతోనే ఎమ్మెల్యే తనపై అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని, రాజకీయాల కంటే వ్యాపారానికే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారని జోగు రామన్న చురకలు అంటించారు.

## ఎయిర్‌పోర్ట్ మంజూరుకు విశేష కృషి చేసిన:

**బోథ్, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** ఆదిలాబాద్ అభివృద్ధిలో భాగంగా ఎయిర్‌పోర్ట్ మంజూరుకు విశేష కృషి చేశానని ఎంపీ నగేశ్ తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భూసేకరణలో సహకరించలేదని, డిఫెన్స్ ఎయిర్‌పోర్ట్ కోసం అడిగినా స్థలం కేటాయించకుండా నిరాకరించిందని ఆయన ఆరోపించారు. ఎయిర్‌పోర్ట్ రాదని ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా పట్టుబట్టి ఎయిర్‌పోర్ట్ మాస్టర్ ప్లాన్ తీసుకువచ్చామని, త్వరలోనే కల సాకారం కానుందని ఆయన స్పష్టం చేశారు.

## ఖానాపూర్ పట్టణ అభివృద్ధి బీజేపీతో సాధ్యమవుతుంది

**ఖానాపూర్, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** ఖానాపూర్ పట్టణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ బీజేపీతో కలిసి రావాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఖానాపూర్ పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 12 వార్డులున్న పట్టణంలో కాంగ్రెస్ మూడు, బీజేపీ నాలుగు, బీఆర్ఎస్ నాలుగు, ఒక స్వతంత్ర కౌన్సిలర్ విజయం సాధించారని తెలిపారు. ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాలేదని, చైర్మన్ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి మద్దతు తెలిపితే, వైస్ చైర్మన్ తో పాటు నాలుగు కో ఆప్షన్ సభ్యులను వారికే కేటాయిస్తామని పేర్కొన్నారు.

# శ్రీ రాజరాజేశ్వరుని ఆలయంలో అంబల్లు కార్యక్రమం

**ముథోల్, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** కుబీర్ మండలకేంద్రంలోని పార్డి.బి గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ రాజరాజేశ్వరుని ఆలయం మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులతో కిటకిటలాడుతోంది. నేడు బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అంబల్లు కార్యక్రమం నిర్వహించనున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో శ్రీ రాజరాజేశ్వరుని దర్శనం కోసం తరలివస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

# కరీంనగర్ కోర్టును పేల్చేస్తామని ఈ మెయిల్ కలకలం!

**కరీంనగర్, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** కరీంనగర్ న్యాయస్థానాన్ని బుధవారం పేల్చివేస్తామంటూ వచ్చిన ఈమెయిల్ బెదిరింపుతో నగరంలో కలకలం రేగింది. పోలీసులు అప్రమత్తమై కోర్టు ఆవరణను ఖాళీ చేయించి, డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ బృందాలతో గాలించారు. ఇది ఆకతాయిల చర్యగా భావిస్తూ, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన:

# పెట్టుబడి తగ్గి, నేల ఆరోగ్యం మెరుగు

**హుజూరాబాద్, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని సైదాబాద్ గ్రామంలో బుధవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రాజెక్టు కోఆర్డినేటర్ కుమార్, ఫీల్డ్ కోఆర్డినేటర్ రమాదేవి ఆధ్వర్యంలో 20 లీటర్ల అగ్ని అస్త్రం తయారు చేసి, దాని ఉపయోగాలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల నేల ఆరోగ్యం, పర్యావరణ కాలుష్యం అరికట్టడంతో పాటు పెట్టుబడి తగ్గుతుందని కుమార్ సార్ తెలిపారు. గ్రామంలోని ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయడానికి ఆసక్తి చూపాలని కోరారు.

## బాల వికాస్ నీటి శుద్ధి పథకం వార్షిక మహాసభ:

**మానకొండూరు, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని కేశవపట్నం గ్రామంలో బాల వికాస్ నీటి శుద్ధి పథకం తృతీయ వార్షిక మహాసభ అధ్యక్షుడు జి. రామస్వామి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభలో ప్లాంట్ నిర్వహణ ఖర్చులు, నిల్వ వివరాలను వెల్లడించారు. కరెంట్ బిల్లు, మెకానిక్ ఖర్చులపై చర్చించి, కొత్త కమిటీ సభ్యులను ఎన్నిక చేశారు. గ్రామ ప్రజలు శుద్ధి చేసిన త్రాగు నీటిని వినియోగించి ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సంఘటన కేశవపట్నంలో జరిగింది.

# రాజన్న గుడికి రూ.1.43 కోట్లు ఆదాయం, 2.59 లక్షల భక్తుల రాక

**వేములవాడ, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర విజయవంతంగా ముగిసింది. ఈ నెల 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలకు తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి మొత్తం 2,59,598 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ మూడు రోజుల జాతరలో స్వామివారికి మొత్తం రూ.1 కోటి 43 లక్షల 91 వేల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో రమాదేవి తెలిపారు. ప్రసాదాల విక్రయాలు, కోడె మొక్కులు, తలనీలాల సమర్పణ, అతి శీఘ్ర దర్శనం, బద్దిపోచమ్మ ఆలయం, ఇతర మార్గాల ద్వారా ఈ ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. జాతర విజయవంతం కావడంతో ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈవో రమాదేవిని సన్మానించారు..

### తల్లాడ పీఏసీఎస్ అప్పుల్లో అవకతవకలు:

# మంత్రికి ఎమ్మెల్యే ఫిర్యాదు

**సత్తుపల్లి, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా, సత్తుపల్లిలోని తల్లాడ ప్రాథమిక వ్యవసాయక పరపతి సంఘం (ఖంఅూ) ఇచ్చిన అప్పులలో జరిగిన అవకతవకలపై స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావుకు బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సెక్రటేరియట్ లో అందుబాటులోకి బ్యాటరీ వాహనాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళలు, వికలాంగుల సౌకర్యార్థం నూతన బ్యాటరీ వాహనాలు నేటి నుండి అందుబాటులోకి వచ్చాయి. సచివాలయ ప్రాంగణం విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో ఉద్యోగులు, విభాగాల మధ్య ప్రయాణించేందుకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ సేవలను ప్రారంభించారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ప్రేమ్ దేవేందర్ ఈ వాహనాలను ప్రారంభించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# భక్తుల కోరికలు నెరవేరే యాదగిరి లక్ష్మీనరసింహుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలోని ప్రముఖ ఆలయాలలో ఒకటైన, ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల కేంద్రము సమీపములో ఎత్తయిన గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయములో ఫిబ్రవరి 18నుండి 28 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఋష్యశృంగ మహర్షి, శాంతల పుత్రుడు యాదమహర్షి చిన్నతనం నుంచే హరిభక్తుడు. ఆంజనేయస్వామి సలహాపై ప్రస్తుతం యాదగిరిగా పిలవబడుతున్న ప్రదేశంలో చాలా కాలం తపస్సు చేశారు. అప్పుడు ఒక రాక్షసుడు ఆహార అన్వేషణలో అటుగావచ్చి నిశ్చల తపస్సులో వున్న ఈ ఋషిని చూసి తినబోయాడు. ఆ విషయం తపస్సులోవున్న ఋషికి తెలియలేదుగానీ, ఆయన ఎవరి గురించైతే తపస్సు చేస్తున్నాడో ఆ శ్రీహరి ఆయుధం అయిన సుదర్శన చక్రం వచ్చి ఆ రాక్షసుని సంహరించింది. అది చూసిన ఋషి ఆ సుదర్శన చక్రాన్ని పలు విధాల ప్రార్థించి, భక్తులకు ఏవిధమైన బాధలూ కలుగకుండా దుష్ట సంహారం చేస్తూ అక్కడే వుండిపొమ్మని కోరగా ఆ సుదర్శనము అనతికాలము లోనే అక్కడ వెలయ బోవుచున్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ శిఖరాన షట్కోణాకారాన వెలసి స్వామి దర్శనానికి వచ్చు భక్తులను సదా కాపాడుతూ వుంటానని వరమిచ్చి అంతర్ధానం అయినట్లు కథనం. యాద మహర్షి తన తపస్సుని కొనసాగించగా, ఆయన తపస్సుకి మెచ్చి నరసింహస్వామి ప్రత్యక్షమై, యాద మహర్షి కోరిక మీద అక్కడ లక్ష్మీ నరసింహస్వామి గా వెలిశాడు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది.ఆ ఋషి తపస్సు చేసింది, స్వామి ప్రత్యక్షమైంది కొండక్రిందవున్న పాత లక్ష్మీ నరసింహస్వామి గుడి దగ్గర అని అంటారు.యాద మహర్షి కోరిక మీదే ఆంజనేయస్వామి యాదగిరిలో క్షేత్రపాలకుడుగా వున్నాడు.ప్రహ్లాదుని రక్షించటానికి, అహోబిలంలో నరసింహస్వామి స్తంభాన్ని చీల్చుకుని వచ్చి హిరణ్యకశిపుని సంహరించిన తర్వాత ఆ భీకర రూపాన్ని శాంత పరచటం ఎవరికీ సాధ్యం కాలేదట. అప్పుడు దేవతలంతా లక్ష్మీదేవిని ప్రార్థిస్తే ఆమె ప్రత్యక్షమై స్వామిని శాంతింప చేసిందటప్పుడు ప్రహ్లాదుడు స్వామిని అక్కడే ప్రసన్న రూపంలో కొలువై వుండమని కోరాడట. అయితే స్వామి అతి భీకర రూపంలో దర్శనమిచ్చిన ఆ ప్రదేశంలో శాంత రూపంతో కొలువై వుండటం లోక విరుద్ధమని అక్కడికి సమీపంలో వున్న యాదగిరిలో లక్ష్మీ నరసింహస్వామిగా లోక కళ్యాణార్థం కొలువు తీరుతానని బయల్దేరారు, లక్ష్మీ సమేతుడై కొండపై గల గుహలో వెలిశారు. ఆయనవెంట ప్రహ్లాదుడూ, సకల దేవతలూ వచ్చి ఆయనతోపాటు ఇక్కడ కొలువుతీరి స్వామిని సేవిస్తూ వచ్చారట. రాక్షస సంహారంచేసి లోక కళ్యాణం చేశారని సంతోషంతో స్వామివారి కాళ్ళని బ్రహ్మదేవుడు ఆకాశ గంగతో కడిగాడట. ఆ ఆకాశ గంగ లోయలలోంచి పారి విష్ణు పుష్కరిణిలోకి చేరింది. ఈ పుష్కరిణికి కూడా చాలా ప్రాముఖ్యం వుంది. ఇందులో స్నానంచేసి స్వామిని సేవించినవారికి సకల కోరికలూ తీరుతాయి. ఇక్కడ పితృకార్యాలు చేస్తే పితృదేవతలు తరిస్తారు. చాలామంది భక్తులు ఆరోగ్యం, గ్రహపీడా నివారణ, వగైరా కోరికలతో కొన్నాళ్ళపాటు ఇక్కడ వుండి విష్ణు పుష్కరిణిలో స్నానం చేసి స్వామిని సేవిస్తారు. అంతేగాక ఇప్పటికీ రోజూ రాత్రుళ్ళు ఆ చుట్టుప్రక్కల కొండలమీద తపస్సు చేసుకుంటున్న ఋషులు విష్ణు పుష్కరిణిలో స్నానంచేసి స్వామిని అర్చిస్తారట. దానికి నిదర్శనంగా వారు వచ్చేటప్పుడు మృదంగ ధ్వనులు వస్తాయట. పాదాల గుర్తులు కొందరు చూశారుట. వారు స్వామిని అర్చించిన గంధ పుష్పాదులు కూడా నిదర్శనమంటారు.మెట్ల మార్గాన వెళ్తే దోవలో శివాలయం కనబడుతుంది. ఇక్కడ శివుడు లక్ష్మీ నరసింహస్వామి కన్నా ముందు స్వయంభూగా వెలిశాడు.ఇంకో విశేషం.. ఈ మెట్లు ఎక్కి స్వామిని సేవించినవారి కీళ్ళ నొప్పులు తగ్గుతాయని భక్తుల విశ్వాసం యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ ముఖద్వారం యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం నల్గొండ జిల్లాలో ప్రముఖ మైన దివ్య క్షేత్రం: యాదగిరి గుట్టకు సంబందించిన కథకు మూలం వాల్మీకి రామాయణంలో వున్నది. విభాండక ఋషి కుమారుడు రుష్యశృంగుడు.అతని కుమారుడు హాద ఋషి, అతనినే హాదర్షి అని కూడ అంటారు. అతను నరసింహ స్వామి భక్తుడు.అతనికి స్వామివారిని ప్రత్యక్షంగా చూడాలని కోరిక పుట్టింది. ఆంజనేయస్వామి సలహా మేరకు తపస్సు చేయగా స్వామి ప్రత్యక్షమవుతాడు. ఆ ఉగ్ర నరసింహ మూర్తిని చూడలేక శాంత స్వరూపంతో కనిపించమని యాదర్షి కోరగా స్వామి వారు కరుణించి లక్ష్మీ సమేతుడై దర్శన మిచ్చి "ఏంకావాలో కోరుకో" మంటే యాదర్షి స్వామి వారికి "శాంత మూర్తి రూపంలోనె కొలువై కొండపై ఉండి పొమ్మని కోరాడు. ఆవిధంగా లక్ష్మీ నరసింహ స్వామి కొండపై అలా కొలువై ఉండిపోయాడు. కొన్నాళ్ళకు స్వామివారిని వేర్వేరు రూపాల్లో చూడాలనిపించి యాదర్షి మరలా తపస్సు చేశాడు. అతని కోరిక మేరకు స్వామి వారు జ్వాలా, యోగా, నంద, గండబేరుండ, నారసింహ రూపాల్లో దర్శనమిచ్చాడు. అందుకే ఈ క్షేత్రాన్ని పంచ నారసింహ క్షేత్రం అంటారు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది. బ్రహ్మోత్సవాలు తొలిరోజు విశ్వక్సేన ఆరాధనతో ఆరంభమై అలంకార అవతార సేవలతో కొనసాగి 28న చక్రస్నానం, మహాపూర్ణాహుతితో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా 18న ఉదయం 10 గంటలకు విశ్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, రక్షాబంధనం, సాయంత్రం మృత్సాంగ్రహణం, అంకురారోహణ పర్వాలు నిర్వహిస్తారు. 19 ఉదయం 8 గంటలకు అగ్ని ప్రతిష్ట, 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 6:30 గంటలకు భేరీ పూజ, హవనం, దేవతాహ్వానం నిర్వహిస్తారు. 20న ఉదయం తొమ్మిది గంటలకు మత్స అవతార అలంకార సేవ, వేద పారాయణం, రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ, 21న ఉదయం 9 గంటలకు వటపత్ర శాయి అలంకార సేవ , రాత్రి 7 గంటలకు హంస వాహన సేవ, 22న ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణలంకార సేవ, రాత్రి 7 గంటలకు పొన్నవాహన సేవ, 23న ఉదయం

9 గంటలకు గోవర్ధన గిరి దారి అలంకార సేవ, రాత్రి 7 గంటలకు సింహ వాహన సేవ, 24న ఉదయం 9 గంటలకు జగన్మోహిని అలంకార సేవ, రాత్రి 7 గంటలకు అశ్వవాహన సేవ, తదుపరి శ్రీ స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. 25న ఉదయం 9 గంటలకు శ్రీరామ అలంకార హనుమంత వాహనం సేవ , రాత్రి 8 గంటలకు గజవాహన సేవ, శ్రీ స్వామి అమ్మవార్ల తిరు కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. 26వ తేదీన ఉదయం 9 గంటలకు మహా విష్ణు అలంకారం, గరుడోత్సవము, రాత్రి 8 గంటలకు దివ్యవిమాన రథోత్సవం, 27వ తేదీన ఉదయం 10.30 గంటలకు మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, సాయంత్రం 7 గంటలకు శ్రీ పుష్పయాగం, దేవతో ద్వాసన, 28వ తేదీన ఉదయం 10 గంటలకు శ్రీ స్వామివారికి అష్టోత్తర శతకటాభిషేకం, రాత్రి 9 గంటలకు శ్రీ స్వామివారి శృంగార డోలోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. దేవస్థానం ఈఓ భవానీ శంకర్ ఐఎఎస్ నేతృత్వంలో అధికారులు, అర్చకులు, సిబ్బంది వివిధ శాఖల అధికారుల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు.

# ఉదార జాతీయవాది గోఖలే

**హైదరాబాద్ పెన్ పవర్:** స్వాతంత్ర్య సమరంలో తెర ముందు కనిపించి, పోరాట యోధులుగా, త్యాగధనులుగా, ప్రజానాయకులుగా చరిత్ర పుటలకు ఎక్కినవారు కొందరైతే, సమర నేపథ్యంలో తెర వెనుక నిశ్శబ్దంగా కార్యకలా పాలు సాగించిన వారెందరో. లక్ష్యం ఒకటే స్వాతంత్ర్య సాధన. మార్గా లు, కార్యాచరణ మార్గాలు వేరు. స్వాతంత్ర్య సమరంలో నిరంతరం కదలాడుతూ, గాంధీజీ, నేతాజీ, తిలక్, లాలాలజపతి రాయ్, టంగు టూరి ప్రకాశం లాంటి యోధులు ముందు వరుసలో ఉంటే, నిశ్శబ్దంగా, నిర్మాణాత్మకంగా, ఆచరణా త్మకంగా ఉద్యమాలకు ఊపిరిపోసి, లక్ష్య సాధనలో తమ జీవితాల్ని జాతికి ధారపోసి, తెర వెనుక నిలిచిన వారెందరో... అలాంటి తెర వెనుక కార్యసాధకులలో అగ్రగణ్యు లు గోపాలకృష్ణ గోఖలే. ఆయన ఆంగ్లంలో నిష్ణాతుడవడమే మాకుండా పాశ్చాత్య రాజకీయా లను అవగాహన చేసుకున్నారు. పాశ్చాత్య తత్వ శాస్త్రాన్నీ ఆకళింపు చేసుకున్నారు. భార తీయ, పాశ్చాత్య సంస్కృతుల మధ్య సమన్వయకర్తగా నిలిచిన గోపాలకృష్ణ గోఖలేను అటు శ్వేత జాతి పాలకులు, ఇటు దేశీయ అధిక సంఖ్యాక నేతలు విశ్వసిం చారు. అలాంటి భిన్న వ్యక్తిత్వ కారణంగానే గాంధీ, ముహమ్మద్ అలీజిన్నా లాంటి వారిని ఆకట్టు కొని, వారిని తమ రాజకీయ 'గురువు' గా భావించేలా చేసింది. గోపాలకృష్ణ గోఖలే (మే 9, 1866 – ఫిబ్రవరి 19, 1915) మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలోని కోట్లుక్‌లో 1886 మే 9న ఒక సాంప్రదాయిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. విశ్వవిద్యాలయ స్థాయి విద్యను అభ్యసించిన తొలితరం భారతీ యులలో ఆయన ఒకరు. జస్టిస్ రణడే శిష్యరికంలో భారతీయ అర్థశాస్త్రాన్ని అభ్యసించి, పూనాలోని ఫెర్గ్యూసన్ కళాశాలలో చరిత్ర, రాజకీయార్థ శాస్త్ర ఆచార్యునిగా చేరారు. తరువాత ఆ కళాశాల ప్రిన్సిపాల్ అయ్యారు. ఆ సమయంలోనే ఆయన పదవికి రాజీనామా చేసి భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. 1900 సంవత్సరంలో బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికైన గోఖలేకి అక్కడ ఫిరోజ్‌షా మెహతా సహచర్యం లభించింది. 1902 లో వైస్రాయ్ కౌన్సిల్ సభ్యుల య్యారు. ఆ సమయంలో అస్తవ్యస్త తమై ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ గురించి గోఖలే ఉపన్యసించిన తీరు పలువురిని ఆకట్టుకుంది. ఆయన లోని ఆర్థిక వేత్తను ప్రపంచానికి పరిచయం చేసింది. 1905 లో బెనారస్‌లో జరిగిన కాంగ్రెస్ సమావే శాల్లో అధ్యక్షుడిగా ఎన్నికైనపుడు గోఖలే చేసిన ప్రసంగం నేటికీ అత్యు త్తమ ప్రసంగాలలో ఒకటిగా కీర్తించ బడుతోంది.1902 నుంచి 1915లో మరణించే వరకు భారత శాసన మండలి సభ్యుడిగా ఉన్నారు. గొప్ప విద్యావేత్తగాను, పార్లమెంటే రియన్‌గాను ఘనమైన చరిత్ర ఉంది. 1905లో సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీని ఏర్పాటుచేశాడు. బ్రిటీష్ వారి విధానాలను తీవ్రంగా వ్యతిరేకించ కున్ననూ భారతీయు లలో జాతీయతా భావాన్ని పెంపొందించ డానికి విశేష కృషి చేశారు. విదేశాలలో వున్న భారతీయుల హక్కుల సాధన పట్ల శ్రద్ధ క్రమంలో, దక్షిణాఫ్రికాలో భారతీయుల హక్కు ల పరిరక్షణ కోసం ఉద్యమించిన గాంధీ పరిచయం అయ్యారు. అలా వారి పరిచయం గురుశిష్యుల బంధంగా అభివృద్ధి చెందింది.భారతదేశంలో రాజ్యాంగ సంస్కర ణల ప్రక్రియకు ఊతం అందించిన మాంటెగ్ చెమ్స్‌ఫర్డ్ చట్ట రూప కల్పనలో, బెంగాల్ విభజన జరిగిన సందర్భంలో, భారత జాతీయ కాంగ్రెస్ చరిత్రలో, బ్రిటిష్ ఇండియా చరిత్రలో గోఖలే పాత్ర ఎన్నదగినది. (1905) కాశీలో జరిగిన కాంగ్రెస్ వార్షిక సభలలో విదేశీ వస్తు బహిష్కరణ వంటి కీలక నిర్ణయం తీసుకున్న సభలకు అధ్యక్షునిగా గోఖలే ఉండడం గమనార్హం. బ్రిటిష్ పాలనకు విధేయత చూపిస్తూ దేశ వ్యవహారాలను నడిపించడంలో ఆయన మితవాదిగా ముద్ర వేసుకున్న నేపథ్యం. సైద్ధాంతిక భేదాలు ఉన్నా, గోఖలే తన ప్రత్యర్థులతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించారు. బొంబాయిలో, గోఖలే.. బ్రిటిష్ ప్రభుత్వ కఠినమైన భూ ఆదాయ విధానాలను వ్యతిరేకించారు. ఉచిత మరియు నిర్బంధ ప్రాథమిక విద్యను సమర్థించారు. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడ టానికి వెనకాడలేదు. గోఖలే సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీని స్థాపించారు. గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పొలిటిక్స్ అండ్ ఎకనామిక్స్ (గోఖలే ఇన్‌స్టిట్యూట్ అనే పేరుతో ప్రసిద్ధి). భారత్‌లో ప్రాచీన ఆర్థికశాస్త్ర విద్యాలయం. ఇది మహారాష్ట్ర పుణె లోని జింఖానా ప్రాంతంలో సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ వారి ఆర్థిక సహాయముతో స్థాపించబడిన విద్యాలయం. నేటికినీ సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ వారే ఈ విద్యాలయానికి ట్రస్టీలు. గోఖలే పిలుపు మేరకే గాంధీజీ 1915లో దక్షిణాఫ్రికాను వీడి శాశ్వతంగా భారత దేశానికి వచ్చారు. పలువురిని ప్రభావితం చేసిన గోపాల కృష్ణ గోఖలే గాంధీజీ వచ్చిన దాదాపు నెల రోజులకే ఫిబ్రవరి 19, 1915న గోఖలే తుదిశ్వాస విడిచారు.

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**మధిర, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా, దమ్మపేట మండలం కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన చెక్కులను గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాల అమ్మాయిల పెళ్లిళ్లకు ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకం ఎంతో ఉపయోగమని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాల ప్రయోజనాన్ని పొందాలని, ఎవరూ మధ్యవర్తుల మాటలు వినకుండా నేరుగా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.

## సీతారామ ప్రాజెక్టు భూనిర్వాసితులకు అత్యధిక పరిహారం....

**ఖమ్మం, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూసేకరణకు అత్యధిక పరిహారం మంజూరు చేసి భూనిర్వాసితుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయలపల్లి గ్రామాలకు చెందిన భూనిర్వాసితులతో ఆయన చర్చించారు. అలాగే, ఖరీఫ్ (2025-26) సీజన్?కు సంబంధించి సన్న వడ్లకు రూ.500 బోనస్?ను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 64 వేల మందికిపైగా రైతులకు రూ.175.69 కోట్లు చెల్లించినట్లు తెలిపారు.

# కొడాలి, వల్లభనేని విషయంలో కిం కర్తవ్యం





**విజయవాడ, ఫిబ్రవరి 18, పెన్ పవర్:**
రాజకీయాల్లో కొన్ని నియోజకవర్గాలది ప్రత్యేక స్థానం. ముఖ్యంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలోని గుడివాడ, గన్నవరం నియోజకవర్గాలు ఎప్పుడు హాట్ గానే ఉంటాయి. దీనికి కారణం అక్కడ వరుసగా కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్ గెలుస్తూ రావడమే. ఇద్దరూ టిడిపి నుంచి తమ ప్రస్థానాన్ని ప్రారంభించిన వారే. అయితే ఉన్నఫలంగా వారిద్దరూ టిడిపి నాయకత్వంతో పాటు చంద్రబాబు తీవ్రంగా వ్యతిరేకించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.. ఇద్దరూ ఫైర్ బ్రాండ్లే. చంద్రబాబుతో పాటు లోకేష్ పై వ్యక్తిగత విమర్శలు చేస్తూ రాష్ట్రంలోనే గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో ఒకరు జైలుకు వెళ్లి అనారోగ్యానికి గురయ్యారు. మరొకరు వెళ్లకుండానే ఆరోగ్యపరమైన సమస్యలను ఎదుర్కొన్నారు. అయితే ఆ ఇద్దరూ యాక్టివ్ కాకపోవడంతో ఏం చేయాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పాలు పోవడం లేదు.కొడాలి నాని 2004 నుంచి 2019 వరకు వరుసగా నాలుగు సార్లు గుడివాడ నుంచి గెలిచారు. రెండుసార్లు టిడిపి నుంచి ప్రాతినిధ్యం వహించారు. మరో రెండు సార్లు వైసీపీ తరఫున గెలిచారు. జగన్మోహన్ రెడ్డి ఆయనకు మంత్రిగా అవకాశం ఇచ్చారు. అయితే వ్యక్తిగత దూకుడుతో వివాదాస్పద ముద్ర తెచ్చుకున్నారు కొడాలి నాని. 2024 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత నియోజకవర్గానికి దూరమయ్యారు. అలా అనారోగ్యం బారిన పడ్డారు. అయితే ఇంతవరకు గుడివాడ నియోజకవర్గంలో యాక్టివ్ కాలేదు. అలాగని ప్రత్యామ్నాయ నేతను జగన్మోహన్ రెడ్డి నియమించలేదు. కొడాలి నాని విషయంలో వేరే ఆలోచన చేస్తే చెడ్డ పేరు రావడం ఖాయం. అందుకే కొడాలి నాని కోసం జగన్ సైతం ఎదురుచూస్తున్నట్లు అర్థమవుతోంది.మరోవైపు అనూహ్యంగా ఎమ్మెల్యేగా గెలిచారు వల్లభనేని వంశీ మోహన్. 2009 ఎన్నికల్లో విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2014లో మాత్రం గన్నవరం నుంచి పోటీ చేసి గెలిచారు అసెంబ్లీకి. ఐదేళ్లపాటు చంద్రబాబు నాయకత్వం పట్ల విధేయత గా ఉండేవారు. 2019లో రెండోసారి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. అది మొదలు చంద్రబాబుతో పాటు లోకేష్ ను టార్గెట్ చేసుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసుల్లో చిక్కుకున్నారు. చాలా రోజులపాటు జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. ఈ క్రమంలో ఆయన అనారోగ్యానికి గురయ్యారు. ఇప్పటికీ వంశి నియోజకవర్గంలో యాక్టివ్ కాలేదు. అలాగని ప్రత్యామ్నాయ నేతకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించలేదు జగన్మోహన్ రెడ్డి.అయితే ఈ రెండు చోట్ల టిడిపి కూటమి పట్టు బిగిస్తోంది. రెండు చోట్ల టిడిపికి బలమైన ఎమ్మెల్యేలు ఉన్నారు. దూకుడు ప్రదర్శిస్తున్నారు. వీరి పనితీరు బాగున్నట్లు కూడా నివేదికలు వస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో మరోసారి వీరిద్దరే పోటీ చేయనున్నారు. అందుకే ఈ రెండు నియోజకవర్గాల విషయంలో జగన్మోహన్ రెడ్డి మల్ల గుల్లాలు పడుతున్నారు. వారిని తప్పిస్తే చెడ్డ పేరు వస్తుంది. అలాగని వారు యాక్టివ్ కావడం లేదు. ఈ విషయంలో ఏం చేయాలో జగన్మోహన్ రెడ్డికి పాలు పోవడం లేదని వైసీపీలో ప్రచారం నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# బెజవాడ కార్పొరేషన్ పై ఆశకిరణ్ గురి

**విజయవాడ, ఫిబ్రవరి 18, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వంగవీటి కుటుంబానికి కాస్త ప్రత్యేక స్థానం ఉంటుంది. దివంగత వంగవీటి రంగా రాజకీయ వారసత్వం పై ఎప్పుడు ఏదో ఒక చర్చ మనం చూస్తూనే ఉంటాం. వంగవీటి రంగా కుమారుడు వంగవీటి రాధా రాజకీయాల్లో ఉన్నప్పటికీ, ఆయన పెద్దగా యాక్టివ్ గా లేరు.. అనే ఆవేదన రంగ అభిమానుల్లో కనపడుతూ ఉంటుంది. ఇక ఇప్పుడు రంగా కుటుంబం నుంచి ఆయన కుమార్తె ఆశ కిరణ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఏ పార్టీలో చేరకపోయినప్పటికీ, ప్రజల్లో ఉంటానంటూ ఆమె చేసిన ప్రకటనలపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగింది. ఆమెకు తెలుగుదేశం( పార్టీ లేదా జనసేన పార్టీలు ఆహ్వానం పలుకుతున్నాయని వార్తలు కూడా వచ్చాయి.అయితే ఇప్పుడు మరో వార్త బెజవాడ రాజకీయాల్లో సంచలనంగా మారింది. వంగవీటి ఆశ కిరణ్, విజయవాడ మేయర్ అయ్యే అవకాశాలు ఉండొచ్చు ప్రచారం మొదలైంది. గత కార్పొరేషన్ ఎన్నికల్లో మహిళను అప్పటి వైసిపి ప్రభుత్వం మేయర్ గా ఎంపిక చేసింది. ఇప్పుడు అదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, కూటమి కూడా మహిళా నాయకురాలిని మేయర్ గా ఎంపిక చేసే అవకాశం ఉండవచ్చు. త్వరలోనే ఆమె జనసేన లేదా టిడిపిలో జాయిన్ అయ్యే అవకాశం ఉండవచ్చని.. ఈ ఏడాది చివర్లో జరగబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఆమె కార్పొరేటర్ గా నిలబడే అవకాశాలు ఉండవచ్చును అంటూ హడావుడి మొదలైందికాపు సామాజిక వర్గ ఓటు బ్యాంకు చీలకుండా, కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటుంది. జనసేన రూపంలో మెజారిటీ కాపు సామాజిక వర్గం కూటమి వైపు ఉండగా.. వంగవీటి కుటుంబం ద్వారా కొంత కాపు సామాజిక వర్గాన్ని తమ వైపుకు తిప్పుకోవాలని వైయస్ జగన్ భావిస్తున్నారు. అందుకే ఇప్పుడు వంగవీటి ఆశా కిరణ్ ద్వారా.. కాపు సామాజిక వర్గంలో చీలిక తీసుకురాకుండా ఉండే దిశగా అడుగులు పడుతున్నాయి. త్వరలోనే వంగవీటి రాధకు ఎమ్మెల్సీ లేదా రాజ్యసభ ఇచ్చే అవకాశం కూడా ఉంది. ఇక ఇదే సమయంలో వంగవీటి రంగా కుమార్తెకు కూడా విజయవాడ మేయర్ పదవిని ఖరారు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండకపోవచ్చు. దీనిపై ఇప్పటికే కూటమి పెద్దలు నిర్ణయం తీసుకున్నట్లుగా కూడా సమాచారం.

# నెయ్యి టెండర్లలలో కొత్త పద్ధతికి శ్రీకారం



**తిరుమల, ఫిబ్రవరి 18,పెన్ పవర్:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించే ఆవు నెయ్యి కొనుగోలు ప్రక్రియలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. లడ్డూ నాణ్యత, స్వచ్ఛత విషయంలో భక్తుల నమ్మకాన్ని నిలబెట్టేలా, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఛైర్మన్ బీఆర్ నాయుడు నేతృత్వంలోని నూతన టీటీడీ బోర్డు ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకుంది.గతంలో, అంటే 2024కు ముందు, శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచిపై భక్తుల నుంచి కొన్ని విమర్శలు, అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో స్పందించిన టీటీడీ, నెయ్యి కొనుగోలు విధానాన్ని సమూలంగా మార్చాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పలు కఠిన నిబంధనలను ప్రవేశపెట్టింది. నెయ్యి నాణ్యత రవాణా సమయంలో దెబ్బతినకుండా ఉండేందుకు, సేకరణ భౌగోళిక పరిధిని గతంలో ఉన్న 1500 కిలోమీటర్ల నుంచి 800 కిలోమీటర్లకు తగ్గించారు. నెయ్యిని సరఫరా చేసే ట్యాంకర్లకు తప్పనిసరిగా జీపీఎస్ లాక్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి, రవాణాను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు.నాణ్యత పరీక్షల విషయంలోనూ రాజీపడకుండా కఠిన ప్రమాణాలను నిర్దేశించారు. డైరీల తయారీ సామర్థ్యాన్ని అంచనా వేయడానికి వీ=ూ స్కోర్ బోర్డ్ విధానాన్ని, ఖీూ= 2.1.8 నిబంధనలతో పాటు మిల్క్ ఫ్యాట్ ప్యూరిటీ పరీక్షలు (×ూ 17678:2019), సెన్సరీ పారామీటర్స్ (×ూ జశీఎవ: 7770:1975) వంటివి తప్పనిసరి చేశారు.
ఈ సంస్కరణల్లో భాగంగా, 2024-25 సంవత్సరానికి గాను గుత్తాధిపత్యానికి తావివ్వకుండా మొత్తం 65 లక్షల కిలోల నెయ్యి సేకరణకు 7 విడతలుగా టెండర్లను నిర్వహించారు.
ఈ పారదర్శక ప్రక్రియలో 7 ప్రముఖ డైరీ సంస్థలు పాల్గొనగా, వాటికి దక్కిన టెండర్ల వివరాలు ఇలా ఉన్నాయి:
1. నందిని (ఖవీఖీ) - 4 టెండర్లు దక్కించుకుంది
2. మదర్ డైరీ - 2 టెండర్లు దక్కించుకుంది
3. ఇందాపూర్ డైరీ - 2 టెండర్లు దక్కించుకుంది
4. సంగం డైరీ - 1 టెండర్ దక్కించుకుంది
5. ప్రీమియర్ అగ్రి డైరీ - టెండర్ దక్కించుకోలేదు
6. కొల్హాపూర్ డైరీ (గోకుల్) - టెండర్ దక్కించుకోలేదు
7. గోవింద్ మిల్క్ - టెండర్ దక్కించుకోలేదుఈ మార్పుల ద్వారా భక్తులకు అత్యంత స్వచ్ఛమైన, నాణ్యమైన లడ్డూ ప్రసాదాన్ని అందించడమే తమ ప్రథమ కర్తవ్యమని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా ఓ అధికారిక పత్రికా ప్రకటనను విడుదల చేశారు.

# రాజోలులో రగులుతున్న జ్వాల

**కాకినాడ ఫిబ్రవరి 18, పెన్ పవర్:**
అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రాజోలు అనగానే ఓ ప్రత్యేకత ఉంటుంది. జనసేన పార్టీ నుంచి వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యే గెలిచిన నియోజకవర్గం అది. అదికూడా జనసేన పార్టీకి మొట్టమొదటి ఎమ్మెల్యేను గెలిపించి శుభారంభం ఇచ్చిన నియోజకవర్గం. ఈ నియోజకవర్గం అందుకే అంత ప్రత్యేకం. ఇదే విషయాన్ని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కూడా చాలా సందర్భాల్లో ప్రస్తావించారు. రాజోలు ఒక చిరుదివ్వె లాంటిదని కూడా ఆయన ఎంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే ఈ నియోజకవర్గంలో మాత్రం జనసేన ఎమ్మెల్యే పనితీరుపై ఆ పార్టీలోనే అసంతృప్తి జ్వాలలు రేగుతోన్నాయా అన్న ప్రశ్నకు అవుననే సమాధానం ఆపార్టీ నాయకుల నుంచే వినిపిస్తోంది. ఇదిలా ఉంటే ఇదే నియోజకవర్గంలో టీడీపీ తన ఉనికిని కాపాడుకునేందుకు కూడా భారీ స్థాయిలో ప్రయత్నిస్తోంది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కుమార్తె గొల్లపల్లి అమూల్యను టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్‌గా నియమించింది. దీంతో రాజోలులో టీడీపీలో కొత్త జోష్ నెలకొంది. కూటమి ప్రభుత్వంలో ఏ కార్యక్రమానికైనా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు సమాచారం ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటుంది. అయితే రాజోలు నియోజకవర్గంలో మాత్రం టీడీపీ ఇంచార్జ్‌గా ఉన్న అమూల్యకు చాలా ప్రభుత్వ కార్యక్రమాలకు అసలు సమాచారం ఇవ్వడం లేదన్నది ఆమె తన అనుచరుల వద్ద వాపోతున్నారట. ఇదే విషయాన్ని పార్టీ అధిష్టానానికి కూడా తెలిపినట్లు తెలుస్తోంది. నియోకవర్గాల్లో పలు నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ కూడా కనీస సమాచారం ఇవ్వకుండా తనకు నచ్చిన వారినే నియమించుకుంటున్నారని, వారి పార్టీ వరకు పరవాలేదు కానీ టీడీపీ నుంచి నియమించిన వారి విషయంలో కూడా తన వ్యతిరేకులకు కట్టబెట్టి తనకు వ్యతిరేక వర్గాన్ని పెంచి పోషిస్తున్నారని అమూల్య వాదనగా తెలుస్తోంది. ఉదాహరణకు ఇటీవలే ఇచ్చిన అంతర్వేది ఆలయ కమిటీ ఛైర్మన్ విషయంలోనూ ఇదే జరిగిందన్నది అమూల్య వర్గీయుల వాదనగా వినిపిస్తోంది.

అంతర్వేది లక్ష్మి నరసింహస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ పదవిని టీడీపీ నేతకే ఇచ్చామని ఎమ్మెల్యే దేవవరప్రసాదరావు చెబుతున్నా ఈ సమాచారం తనకు చెప్పలేదని, తాను ప్రతిపాదించిన పేరు వేరే నాయకుడిది కాగా వారికి అనుకూలమైన వారికే పదవి కట్టబెట్టారన్నది అమూల్య మాటగా చెబుతున్నారు ఆమె అనుచరులు. ఇదే కాకుండా నియోజకవర్గంలో నియమించిన పలు నామినేటెడ్ పోస్టుల్లో టీడీపీకి ఇవ్వాల్సిన పదవుల్లో కూడా తన జోక్యం లేకుండా చేస్తున్నారని, నియోజకవర్గంలో అసలు ఒక ఇంచార్జ్ ఉన్నారన్న విషయాన్ని కూడా ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని అమూల్య బాధపడుతున్నట్టు తెలుస్తోంది.ప్రస్తుత పరిస్థితుల్లో జనసేన పార్టీ ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గాల్లో టీడీపీ అధిష్టానం కూడా జోక్యం చేసుకుంటున్న సందర్భాలు చాలా తక్కవనే చెబుతున్నారు విశ్లేషకులు. ఇదే విషయం రాజోలు నియోజకవర్గంలో కూడా వర్తిస్తుందంటున్నారు. అందులోనూ జనసేన అధినేతకు రాజోలు నియోజకవర్గం అంటే మరింత ప్రత్యేకం కాగా ఇక్కడ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తోన్న దేవ వరప్రసాదరావు మాజీ ఐఏఎస్ అధికారి కావడం, ఆయనకు అధినేతతో అత్యంత సాన్నిహిత్యం ఉండడం ఆయన మాటే వేదం అవుతుందంటున్నారు. ఈ పరిస్థితుల్లో అంతర్గతంగా జనసేన, టీడీపీ నేతల మధ్య అసంతృప్తి పరిస్థితులున్నా కూడా అవేమీ ఇరు పార్టీ నాయకత్వాలు పట్టించుకునే పరిస్థితి ఉండదని, లైట్ తీసుకుంటున్నాయంటున్నారు.ఇదిలా ఉంటే జనసేన పార్టీలోనే ఎమ్మెల్యేపై అసంతృప్తి జ్వాలలు కనిపిస్తున్నాయి.

నియోజకవర్గంలో ఇప్పటికే రెండు వర్గాలుగా అంతర్గత యుద్ధాలే జరుగుతున్నాయి.. అవి ఎంతలా అంటే సోషల్ మీడియా వేదికగా కూడా ఒకరిపై మరొకరు దుమ్మెత్తిపోసుకునేంత స్థాయిలో అంతర్గత విభేధాలు భగ్గుమంటుండగా కొందరైతే బాహాటంగా ఎమ్మెల్యే పనితీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. దీనికి తోడు ఇటీవల కాలంలో వైసీపీకకు చెందిన కొందరు జనసేన పార్టీలో దూరి ఎమ్మెల్యే అనుచరులుగా చక్రం తిప్పడం ముందు నుంచి పార్టీ జెండా మోసిన నాయకులు, కార్యకర్తలకు అసలు మింగుడు పడని అంశంగా మారింది. దీంతో ఎమ్మెల్యే తీరుపై కూడా కొందరు అధిష్టానానికి ఇప్పటికే ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. జనసేన పార్టీలో అంతర్గత పోరు విషయం ఇలా ఉంటే ఇక టీడీపీలో కూడా రెండు వర్గాలుగా మాటల యుద్ధం సాగుతోంది. ఇంచార్జ్ అమూల్యపై బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు ఆ పార్టీలోనే కొందరు నేతలు. అమూల్య ఒంటెద్దు పోకడలతో కొందరిని మాత్రమే వెంటేసుకుని వెళు_న్నారని ఆరోపిస్తున్నారు. మొత్తం మీద రాజోలు నియోజకవర్గంలో అటు జనసేన, ఇటు టీడీపీలో అంతర్గత కోల్డ్ వార్ అయితే జరుగుతోందంటున్నారు.

# వేగంగా కాశీబుగ్గ ఫ్లైఓవర్ పనులు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 18 పెన్ పవర్:** శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులలో వేగం పెరిగింది. కాశీబుగ్గ పైవంతెన పనులను ఏప్రిల్ నెలకల్లా పూర్తిచేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. మంగళవారం రోజున ఫ్లైఓవర్ నిర్మాణ పనులను రామ్మోహన్ నాయుడు పరిశీలించారు. అనంతరం పలాస ఆర్వోబీ పనులు, కేంద్రీయ విద్యాలయం పనుల పురోగతిని రామ్మోహన్ నాయుడు పరిశీలించారు. ఈ వివరాలను ఎక్స్ వేదికగా పంచుకున్నారు.ఏపీలో కొత్త ఫ్లైఓవర్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. కాశీబుగ్గ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్ ఏప్రిల్ నాటికి పూర్తవుతాయని వెల్లడించారు. పలాస రైల్వే పైవంతెన, కేంద్రీయ విద్యాలయం పనులు జరుగుతున్న తీరును రామ్మోహన్ నాయుడు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి రామ్మోహన్ నాయుడు.. కాశీబుగ్గ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ఏళ్లతరబడి సాగుతూ వచ్చాయన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కేంద్రీయ విద్యాలయంలోనూ వచ్చే ఏడాది నుంచి తాత్కాలికంగా తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.పలాస ప్రజల ఎన్నో ఏళ్ల కల అయిన పలాస ఆర్వోబీ ప్రాజెక్టు వేగంగా రూపుదిద్దుకోవడం ఆనందంగా ఉందని.. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే దీనికి అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను కూడా తిరిగి ప్రారంభించామని.. భారతీయ రైల్వే, జిల్లా యంత్రాంగం సమన్వయంతో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని రామ్మోహన్ నాయుడు వివరించారు. ప్రజలకు త్వరగా అందుబాటులోకి రావడానికి పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. పలసా ఆర్వోబీ నిర్మాణం పూర్తి అయితే పలాస పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రయాణికులకు సౌకర్యవంతమైన రాకపోకలకు వీలు కలుగుతుందని వివరించారు. పలాసలో ఏర్పాటు చేయనున్న కేంద్రియ విద్యాలయం ద్వారా సాయుధ దళాల సిబ్బంది, కేంద్ర సంస్థల ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్యా అవకాశాలు లభిస్తాయని వివరించారు.మరోవైపు కాశీబుగ్గ లెవల్ క్రాసింగ్ గేటు వద్ద ట్రాఫిక్ సమస్యలు ఎప్పటి నుంచో వేధిస్తున్నాయి. ప్రతి పది అరగంటకూ గేట్లు పడుతూ ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీంతో ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించాలని నిర్ణయించారు. 2009లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే వివిధ కారణాలతో నిర్మాణ పనులకు అంతరాయం కలుగుతూ వచ్చింది. భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం వంటి అంశాల కారణంగా నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఈ పరిస్థితులలో టీడీపీ కూటమి సర్కారు ప్రత్యేక దృష్టి సారించడంతో నిర్మాణ పనులలో వేగం పెరిగింది. తాజాగా ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు

# 26న మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు

**ఏలూరు, ఫిబ్రవరి 18, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు, ఏలూరు నగరపాలక సంస్థల్లో ఖాళీగా ఉన్న మేయర్, డిప్యూటీ మేయర్ పదవుల భర్తీకి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 26వ తేదీన ఈ కీలక స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ మేరకు ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఎన్నికల నిర్వహణలో భాగంగా పారదర్శకతను పాటించాలని, సంబంధిత పాలకవర్గ సభ్యులకు, ఎక్స్ అఫీషియో సభ్యులకు ఈ నెల 20వ తేదీలోగా సమాచారం అందజేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియకు సంబంధించి నెల్లూరు, ఏలూరు జిల్లాల కలెక్టర్లకు, ఆయా నగరపాలక సంస్థల కమిషనర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలను పంపిందినిర్ణీత షెడ్యూల్ ప్రకారం, ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒకవేళ అనివార్య కారణాల వల్ల లేదా ఏవైనా ఇతర ఇబ్బందుల వల్ల ఆ రోజు సమావేశం నిర్వహించలేని పరిస్థితి తలెత్తితే, మరుసటి రోజు అంటే 27వ తేదీన తప్పనిసరిగా సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొన్నారుఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి ఒక కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ల అమలును సుసాధ్యం చేసేలా, బీసీల జనాభాపై లోతైన అధ్యయనం చేయడానికి ఒక డెడికేటెడ్ కమిషన్‌ను ప్రభుత్వం నియమించనుంది. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు నేడు లేదా రేపు వెలువడే అవకాశం ఉంది. ఈ మేరకు ఏకసభ్య కమిషన్‌ను నియమించే ప్రతిపాదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఆమోదముద్ర వేశారు.రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాను ఈ డెడికేటెడ్ కమిషన్‌గా నియమించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రిజర్వేషన్ల ఖరారుకు అవసరమైన అధ్యయనాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం ఈ కమిషన్‌కు 30 నుంచి 45 రోజుల గడువును ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా బీసీల వెనుకబాటుతనాన్ని ఈ కమిషన్ క్షుణ్ణంగా పరిశీలించనుంది. ఈ అధ్యయనం కోసం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామ మరియు స్వర్ణ వార్డు సచివాలయాల సిబ్బంది నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే (యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే) డేటాను కమిషన్ ప్రామాణికంగా తీసుకోనుంది. ఈ సర్వే ద్వారా సేకరించిన గణాంకాలను విశ్లేషించి, రిజర్వేషన్ల అమలుపై కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది

# ఏపీలో మరో 9 ఎయిర్ పోర్టులు

**అమరావతి, ఫిబ్రవరి 18, పెన్ పవర్:**
ఏపీ ప్రజలకు శుభవార్త. రాష్ట్రంలో మరిన్ని జిల్లాలకు విమాన కనెక్టివిటీ భవిష్యత్తులో ఏర్పడనుంది. దీని వల్ల రాష్ట్రంలోని ఏ మూలకైనా సులువుగా చేసుకోవచ్చు. అలాగే సరుకు రావాణా కూడా వేగంగా జరుగుతుంది. ఈ మేరకు తొమ్మిది ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.ఏపీలోని కూటమి సర్కార్ ప్రజా రవాణా, సరకు రవాణాను రాష్ట్రంలో మెరుగుపర్చేందుకు ప్రయత్నిస్తోంది. ప్రయాణాన్ని వేగవంతం చేయడం, సరుకు రవాణాలో వేగం పెంచేందుకు ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలో కొత్త ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి శ్రీకారం చుడుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరు ఎయిర్‌పోర్ట్‌లు ఉండగా.. ఈ ఏడాదిలో మరో ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తుంది. దీంతో మొత్తం ఏడు ఎయిర్‌పోర్ట్‌లు ఉండనున్నాయి. అయితే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు విమాన కనెక్టివిటీని తెచ్చేందుకు మరో 9 ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్ర సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ మేరకు ప్లాన్లు రూపొందిస్తోంది. ఇందుకోసం రూ.6,417 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసింది.ఏపీలో మరో 9 కొత్త ఎయిర్‌పోర్ట్‌లకు ప్రణాళికలు రూపొందించారు. వీటి కోసం రూ.6,417 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వంతో భాగస్వామ్యమై వీటిని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, కర్నూలు, కడపలో విమానాశ్రయాలు అందుబాటులో ఉండగా.. మరికొద్ది నెలల్లో భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో వీటిని నిర్మించేందుకు ప్లాన్ రూపొందించింది. ఇవి అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోని ఎక్కడినుంచి ఎక్కడికైనా వెంటనే చేసుకోవచ్చు. దీని వల్ల సరుకు రవాణా పెరిగే స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

**ఎక్కడెక్కడంటే..?**
నెల్లూరు జిల్లా దగదర్తి దగ్గర ఎయిర్‌పోర్ట్ నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.916 కోట్లు అవసరమవుతుందని అంచనా వేశారు. ఇప్పటికే భూసేకరణ పనులు కూడా మొదలయ్యాయి. త్వరలోనే టెండర్లను పిలిచి పనులు ప్రారంభించనున్నారు.
-చిత్తూరు జల్లా కుప్పంలో ఎయిర్‌పోర్ట్ కోసం 444 ఎకరాల భూమిని సేకరించనున్నాయి. ఈ విమనాశ్రయం నిర్మాణానికి రూ.1,142 కోట్లు అవసరమవుతాయని-రాజధాని అమరావతి, శ్రీకాకుళంలో ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి ప్లాన్ వేశారు. అమరావతి ఎయిర్‌పోర్ట్‌కు రూ.వెయ్యి కోట్లు, శ్రీకాకుళంలో విమానాశ్రయ నిర్మాణానికి రూ.650 కోట్ల వ్యయం అవ్వనుంది.కాకినాడ జిల్లా తుని-అన్నవరం మధ్య, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెం, పల్నాడు జిల్లాలోని నాగార్జున సాగర్, ప్రకాశం జిల్లా ఒంగోలు, అనంతపురం జిల్లాల్లో ఎయిర్‌పోర్టుల నిర్మాణం కోసం డీపీఆర్ రెడీ చేస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## భారత వ్యతిరేక శక్తులతో రాహుల్‌కు సంబంధాలు



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తీవ్ర ఆరోపణలు చేశారు. 'భారత వ్యతిరేక శక్తులతో ఆయనకు సంబంధాలున్నాయి. దేశ భద్రతకు ఆయన అత్యంత ప్రమాదకరం. నక్సలైట్లు, తీవ్రవాదులను రాహుల్ కలుస్తున్నారు. విదేశీ పర్యటనకు వెళ్లినప్పుడు జార్జ్ సొరోస్ వంటి నేతలను కలుస్తున్నారు' అని జాతీయ మీడియతో చెప్పారు.రాహుల్ గాంధీ ప్రవర్తన కారణంగా చిన్న ప్రతిపక్ష పార్టీలు మరియు ఎంపీలు మాట్లాడే సమయాన్ని కోల్పోతున్నారు. వారు తమ నియోజకవర్గ సమస్యలను లేవనెత్తలేకపోతున్నారు" అని ఆయన అన్నారు.స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానంపై రిజిజు మాట్లాడుతూ, సభా కార్యకలాపాలు సజావుగా జరిగేలా చూడటం, ప్రభుత్వ వ్యవహారాలను అనుమతించడం మరియు ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఇవ్వడం స్పీకర్ పాత్ర అని అన్నారు.'సభా కార్యకలాపాలను నిర్వహించడం, ప్రభుత్వ వ్యవహారాలను అనుమతించడం మరియు ప్రతిపక్ష ఎంపీలకు మాట్లాడే అవకాశం ఇవ్వడం స్పీకర్ పని' అని ఆయన అన్నారు.

## ఎన్సీపీ పార్టీ జాతీయ అధ్యక్షురాలిగా సునేత్రా పవార్



ముంబై: దివంగత నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సతీమణి సునేత్రా పవార్ జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) జాతీయ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సోమవారం జరిగిన పార్టీ ఎమ్మెల్యేల సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. జనవరి 28న జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ ఆకస్మికంగా మరణించిన విషయం తెలిసిందే. ఆయన మరణంతో పార్టీలో ఏర్పడిన నాయకత్వ శూన్యతను భర్తీ చేసేందుకు సునేత్ర ముందుకు వచ్చారు. ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న సునేత్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం భావోద్వేగభరితంగా సాగింది. పార్టీని ఐక్యంగా ఉంచేందుకే ఈ బాధ్యత తీసుకుంటున్నట్లు ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. అజిత్ పవార్ ఆశయ సాధనకు కృషి చేస్తామని ఎమ్మెల్యేలు ఆమెకు భరోసా ఇచ్చారు.శరద్ పవార్ వర్గంతో పార్టీ విలీనంపై వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, ఆ విషయంపై తుది నిర్ణయం తీసుకునే పూర్తి అధికారాన్ని ఎమ్మెల్యేలు సునేత్రా పవార్‌కే కట్టబెట్టారు. అయితే, ప్రస్తుతానికి తాము బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలోనే కొనసాగుతామని పార్టీ సీనియర్ నేత సునీల్ తట్కరే స్పష్టం చేశారు.

## రాహుల్ గాంధీపై విరుచుకుపడ్డ నవజ్యోత్ కౌర్ సిద్ధూ



పంజాబ్: పంజాబ్ మాజీ ఎమ్మెల్యే నవజ్యోత్ కౌర్ సిద్ధూ, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్టీలో ఏం జరుగుతుందో తెలియని వ్యక్తి నాయకత్వ పదవిలో కూర్చోవడానికి అనర్హుడంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో ఏఐసీసీ పంజాబ్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ భూపేష్ బఘేల్, ఫిబ్రవరి 6న నవజ్యోత్ కౌర్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. పంజాబ్ సీఎం కావాలంటే 'రూ.500 కోట్ల సూట్‌కేస్' అవసరమంటూ ఆమె గత ఏడాది డిసెంబర్‌లో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మొదట సస్పెండ్ చేసి, ఆ తర్వాత ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు.మంగళవారం కోయంబత్తూరులో మీడియాతో మాట్లాడిన ఆమె.. రాహుల్ వాస్తవ పరిస్థితులకు దూరంగా ఒక 'స్వయం నిర్మిత స్వర్గం'లో బతుకుతున్నారని విమర్శించారు. "మీ కింద ఏం జరుగుతుందో మీకు తెలియకపోతే, క్షమించండి.. మీరు ఆ కుర్చీకి అర్హులు కారు" అని ఆమె వ్యాఖ్యానించారు. రాహుల్ చుట్టూ ఉన్న కోటరీ ఎన్నికల టికెట్లను ముందుగానే అమ్మేసుకుంటోందని, నిజాయతీపరుల మాట వినే సమయం ఆయనకు లేదని ఆరోపించారు.

## కుమారుడి మరణాన్ని తట్టుకోలేక ఆత్మహత్యకి పాల్పడిన తల్లిదండ్రులు

చంపా : ఛత్తీస్‌గఢ్‌లోని జంజ్‌గిర్-చంపా జిల్లాలో సోమవారం ఉదయం వెలుగుచూసిన హృదయ విదారక ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.దర్దేయి గ్రామానికి చెందిన కృష్ణ పటేల్ (48), రమాబాయి పటేల్ (47) దంపతులకు ఆదిత్య పటేల్ (21) అనే ఒక్కగానొక్క కుమారుడు ఉన్నాడు.2024లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఆదిత్య మరణించాడు. అప్పటి నుంచి ఆ దంపతులు తీవ్రమైన మానసిక వేదన అనుభవిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లోని వేప చెట్టుకు ఒకే చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సోమవారం ఉదయం గమనించిన ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు.సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నాలుగు పేజీల సూసైడ్ నోట్‌తో పాటు ఒక వీడియో సందేశాన్ని స్వాధీనం చేసుకున్నారు. "మా జీవితానికి మా కుమారుడే పునాది. వాడు లేని జీవితం మాకు శూన్యం. పూర్తి స్పృహతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నాం. దీనికి ఎవరూ బాధ్యులు కారు" అని లేఖలో పేర్కొన్నారు. తమ కుమారుడికి రావాల్సిన పరిహారం డబ్బులను కృష్ణ పటేల్ సోదరులకు ఇవ్వాలని వీడియోలో కోరారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

# రెండేండ్లలో ఏఐలో 200 బిలియన్ల పెట్టుబడులు




న్యూఢిల్లీ: వచ్చే రెండేండ్లలో భారత కృత్రిమ మేధ (ఏఐ) రంగంలోకి 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రానున్నాయని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరుగు తోన్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో మంగళవారం మంత్రి మాట్లాడుతూ.. ఏఐ రంగంలో భారత్ అద్భుతమైన వృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. వచ్చే రెండేండ్లలో ఐదు ఏఐ కీలక విభాగాల్లో సుమారు 200 బిలియన్ల పెట్టుబడులు రానున్నాయన్నారు. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.18 లక్షల కోట్ల విలువ. మౌలిక సదుపాయాల నుంచి ఇంధన వనరుల వరకు ఏఐ అభివృద్ధికి అవసరమైన అన్ని రంగాల్లో అంతర్జాతీయ సంస్థలు భారత్ పట్ల ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఇది దేశ సాంకేతిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ పెట్టుబడుల ఆకర్షణలో భారత్‌లోని పునరుత్పాదన ఇంధన వనరులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. దేశ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో 51 శాతం క్లీన్ ఎనర్జీ నుంచే వస్తుండటం, డేటా సెంటర్ల నిర్వహణకు భారత్‌ను అగ్రగామిగా నిలబెడుతోందని మంత్రి పేర్కొన్నారు. సాంకేతికత కేవలం కొద్దిమంది చేతుల్లోనే ఉండకుండా సామాన్యులకు కూడా అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. త్వరలోనే పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యతనిస్తూ 'ఏఐ మిషన్ 2.0'ను ప్రారంభించనున్నామని మంత్రి తెలిపారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా మానవ వనరులను సిద్ధం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలతో కలిసి ప్రస్తుత ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ అందించడంతో పాటుగా కొత్త టాలెంట్ ప్రోత్సహించనున్నట్టు మంత్రి తెలిపారు. కంప్యూటింగ్ సామర్థ్యాన్ని పెంచడానికి అదనంగా 20,000 జీపీయూలను జోడిస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బాధ్యతాయుతమైన ఏఐ వినియోగంపై ఏకాభిప్రాయం సాధించేందుకు భారత్ కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు.

# రాష్ట్రపతికి లేఖ రాస్తాం పియూష్ గోయల్‌ను తొలగించాలి



న్యూఢిల్లీ: మార్చి 9న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు తిరిగి ప్రారంభమయ్యే ముందు వ్యవసాయ రంగాన్ని అమెరికాకు అప్పగించే వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా రైతులను గ్రామాల్లో బహిరంగ సమావేశాలు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నేతలు పిలుపు ఇచ్చారు. మంగళవారం వర్చువల్ విలేకరుల సమావేశంలో ఎస్ కెఎం నేతలు విజూ కృష్ణన్, డాక్టర్ సునీలం, రాజేంద్ర క్షీర్‌సాగర్, సత్యవన్, పి. కృష్ణప్రసాద్ తదితరులు మాట్లాడారు. వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయొద్దని ప్రధానమంత్రిని ఆదేశించాలని కోరుతూ రాష్ట్రపతికి బహిరంగ లేఖ రాస్తామని, దేశ వ్యవసాయం, పాడి పరిశ్రమలను బహుళజాతి కంపెనీలకు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్న కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్‌ను తొలగించాలని కూడా లేఖలో డిమాండ్ చేస్తామని పేర్కొన్నారు. దేశం స్వావలంబన, సార్వభౌమత్వాన్ని అప్పగించడానికి వాణిజ్య శాఖ మంత్రి గోయల్ దేశద్రోహి పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. వరి రైతులకు బోనస్ ఇవ్వొద్దని రాష్ట్రాలకు పంపిన లేఖను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉపసంహరించుకోవాలని, లేఖపై సంతకం చేసిన వ్యయసాయ కార్యదర్శి వి. వుయల్నామ్ ను పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. తిరోగమన జీఎస్టీ చట్టాన్ని సవరించడంతో రాష్ట్రాల పన్ను అధికారాన్ని పునరుద్ధరించాలని పార్లమెంటును డిమాండ్ చేయాలని, ప్రస్తుత 33 శాతానికి బదులుగా రాష్ట్రాలకు సెస్, సర్‌ఛార్జ్‌తో సహా పూల్‌లో 60 శాతం పన్నుల వాటాను ఇవ్వాలని, రైతులు పండించిన అన్ని పంటలకు సి2ప్లస్ 50 శాతంతో కూడిన ఎంఎస్పీ ఇవ్వాలని, వ్యవసాయాన్ని ఆధునీకరించడానికి వనరులను అభివృద్ధి చేయాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈనెల 27న అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకులతో ఎస్ కెఎం ప్రతినిధులు సమావేశమవుతారని తెలిపారు.

# రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల.. తెలంగాణలో రెండుస్థానాలకు ఎన్నికలు

న్యూఢిల్లీ: తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం.. దేశవ్యాప్తంగా 37 మంది రాజ్యసభ ఎంపీల పదవీకాలం పూర్తికానుండగా.. ఆయా స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు ఫిబ్రవరి 26న నోటిఫికేషన్ రానుంది. మార్చి 5వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ, 6న స్క్రూటినీ, మార్చి 9వ తేదీ వరకూ నామినేషన్ల విత్ డ్రా జరగనున్నాయి. మార్చి 16న ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకూ పోలింగ్ జరగనుండగా, అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మార్చి 20వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా రాజ్యసభ్య ఎన్నికలు ముగియనున్నాయి. ఏప్రిల్ 9వ తేదీతో తెలంగాణ ఎంపీలైన కేఆర్ సురేష్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీ పదవీకాలం పూర్తి కానున్నాయి. ఆ రెండు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. కేఆర్ సురేష్ రెడ్డి బీఆర్ఎస్ నుంచి, అభిషేక్ మను సింఘ్వీ కాంగ్రెస్ పార్టీ నుంచి రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మొత్తం 37 స్థానాలకు రాజ్యసభ ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటిలో ఏడు మహారాష్ట్ర, ఒడిశాలో మూడు, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లో ఆరేసి స్థానాలు, అస్సాంలో మూడు, బిహార్ లో నాలుగు, ఛత్తీస్ గఢ్ లో రెండు, హర్యానా, హిమాచల్ ప్రదేశ్ లలో ఒక్కొక్క స్థానానికి, తెలంగాణలో రెండుస్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

## రెండు రాష్ట్రాల్లో కార్చిచ్చుల బీభత్సం.. రంగంలోకి భారత వైమానిక దళం!

న్యూఢిల్లీ: భారతదేశంలో అత్యంత సుందరికరమైన ప్రాంతాల్లో ఈశాన్య రాష్ట్రాలు ముందు వరుసలో ఉంటాయి. అటువంటి రాష్ట్రాల్లో ప్రస్తుతం కార్చిచ్చు బీభత్సం సృష్టిస్తుంది. అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్‌లలోని అటవీ ప్రాంతాల్లో మంటలు చెలరేగి వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో ఆ మంటలను ఆర్పేందుకు భారత వైమానిక దళ హెలికాప్టర్లు అవిశ్రాంతంగా పోరాడుతున్నాయి. అరుణాచల్ ప్రదేశ్‌లోని వాలాంగ్ ప్రాంతంలో చెలరేగిన మంటలను అదుపు చేయడానికి ఐఏఎఫ్ హెలికాప్టర్లు సుమారు 1,39,800 లీటర్ల నీటిని ఆకాశం నుండి కురిపించాయి. ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో అక్కడ మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. మరోవైపు, నాగాలాండ్‌లోని జుకో వ్యాలీలో కార్చిచ్చు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇక్కడ జప్ఫు శిఖరం సమీపంలోని ఏటవాలు కొండలు, తక్కువ దృశ్యమానత, గాలిలో తక్కువ ఆక్సిజన్ వంటి క్లిష్ట పరిస్థితుల మధ్య ఓతి-17 ఎ5 హెలికాప్టర్లు పోరాడుతున్నాయి. దిమాపూర్‌లోని పదుంపోఖిరి సరస్సు నుండి నీటిని సేకరించి మంటలపై కురిపిస్తూ, కార్చిచ్చు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా వైమానిక దళం శ్రమిస్తోంది. గత 10 గంటలుగా ఈ ఆపరేషన్ కొనసాగుతుండగా.. భారత వైమానిక దళ హెలికాప్టర్లు శాయశక్తుల ప్రయత్నం చేస్తున్నాయి. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

## పట్టపగలే దారుణం.. దంపతుల దారుణహత్య

చెన్నై: చెన్నై ఈసీఆర్ ప్రాంతంలో పట్టపగలే దంపతులను దారుణంగా హత్య చేసిన ఘటన కలకలం సృష్టించింది. పోలీసుల కథనం మేరకు? చెన్నై ఈస్ట్ కోస్ట్ రోడ్డులోని కానత్తూర్‌రెడ్డి కుప్పం భారతిదాసన్ వీధికి చెందిన పార్థసారథి(42), జమున దంపతులు. వీరి మధ్య అభిప్రాయభేదాలు తలెత్తడంతో రెండేళ్ల క్రితం జమున పిల్లలను తీసుకుని సైదాపేటలోని సోదరి ఇంటికి వెళ్లింది. దీంతో పార్థసారథి ఒంటరిగా ఉంటున్నాడు. అతని ఎదురింట్లో ఉంటున్న సుశీల్‌కి పార్థసారథి భార్య జమునకు వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. సుశీల్ కారణంగానే తన భార్య వదిలి వెళ్లిపోయిందని పార్థసారథి అతనిపై పగ పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం సుశీల్ భార్య గిరిజతో వాహనం పార్కింగ్ విషయంలో పార్థసారథి గొడవపడ్డాడు. ఆక్రోశంతో ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొచ్చి సుశీల్(35), గిరిజ(29)పై విచక్షణ రహితంగా దాడిచేశాడు. దీంతో వారు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరికి ఏడు, నాలుగేళ్ల వయసున్న కుమారులున్నారు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కోడింగ్ కంటే ఏఐతో పనిచేయించడం ముఖ్యం




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ గ్రామర్‌ను తిరిగి రాస్తోంది, ఇకపై టెక్ నిపుణులకు కోడ్స్ రాయడం అంత ముఖ్యమైన పని కాదని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని అన్నారు. మంగళవారం బెంగళూరులో జరిగిన ఇన్ఫోసిస్ ఇన్వెస్టర్ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ఇంటర్నెట్ నుంచి స్మార్ట్‌ఫోన్‌లకు గతంలో జరిగిన ఏ సాంకేతిక మార్పు కూడా ఇంత వేగంగా జరగలేదు. వాటి కంటే వేగంగా ఏఐని అలవాటు చేసుకుంటున్నారని, వ్యాపారాల నిర్వహణను పూర్తిస్థాయి మార్చేందుకు ఏఐ సిద్ధంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో కోడ్స్ రాయడం అంత ముఖ్యం కాకపోవచ్చు, ఏఐతో పని చేయించడం, టూల్స్‌ను వాడి వ్యాపారాభివృద్ధిని సాధించడమే అత్యంత ప్రధానం.రానున్న రోజుల్లో “కంపెనీలు కస్టమర్లకు అందించే సేవలు, పని చేసే విధానం, సంస్థ ఉద్దేశాల్లో మార్పులు రావాలి. ఇకమీదట ఏ మాత్రం పాత పద్ధతిలోనే సంస్థలు పనులు చేయలేవని నందన్ నీలేకని అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో కోడింగ్‌కు ప్రాధాన్యత తగ్గే ఛాన్స్ ఉన్నా సరే, కొత్త ఉద్యోగాలు కూడా అంతే వేగంగా పుట్టుకొస్తాయని ఆయన స్పష్టం చేశారు.

## తొలి ఈవీ కారును విడుదల చేసిన మారుతీ సుజుకి



దేశీయ అతిపెద్ద ప్యాసింజర్ కార్ల దిగ్గజం మారుతీ సుజుకి ఎట్టకేలకు ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) విభాగంలోకి అడుగుపెట్టింది. మంగళవారం కంపెనీ ఎంతో ఆసక్తిగా ఎదురూచుస్తున్న తన మొట్టమొదటి ఈవీ ఎస్‌యూవీ ఈ-విటారా లాంచ్ చేస్తూ, ధరల వివరాలను కూడా ప్రకటించింది.రూ. 10.99 లక్షల ప్రారంభ ధరతో తీసుకొచ్చిన ఈ కారు బ్యాటరీ-యాజ్-ఏ-సర్వీస్(బాస్) మోడల్ ఆధారంగా లభిస్తుంది. అంటే బ్యాటరీ కోసం ఈఎంఐ రూపంలో కిలోమీటర్‌కు రూ. 3.99 చొప్పున విడిగా చెల్లించాల్సి ఉంటుంది. 8 ఏళ్ల బ్యాటరీ వారెంట్‌తో అందుబాటులో ఉన్న ఈ కారు 49 కిలోవాట్ అవర్, 61 కిలోవాట్ అవర్ బ్యాటరీ ఆప్షన్లతో లభిస్తుంది. ఒక్కసారి పూర్తి ఛార్జ్ చేసిన తర్వాత 440 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. 61 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 543 కిలోమీటర్లు వెళ్లొచ్చని కంపెనీ తెలిపింది. ఈ కారును కొనాలనుకునే కస్టమర్లు కంపెనీ అధికారిక వెబ్‌సైట్ లేదా డీలర్‌షిప్ సెంటర్ల వద్ద రూ.21 వేలు చెల్లించి బుకింగ్ చేయవచ్చు. డెలివరీలు త్వరలో ప్రారంభం అవుతాయని కంపెనీ స్పష్టం చేసింది. అలాగే, త్వరలో పూర్తి వేరియంట్ వారీగా ధరల వివరాలను వెల్లడించనున్నట్టు తెలిపింది. గతేడాది ఆగస్టులోనే కంపెనీ ఈ-విటారా ఉత్పత్తిని ప్రారంభించింది. ఏడాది ఆఖరు నాటికి సుమారు 13 వేల యూనిట్లను 28 దేశాలకు ఎగుమతి కూడా చేసింది.

## ఓలా ఎలక్ట్రిక్ షేర్లు 83 శాతం పతనం భారీగా ఇన్వెస్టర్ల సంపద ఆవిరి



ఎంతో ఆర్భాటంగా స్టాక్ మార్కెట్లోకి ప్రవేశించిన ఓలా ఎలక్ట్రిక్ కంపెనీ షేర్లు కుప్పకూలిపోతున్నాయి. ఆల్‌టైం గరిష్టాల నుంచి భారీ నష్టాలను చవి చూడటంతో ఇన్వెస్టర్లు లబోదిబోమంటున్నారు. వరుసగా నాలుగో రోజు మంగళవారం కూడా ఓలా షేర్లు పతనమయ్యాయి. ఇంట్రాడేలో 5 శాతం క్షీణించి 27.36 కనిష్ట స్థాయిని తాకగా.. తుదకు 2.91 శాతం నష్టంతో రూ.27.99 వద్ద ముగిసింది. ఓలా రేటింగ్‌ను అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ సిటీ ‘బై’ నుంచి ‘సెల్’కి తగ్గిస్తూ.. టార్గెట్ ధరకు 51 శాతం కోత పెట్టి రూ.27గా నిర్ణయించడమే ఇందుకు ప్రధాన కారణం. 2024లో చేరిన గరిష్ట స్థాయి రూ.157తో పోలిస్తే ఈ స్టాక్ ఏకంగా 83శాతం మేర పడిపోయి ఇన్వెస్టర్ల సంపదను ఆవిరి చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో ఆదాయం 55 శాతం తగ్గి రూ.470 కోట్లకు పడిపోయింది. నికర నష్టం రూ.487 కోట్లకు పెరగడం ఇన్వెస్టర్లలో మరింత ఆందోళన పెంచింది. ఒకప్పుడు అగ్రస్థానంలో ఉన్న ఓలా ప్రస్తుతం 6 శాతం మార్కెట్ వాటాతో ఐదో స్థానానికి పడిపోయింది. టీవీఎస్, బజాజ్, ఆథర్ వంటి సంస్థల నుంచి గట్టి పోటీని ఎదుర్కొంటుంది. వినియోగదారుల నుంచి సర్వీస్, నాణ్యత పరంగా వస్తున్న ఫిర్యాదులు బ్రాండ్ విలువను దెబ్బతీశాయి. మరోవైపు కంపెనీ వద్ద నగదు నిల్వలు తగ్గడం, అప్పులు పెరగడం ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేస్తోంది.

## ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

ప్రపంచ దేశాలకు జనరిక్ ఔషధాల సరఫరాలో అగ్రగామిగా ఉన్న భారత్, 2030 నాటికి బయోలాజిక్స్, బయోసిమిలర్స్ విభాగాల్లో భారీ మార్పులు చూడబోతోందని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ సహ-ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జీవీ ప్రసాద్ అన్నారు. బయో-ఆసియా 2026 సదస్సులో భాగంగా ‘ఫ్యూచర్ ఆఫ్ ఫార్మా, బయోటెక్’ అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. ఉత్పత్తులు- సేవల రంగం అనూహ్యంగా వృద్ధి చెందే అవకాశాలున్నాయని వివరించారు. ప్రపంచ స్థాయి కంపెనీలు ఇప్పుడు భారత్‌ను తమ ప్రధాన తయారీ కేంద్రంగానే కాకుండా, పరిశోధన-అభివృద్ధి (ఆర్అండ్‌డీ) కోసమూ చూస్తున్నాయని తెలిపారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ల ద్వారా భారత కంపెనీలు ప్రపంచ వ్యాప్తంగా కీలకపాత్ర పోషిస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ దశలో వివిధ కంపెనీల మధ్య అర్థవంతమైన భాగస్వామ్యాలు అవసరమని సూచించారు. మనం జనరిక్ రంగంలో బలంగా ఉంటూనే, వ్యూహాత్మక పెట్టుబడుల ద్వారా ఆవిష్కరణలపైనా దృష్టి పెట్టాలని సూచించారు. చైనా తరహాలో వేగంగా ఉత్పత్తిని పెంచాలన్నారు.

# ప్రపంచ వ్యాప్తంగా యూట్యూబ్ డౌన్..




ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ అయిన యూట్యూబ్ సేవలు నిలిచిపోయాయి. ఛీ (ట్విట్టర్)లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఫిబ్రవరి 17 సాయంత్రం యూట్యూబ్ చరిత్రలోనే ఇది అతిపెద్ద ఔటేజ్ అని చెబుతున్నారు. దీనిపై యూజర్స్ పలు సోషల్ మీడియా వేదికల్లో పోస్టులు పెడుతున్నారు. డౌన్ డిటెక్టర్ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 3 లక్షలకు పైగా యూజర్లు తమ సమస్యను రిపోర్ట్ చేశారు. ఒక్క అమెరికాలోనే 2.4 నుండి 3.2 లక్షల వరకు ఫిర్యాదులు వచ్చాయి. యూట్యూబ్ ఓపెన్ అవకుండా “హనీఎవబిష్ప్రతినిణ లివనిబి లితీనీనిణ” అనే ఎర్రర్ మెసేజ్ చూపించిందని పేర్కొన్నారు. యాప్ మరియు వెబ్‌సైట్ లోడ్ కాకపోవడం, వీడియోలు ప్లే అవకపోవడం వంటి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇండియా, జపాన్, కెనడా, బ్రెజిల్ వంటి అనేక దేశాల్లో ఈ ఇష్యూస్ కనిపించాయి. దీనిపై స్పందించిన యూట్యూబ్.. సమస్య ఏమిటో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం అని మాత్రమే తెలిపింది. కాగా రాయిటర్స్, టెక్ రీడర్స్ వంటి అంతర్జాతీయ మీడియా దీనిని సాధారణ టెక్నికల్ గ్లిచ్ గా అభివర్ణించాయి. ఇందులో ఎలాంటి హ్యాకర్స్ కుట్ర లేదని తెలిపాయి. అదే విధంగా ఫిబ్రవరి 16న ఎక్స్ కూడా కొన్ని గంటల పాటు ఔటేజ్ కి గురైంది. నమోదైంది. 2 గంటల పాటు ఫీడ్ రిఫ్రెష్ కాకపోవడం, లాగిన్ సమస్యలు, యాప్ లోడ్ అవకపోవడం వంటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. పీక్ అవర్ లో 40,000కు పైగా రిపోర్టులు నమోదయ్యాయి. కాగా దీనిపై ‘ఛీ’ కూడా అధికారికంగా స్పష్టమైన కారణం చెప్పలేదు. అయితే ఈ రెండు సందర్భాల్లోనూ హ్యాకింగ్ గాని డేటా బ్రీచ్ జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవు. పెద్ద ప్లాట్‌ఫామ్స్‌కి ట్రాఫిక్ పెరగడం, సర్వర్ మెయింటెనెన్స్, క్లౌడ్ సర్వీస్ సమస్యలు, నెట్‌వర్క్ లోపాలు వంటి కారణాల వల్ల అప్పుడప్పుడూ ఇలాంటి ఔటేజెస్ రావడం సాధారణమని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ హ్యాకింగ్ జరిగితే డేటా లీక్, అకౌంట్ సస్పెన్షన్, సెక్యూరిటీ అలర్ట్స్ కనిపిస్తాయి. యూట్యూబ్, ఎక్స్ ఔటేజ్ లో అలాంటివేవీ కనబడక పోవడంతో ఇవి సాధారణ సాంకేతిక లోపాలే అని చెప్పవచ్చు.

# ఏసీ ధరలు పెరుగుతున్నాయ్




ఎండాకాలం మొదలైంది. పెరిగే ఉష్ణోగ్రతల కారణంగా ఏసీలకు పెద్ద ఎత్తున గిరాకీ ఉండనుంది. అయితే, కొత్త ఏసీ కొనాలనుకునే వారికి కంపెనీలు షాక్ ఇవ్వనున్నాయి.ప్రస్తుత త్రైమాసికంలో ఎయిర్ కండిషనర్(ఏసీ) ధరలు పెరుగుతాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ప్రముఖ ఏసీ తయారీ కంపెనీ బ్లూస్టార్ ఇప్పటికే 10-15 శాతం మేర ధరలు పెంచేందుకు సిద్ధమవుతున్నామని స్పష్టం చేసింది. ప్రస్తుత పరిస్థితుల మధ్య ధరల పెంపును నివారించలేమని బ్లూస్టార్ మేనేజింగ్ డైరెక్టర్ బి త్యాగరాజన్ అన్నారు. రాగి లాంటి కీలక ముడి సరుకుల ధరలు భారీగా పెరిగాయని, దీనికి తోడు భారత కరెన్సీ రూపాయి మారకం రేటు వల్ల ఏసీ ఖర్చులను పెంచుతున్నాయి. దీనికి అదనంగా ఇంధన-సామర్థ్య లేబులింగ్ లాంటి కొత్త నిబంధనలు కూడా ఖర్చుల భారం పెంచుతోందని త్యాగరాజన్ తెలిపారు. అయితే, పరిశ్రమ కేవలం 8-10 శాతం తక్కువ లాభాల మార్జిన్‌తో కొనసాగుతోందని, కాబట్టి ముడిసరుకు వ్యయాన్ని భరించే స్థితిలో కంపెనీలు లేవు. ఫలితంగా అదనపు ఖర్చుల భారాన్ని కొంతమేర వినియోగదారులకూ బదిలీ చేయక తప్పదని స్పష్టం చేశారు. కొత్త ఎనర్జీ లేబుల్ నిబంధనల వల్లే ఏసీ స్టార్ రేటింగ్‌ని బట్టి ధరలు 5-10 శాతం పెరుగుతాయని త్యాగరాజన్ అభిప్రాయపడ్డారు. కంపెనీలు సాధారణంగా మెరుగైన డిజైన్, సామర్థ్యం ద్వారా ఖర్చులను తగ్గించడానికి ప్రయత్నించినప్పటికీ, ఈసారి పెరుగుతున్న ముడి సరుకుల ధరలు, కరెన్సీ ఒత్తిడి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడాన్ని కష్టతరం చేశాయని పేర్కొన్నారు.

## తైవాన్‌కు ఆయుధ సరఫరాపై త్వరలోనే నిర్ణయం



తైవాన్‌కు ఆయుధాలను పంపాలా వద్దా అనే విషయంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. తైవాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హెచ్చరించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్య చేశారు. ‘ఈ విషయంపై జిన్‌పింగ్‌తో మాట్లాడుతున్నాను. మా మధ్య మంచి సంభాషణ జరిగింది. త్వరలోనే నిర్ణయం తీసుకుంటా’ అని ఆయన తెలిపారు. చైనా నేతతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని ట్రంప్ అన్నారు. ఈ నెల 4వ తేదీన ట్రంప్‌తో జిన్‌పింగ్ టెలిఫోన్ సంభాషణ జరిపారు. అమెరికాతో సంబంధాల విషయంలో పరస్పర గౌరవాన్ని కలిగి ఉండాలని ఈ సందర్భంగా జిన్‌పింగ్ ఆకాంక్షించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నడుస్తున్న తైవాన్ దీవికి ఆయుధాలు విక్రయించవద్దని హెచ్చరించారు. ద్వైపాక్షిక సంబంధాలలో తైవాన్‌కు అధిక ప్రాధాన్యత ఉన్నదని, తైవాన్‌కు ఆయుధాలు విక్రయించేటప్పుడు అమెరికా జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. కాగా జిన్‌పింగ్, ట్రంప్ ఏప్రిల్‌లో సమావేశమయ్యే అవకాశం ఉంది. తైవాన్‌ను అమెరికా అధికారికంగా గుర్తించకపోయినప్పటికీ దానికి సైనిక పరంగా మద్దతు ఇస్తోంది. తైవాన్‌కు 11 బిలియన్ డాలర్ల విలువ కలిగిన ఆయుధాలను విక్రయించేందుకు అమెరికా గత డిసెంబరులో ఆమోదం తెలిపింది.

## ఎప్‌స్టీన్ ఫైల్స్‌ను కప్పిపుచ్చుతున్నారు



జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఫైల్స్‌ను డోనాల్డ్ ట్రంప్ కప్పిపెడుతున్నారని అమెరికా మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ విమర్శించారు. ‘ముందు వాటిని బయటపెట్టండి. అవి నత్తనడక నడుస్తున్నాయి’ అని బెర్లిన్‌లో ఆమె బీబీసీకి చెప్పారు. ప్రపంచ ఫోరం వార్షిక సమావేశానికి హాజరయ్యేందుకు హిల్లరీ బెర్లిన్ వచ్చారు. ఎప్‌స్టీన్‌కు చెందిన వేలాది ఫైల్స్‌ను అమెరికా న్యాయ శాఖ ఈ నెల ప్రారంభంలో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉన్న ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ కమిటీ ముందు హాజరు కావాల్సిందేనని హిల్లరీ స్పష్టం చేశారు. కమిటీ ముందు సాక్ష్యమివ్వాల్సిందిగా కాంగ్రెస్ కమిటీ క్లింటన్ దంపతులపై ఒత్తిడి తెచ్చింది. కమిటీ ఎదుట హాజరయ్యేందుకు వారు అంగీకరించారు. బిల్ క్లింటన్ ఈ నెల 27న, హిల్లరీ ఈ నెల 26న కమిటీ ముందు హాజరవుతారు. 1983లో అమెరికా మాజీ అధ్యక్షుడు గెరాల్డ్ ఫోర్డ్ కాంగ్రెస్ కమిటీ ముందు హాజరయ్యారు. ఆ తర్వాత దేశ మాజీ అధ్యక్షుడు కమిటీ ముందుకు రావడం ఇదే మొదటి సారి. కమిటీ ఎదుట హాజరయ్యేందుకు తమకు అభ్యంతరం ఏమీ లేదని, అయితే అది బహిరంగంగా జరగాలని హిల్లరీ చెప్పారు. కమిటీ దర్యాప్తు నిష్పాక్షికంగా జరపాలన్నదే తమ కోరిక అని, అందరినీ ఒకేలా చూడాలని ఆశిస్తున్నానని అన్నారు. ‘మా వద్ద దాచేందుకు ఏమీ లేదు. ఫైల్స్‌ను పూర్తిగా విడుదల చేయాలని మేము పదే పదే అడుగుతున్నాం’ అని తెలిపారు. ట్రంప్ నుంచి దృష్టి మళ్లించేందుకు తనను, తన భర్తను ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. కాగా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో క్లింటన్ ప్రస్తావన వచ్చిన విషయం తెలిసిందే. ఎప్‌స్టీన్‌తో గతంలో తనకు సంబంధం ఉన్నప్పటికీ రెండు దశాబ్దాల క్రితమే దానికి స్వస్తి చెప్పానని క్లింటన్ అంటున్నారు.

## మధ్యప్రాచ్యంలో టెన్షన్.. కదిలిన అమెరికా యుద్ధ నౌకలు, విమానాలు

ఇరాన్‌తో అణు ఒప్పందంపై చర్చలు జరుపుతూనే, అమెరికా తన సైనిక శక్తిని ప్రదర్శిస్తోంది. ఒకవైపు దౌత్యపరమైన చర్చలు కొనసాగిస్తుండగానే, మరోవైపు భారీగా యుద్ధ విమానాలను, నౌకలను మధ్యప్రాచ్యానికి తరలిస్తోంది. గత 24 గంటల్లో 50కి పైగా అధునాతన ఫైటర్ జెట్లను ఈ ప్రాంతంలో మోహరించడం అంతర్జాతీయంగా ఆసక్తి రేపుతోంది.యాక్సియోస్ కథనం ప్రకారం.. అమెరికా వాయుసేనకు చెందిన ఎఫ్-22 రాప్టర్స్, ఎఫ్-35 లైట్నింగ్ ఎఎ, ఎఫ్-16 ఫైటింగ్ ఫాల్కన్స్ వంటి శక్తిమంతమైన యుద్ధ విమానాలు ఈ మోహరింపులో ఉన్నాయి. అమెరికా, యూరప్‌లోని స్థావరాల నుంచి ఈ విమానాలను జోర్డాన్, ఖతార్‌లోని సైనిక స్థావరాలకు తరలించారు. ఇదే సమయంలో, యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్. ఫోర్డ్ విమానవాహక నౌక తన బృందంతో కలిసి కరేబియన్‌ను వీడి మధ్యప్రాచ్యం వైపు పయనిస్తోంది. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో అమెరికా, ఇరాన్ మధ్య అణు ఒప్పందంపై రెండో విడత పరోక్ష చర్చలు జరిగిన నేపథ్యంలో ఈ సైనిక మోహరింపు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒమన్ మధ్యవర్తిత్వంతో జరిగిన ఈ చర్చలు ఫలప్రదంగా సాగాయని, నిర్మాణాత్మక వాతావరణంలో జరిగాయని ఇరు దేశాల అధికారులు తెలిపారు. అయినప్పటికీ, చర్చలతో పాటు సైనిక ఒత్తిడిని కొనసాగించడం ద్వారా ఇరాన్‌పై మరింత ఒత్తిడి పెంచడమే అమెరికా వ్యూహంగా కనిపిస్తోంది. ప్రస్తుతం యూఎస్ఎస్ అబ్రహం లింకన్ యుద్ధ నౌక ఈ ప్రాంతంలో ఉండగా, ఇప్పుడు గెరాల్డ్ ఆర్. ఫోర్డ్ రాకతో అమెరికా సైనిక బలం మరింత పెరగనుంది. రాబోయే రెండు వారాల్లో ఇరాన్ నుంచి ప్రతిపాదనలు అందాక, తదుపరి చర్చలు జరిగే అవకాశం ఉంది.

## అమెరికా-ఇరాన్ అణు చర్చలు ప్రారంభం

అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్ రాజధాని జెనీవాలో రెండో విడత అణు చర్చలు మంగళవారం ప్రారంభమయ్యాయి. నగరంలోని ఒమానీ మ్యూజియంలో ఈ చర్చలు జరుగుతున్నాయి. ఇరాన్ అణు కార్యక్రమంపై నెలకొన్న వివాదాన్ని పరిష్కరించే దిశగా చర్చలు సాగుతున్నాయి. ఇరాన్ ఒప్పందాన్ని కోరుకుంటోందని ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విలేకరులకు చెప్పారు. తమ అణు కార్యక్రమంపై అమెరికా వైఖరి వాస్తవాలకు దగ్గరగా ఉన్నదని ఇరాన్ విదేశాంగ శాఖ వ్యాఖ్యానించింది. ఒమన్ మధ్యవర్తిత్వంతో జరుగుతున్న ఈ చర్చలు తమ అణు కార్యక్రమం పైన, అమెరికా విధించిన ఆంక్షల ఎత్తివేత పైన దృష్టి సారిస్తాయని తెలిపింది. ఇరాన్ క్షిపణి అభివృద్ధి కార్యక్రమంపై కూడా చర్చించాల్సి ఉన్నదని అమెరికా గతంలో తెలిపింది. ఇరాన్‌తో జరుగుతున్న చర్చలు చాలా ముఖ్యమైనవని ట్రంప్ తెలిపారు. వీటిలో తాను పరోక్షంగా భాగస్వామిని అవుతానని చెప్పారు. అణు కార్యక్రమంపై కఠిన వైఖరితో ఉంటే ఏం జరుగుతుందో ఇరాన్‌కు బాగా తెలుసునని వ్యాఖ్యానించారు.

# వేపాకు.. రోగాలకు దివ్యౌషధం




ఆయుర్వేద సంప్రదాయం నుండి ఆధునిక సైన్స్ వరకు.. భారతీయ సంస్కృతిలో వేప చెట్టుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. మన ఋషులు వేపలో దాగి ఉన్న అద్భుత ఔషధ గుణాలను ప్రాచీన కాలంలోనే గుర్తించారు. పంటలకు పురుగు మందుగా, బియ్యంలో పురుగు పట్టకుండా, క్రిమికీటకాలను నివారించడానికి వేపను ఉపయోగించేవారు. ఆధునిక శాస్త్ర పరిశోధనలు కూడా ఈ ప్రయోజనాలను నిర్ధారించాయి. ఆయుర్వేద సంప్రదాయం నుండి ఆధునిక సైన్స్ వరకు.. భారతీయ సంస్కృతిలో వేప చెట్టుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. మన ఋషులు వేపలో దాగి ఉన్న అద్భుత ఔషధ గుణాలను ప్రాచీన కాలంలోనే గుర్తించారు. పంటలకు పురుగు మందుగా, బియ్యంలో పురుగు పట్టకుండా, క్రిమికీటకాలను నివారించడానికి వేపను ఉపయోగించేవారు. ఆధునిక శాస్త్ర పరిశోధనలు కూడా ఈ ప్రయోజనాలను నిర్ధారించాయి. అంతేకాకుండా పురాతన కాలం నుంచి వేప చెట్టుకు పూజలు కూడా చేస్తారు. వేప చెట్టుకు పసుపు రాసి, బొట్లు పెట్టి ప్రదక్షిణలు కూడా చేస్తారు. వేపాకులు అద్భుతమైన ఔషధ గుణాలు.. పోషకాల గని. ఇందులో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఖనిజాలు (కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, భాస్వరం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మ వ్యాధులు, మధుమేహం, జీర్ణ సమస్యలను తగ్గించడంలో అద్భుతంగా సహాయపడతాయి. వేపలో దాగి ఉన్న అద్భుతమైన ప్రయోజనాలను శాస్త్రవేత్తలు నాలుగు ముఖ్యమైన పరిశోధనల ద్వారా నిరూపించారు. 2015వ సంవత్సరంలో భారతదేశంలోని వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు వేపలో నింబల్ ఫ్లేవోన్ అనే రసాయనాన్ని గుర్తించారు. ఈ రసాయనం యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరస్ గుణాలను కలిగి ఉంటుందని, క్రిములను సమర్థవంతంగా చంపుతుందని వారు స్పష్టంగా నిరూపించారు. జర్మనీలోని యూనివర్సిటీ ఆఫ్ హెన్రిచ్ కు చెందిన శాస్త్రవేత్తలు 2011వ సంవత్సరంలో వేపలో అజాదిరచిటిన్ అనే రసాయనం ఉందని కనుగొన్నారు. వేప నూనెలో ఉండే ఈ రసాయనం తలకు అప్లై చేసిన 10 నుండి 15 నిమిషాల్లో తలలోని పేలను పూర్తిగా నిర్మూలిస్తుందని వారి పరిశోధనలు నిరూపించాయి. 2014వ సంవత్సరంలో ఇండోనేషియాలోని యూనివర్సిటీ ఆఫ్ గడ్జా మడ శాస్త్రవేత్తలు వేపలో నింబిడిన్ అనే రసాయనాన్ని కనుగొన్నారు. ఈ నింబిడిన్ ప్యాంక్రియాస్ గ్రంథిలోని బీటా కణాలను ఉత్తేజపరిచి, ఇన్సులిన్ రెసిస్టెన్స్ ను తగ్గిస్తుందని, తద్వారా షుగర్ స్థాయిలను నియంత్రించడానికి సహాయపడుతుందని వెల్లడించారు. ఈ రసాయనం ఇన్సులిన్ ఉత్పత్తికి కూడా దోహదపడుతుంది. అమెరికాలోని రోస్వెల్ పార్క్ క్యాన్సర్ ఇన్స్టిట్యూషన్ శాస్త్రవేత్తలు 2014లో వేపలో నింబిడాల్ అనే రసాయనాన్ని గుర్తించారు. ఈ రసాయనం క్యాన్సర్ కణాలు వాటంతట అవే చనిపోయేలా (అపోప్టోసిస్) ప్రేరణ కలిగిస్తుందని, క్యాన్సర్ వృద్ధిని అదుపు చేయడానికి, తగ్గించడానికి బాగా ఉపయోగపడుతుందని వారు నిరూపించారు. ఈ నాలుగు రకాల పరిశోధనలు వేపలో ఉన్న ఔషధ గుణాలను, శక్తివంతమైన మెడిసిన్స్ లాగా ఇవి జబ్బులను తగ్గించడానికి పనికొస్తున్నాయని రుజువు చేశాయి.

# నిద్రపట్టక ఇబ్బందిపడుతున్నారా?



ఒత్తిడి, సోషల్ మీడియా వాడకం, ఆలోచనలు, ఇతర వ్యాపకాలు ఇలా కారణాలు ఏవైనా సరే సరైన నిద్ర ఉండట్లేదు చాలా మందికి. చక్కగా నిద్రపోవాలని ట్రై చేసినా ఏవో కొన్ని కారణాల వల్ల మంచి నిద్ర అనేది కరువైపోయింది. దీంతో ఎక్కువ మంది హ్యాపీగా నిద్రపోవడానికి మెడిసిన్స్ వేసుకోవడానికి కూడా వెనుకాడరు. అలాంటి వారు మంచిగా నిద్రపోవాలంటే జీడిపప్పులు హెల్ప్ చేస్తాయని చెబుతున్నారు డాక్టర్ అఖిల. జీడిపప్పులు తీసుకోవడం వల్ల మెడిసిన్ తీసుకున్నట్లుగానే హాయిగా నిద్రపడుతుందని సూచిస్తున్నారు. నిద్రపట్టకపోవడం వల్ల కొన్ని సమస్యలొస్తాయి. మానసిక సమస్యలు వస్తాయి. ఏకాగ్రత తగ్గుతుంది. జ్ఞాపకశక్తి తగ్గుతుంది. మూడ్ స్వింగ్స్, ఆందోళనగా ఉంటుంది. దీంతోపాటు ఇమ్యూనిటీ తగ్గుతుంది. బరువు పెరుగుతారు. తలనొప్పి, డార్క్ సర్కిల్స్ పెరుగుతాయి. ముందురోజు సరిగా నిద్రపోకపోతే మరుసటి రోజు చాలా చిరాగ్గా ఉం టుంది. ఏ పనిని సరిగా చేయలేం. కోపం పెరుగుతుంది. ఇదివరకూ చెప్పినవి చిన్నచిన్న సమస్యలే. కానీ, ఎక్కువరోజులు నిద్రలేకపోతే అది ప్రమాదకర సమస్యలుగా మారే అవకాశం ఉంది. గుండె సమస్యలు, డయాబెటిస్, హైబ్లడ్ ప్రెజర్, డిప్రెషన్ వంటి ప్రమాద సమస్యలకి కారణంగా మారుతుంది. కాబట్టి, కచ్చితంగా నిద్ర ఉండేలా చూసుకోండి. ఆల్రెడీ సమస్యలు ఉంటే అవి మరింత పెరిగే అవకాశూం ఉంది. జీడిపప్పుల్లో ట్రిప్టోఫాన్ అనే గుణం ఉంటుంది. ఇది బాడీలో మెలటోనిన్‌ని తయారుచేసుకోవడానికి హెల్ప్ చేస్తుంది. ఈ మెలటోనిన్ అనేది నిద్రపోవడానికి హెల్ప్ చేసే హార్మోన్. అంతేకాకుండా, జీడిపప్పుల్లో మెగ్నీషియం, జింక్‌లు ఉంటాయి. ఇవి నరాల వ్యవస్థని శాంతపరుస్తాయి. అంతేకాకుండా యాంగ్జైటీని తగ్గిస్తాయి. ఉదయాన్నే నాలుగు నుంచి ఐదు జీడిపప్పుల్ని నీటిలో నానబెట్టాలి. కనీసం 4, 5గంటలైనా నానాలని గుర్తుంచుకోండి. వీటిని రాత్రి పడుకునే గంట ముందు తీసుకోవాలి. ఈ అలవాటు చేసుకుంటే చాలా వరకూ నిద్ర సమస్యలు దూరమవుతాయి. అయితే, ఇవి తినగానే మొదటిరోజు నుంచే నిద్రపడుతుందనుకోవద్దు. కనీసం మంచి రిజల్ట్స్ చూడడానికి 15 రోజులైనా ఫాలో అవ్వండి. ఇలా చేస్తే రోజురోజుకి మీ స్లీప్ క్వాలిటీ పెరుగుతుంది.

# తలకు నూనె పెట్టుకుంటే ఎంత సేపు ఉంచుకోవాలి



నేటి కాలంలో కాలుష్యం, పని ఒత్తిడి వల్ల జుట్టు రాలడం, జుట్టు చిట్లిపోవడం వంటి సమస్యలు సర్వసాధారణంగా మారాయి. ఈ సమస్యల నుంచి ఉపశమనం పొందడానికి చాలామంది జుట్టుకు నూనె రాసుకోవడం ఒక ప్రధాన పరిష్కారంగా భావిస్తారు. అయితే నూనె ఎప్పుడు రాయాలి? ఎంతసేపు ఉంచుకోవాలి? అనే విషయాలపై భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఈ అంశంపై ప్రముఖ డెర్మటాలజిస్ట్, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిపుణులు డాక్టర్ రామ్ కొన్ని కీలక విషయాలు పంచుకున్నారు. జుట్టు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి నూనె రాసే సరైన పద్ధతిని ఆయన వివరించారు. మన జుట్టు కెరాటిన్ అనే ప్రోటీన్ కణాలతో తయారవుతుంది. ఈ కణాలకు నీటిని త్వరగా పీల్చుకునే గుణం ఉంటుంది. తలస్నానం చేసినప్పుడు జుట్టు కణాలు నీటిని పీల్చుకుని ఉబ్బిపోతాయి, ఆ తర్వాత ఆరినప్పుడు తిరిగి సాధారణ స్థితికి చేరుతాయని డాక్టర్ రామ్ వివరించారు. ఇలా జుట్టు తరచూ ఉబ్బడం, మళ్లీ కుంచించుకుపోవడం వల్ల జుట్టు లోపల ఉండే సహజమైన బలం తగ్గిపోతుంది. దీనిని 'హైగ్రల్ ఫ్యాటీగ్' అని పిలుస్తారు. దీనివల్ల కాలక్రమేణా జుట్టు బలహీనపడి విరిగిపోవడం లేదా చిట్లిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. తలస్నానానికి ముందు తలకు నూనె రాయడం వల్ల అది ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. నూనెకు నీటిని వికర్షించే గుణం ఉండటం వల్ల, ఇది జుట్టు కణాలు అధికంగా నీటిని పీల్చుకోకుండా అడ్డుకుంటుంది. దీనివల్ల స్నానం చేసేటప్పుడు జుట్టు ఉబ్బడం తగ్గి, జుట్టు దెబ్బతినకుండా ఉంటుంది. షాంపూలో ఉండే రసాయనాలు నేరుగా జుట్టు కుదుళ్లను దెబ్బతీయకుండా నూనె ఒక అడ్డుకట్టలా ఉంటుంది. అందుకే షాంపూ చేయడానికి ముందు నూనె రాసుకోవడం వల్ల జుట్టు మృదువుగా ఉండటమే కాకుండా దాని సహజ సిద్ధమైన నిర్మాణం దెబ్బతినదు. చాలామంది నూనె రాసుకుని రాత్రంతా అలాగే ఉంచుకుంటారు. ఇలా చేయడం వల్ల జుట్టుకు ఎక్కువ పోషణ అందుతుందని వారి నమ్మకం. అయితే ఆయిలీ స్కాల్ప్ ఉన్నవారికి ఇది చాలా ప్రమాదకరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తల చర్మంపై సహజంగానే ఉండే సీబమ్ అనే జిడ్డుకు తోడు, మనం రాసే నూనె ఎక్కువ సేపు ఉండటం వల్ల అక్కడ మలాసెజియా వంటి ఫంగస్ ఏర్పడే అవకాశం ఉంటుంది. ఈ ఫంగల్ ఇన్ఫెక్షన్ వల్ల చుండ్రు పెరగడం, తల దురద రావడం, చివరికి జుట్టు విపరీతంగా రాలడం వంటి సమస్యలు వస్తాయి. జుట్టుకు నూనె పట్టించడం వల్ల కలిగే ప్రయోజనాలను పొందడానికి గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదు. తలస్నానం చేయడానికి కేవలం 15 నుంచి 30 నిమిషాల ముందు జుట్టుకు నూనె రాసుకుంటే సరిపోతుంది. ఈ సమయంలోనే నూనె జుట్టుపై ఒక పొరలా ఏర్పడి స్నానం చేసేటప్పుడు నీటి నుంచి రక్షణ కల్పిస్తుంది. మరీ ముఖ్యంగా నూనెను జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు సున్నితంగా రాసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. తలకు నూనె పట్టించిన తర్వాత వేళ్లతో మృదువుగా మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది.

## ఆ సమస్యలకు దివ్యౌషధం



జామ ఆకులు ప్రధానంగా షుగర్ (డయాబెటిస్), కీళ్లనొప్పులు, నోటిపూత వంటి సాధారణ సమస్యలకు సమర్థవంతంగా పనిచేస్తాయి.. డయాబెటిస్‌లో, జామ ఆకుల కషాయం రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.. కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు గ్లూకోజ్‌గా మారే వేగాన్ని తగ్గిస్తుంద ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. జామ పండ్లు చవకగా లభించే పోషకాల గని.. అందుకే దీన్ని పేదవాడి ఆపిల్ అని కూడా పిలుస్తారు. దీనిలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. అయితే, జామ పండ్లతో పాటు దాని ఆకులు కూడా అనేక ఔషధ గుణాలను కలిగి ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఈ ఆకుల్లోని ఔషధ గుణాలను ఆధునిక పరిశోధనలు కూడా ధృవీకరిస్తున్నాయి. కొన్ని సాధారణ ఆరోగ్య సమస్యలకు జామ ఆకులతో ఇంట్లోనే చికిత్సలను తయారు చేసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. జామ ఆకులు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి, యాంటీమైక్రోబయల్ గుణాలను కలిగి ఉన్నాయి.. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడం, జీర్ణక్రియను మెరుగుపరచడం, బరువు తగ్గడం, నోటి ఆరోగ్యం, గుండె ఆరోగ్యానికి అద్భుతమైన ఔషధంగా పనిచేస్తాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా.. జామ ఆకులు ప్రధానంగా షుగర్ (డయాబెటిస్), కీళ్లనొప్పులు, నోటిపూత వంటి సాధారణ సమస్యలకు సమర్థవంతంగా పనిచేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. డయాబెటిస్‌లో, జామ ఆకుల కషాయం రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు గ్లూకోజ్‌గా మారే వేగాన్ని తగ్గిస్తుంది. కీళ్లనొప్పులు, ముఖ్యంగా వాపులతో కూడిన వాటికి, జామ ఆకుల ముద్దను గోరువెచ్చగా చేసి పట్టులా వేయడం వల్ల నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అంతేకాకుండా, జామ ఆకుల యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాల వల్ల పంటినొప్పి, చిగుళ్ల వాపు, నోటిపూత వంటి నోటి సంబంధిత సమస్యలకు ఇవి అద్భుతంగా పనిచేస్తాయి. ఆకుల కషాయంతో పుక్కిలించడం ద్వారా ఉపశమనం పొందవచ్చు. కడుపునొప్పి, వాంతులకు కూడా యాంటీ బ్యాక్టీరియల్ గుణాలున్న ఈ ఆకుల కషాయం ఉపయోగిస్తారు. ఈ విధంగా, జామ ఆకులతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు దాగున్నాయి. అవసరాన్ని బట్టి వీటిని సరైన పద్ధతిలో ఔషధం కింద వాడుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనాన్ని పొందవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. జామ ఆకులను టీ రూపంలో లేదా లేత ఆకులను నమలడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.. అంతేకాకుండా.. వీటి రసాన్ని కూడా తీసుకోవచ్చు.. అయితే.. ఉదయాన్నే తీసుకుంటే మంచిది..

## బొప్పాయి గింజలు.. తిన్నారంటే గంపెడు లాభాలు?



ఆరోగ్యానికి మేలు చేసే పండ్ల విషయానికి వస్తే బొప్పాయి అగ్రస్థానంలో ఉంటుంది. ఇది కేవలం ఒక సాధారణ పండు మాత్రమే కాదు, శరీరాన్ని లోపలి నుండి సంరక్షించే సహజ ఔషధం. ఆయుర్వేదంలో దీనిని అమృతఫలం అని పిలుస్తారు. ఎందుకంటే బొప్పాయిలోని ప్రతి భాగం కాయ, పండు, ఆకులు, గింజలు కూడా అద్భుత లక్షణాలతో నిండి ఉంటాయి. ప్రతి పండు దాని సొంత ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంటుంది. బొప్పాయి జ్వరాలను నయం చేసే, రక్తాన్ని శుద్ధి చేసే, చర్మాన్ని మెరుగుపరిచే శక్తిని కలిగి ఉంటుంది. బొప్పాయి,దాని ఆకులు చాలా శక్తివంతమైనవి. అవి శరీరంలోని మూడు దోషాలను సమతుల్యం చేయడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. బొప్పాయి మాత్రమే కాదు, దాని గింజలు, ఆకులు కూడా అమృతంగా పరిగణిస్తారు. బొప్పాయి గింజలను సాధారణంగా కొత్త మొక్కలను పెంచడానికి ఉపయోగిస్తారు. కానీ, దీన్ని తినడం వల్ల మన శరీరం ఎన్ని ప్రయోజనాలను పొందుతుందో తెలిస్తే మీరు షాక్ అవుతారు. బొప్పాయిలోని పపైన్ ఎంజైమ్ కడుపు, పేగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో, శరీరాన్ని శుద్ధి చేయడంలో, పోషకాలను గ్రహించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. బొప్పాయి ఆకులు, గింజలు ఆయుర్వేదంలో ఔషధంగా ఉపయోగించబడతాయి. ఆకులు, గింజలు కొద్దిగా చేదు రుచిని కలిగి ఉన్నప్పటికీ, అవి శరీర మూలంలోని అనేక సమస్యలను నయం చేయడంలో సహాయపడతాయి. బొప్పాయి గింజల్లో విటమిన్ సి కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి, శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షించడానికి సహాయపడుతుంది. భారతదేశంలో గుండె జబ్బులు ఎక్కువగా ఉన్నాయి. చిన్న పెద్ద తేడాలేకుండా చాలా మంది గుండె సమస్యలతో బాధపడుతున్నారు. ఈ పరిస్థితికి బొప్పాయి గింజలు దివ్యౌషధం. బొప్పాయి గింజలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు మన శరీరాలను ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి రక్షిస్తాయి. ఈ విత్తనాలు రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. ఇంకా, ఈ విత్తనాలలో ఒలీక్ ఆమ్లం, మోనోశాచురేటెడ్ కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడతాయి. బొప్పాయి గింజలు వాపును తగ్గించడంలో చాలా ప్రభావవంతంగా ఉంటాయి. ఈ విత్తనాలలో ఆల్కలాయిడ్స్, ఫ్లేవనాయిడ్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. బొప్పాయి గింజలు క్యాన్సర్ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి. ఈ విత్తనాలలో కనిపించే ఐసోథియోసైనేట్స్ వంటి సమ్మేళనాలు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. బొప్పాయి గింజలు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. ఈ విత్తనాలు జుట్టు పెరుగుదలను కూడా ప్రోత్సహిస్తాయి. మీరు చర్మం, జుట్టు కోసం బొప్పాయి గింజల సారం లేదా నూనెను ఉపయోగించవచ్చు. మీరు చర్మ సమస్యలతో పోరాడుతుంటే, బొప్పాయి గింజలు ప్రయోజనకరంగా ఉంటాయి. వాటి యాంటీ ఏజింగ్ లక్షణాలు మీ చర్మాన్ని మృదువుగా, ప్రకాశవంతంగా ఉంచడంలో సహాయపడతాయి.

## గోళ్లు కొరుకుతున్నారా.. రోగాలు రావడం ఖాయం

ఖాళీగా ఉన్నప్పుడో, ఏదైనా దీర్ఘంగా ఆలోచిస్తున్నప్పుడో తెలియకుండానే వేళ్లు నోట్లోకి వెళు తున్నాయా..? పళ్లతో గోళ్లను కొరుకుతున్నారా..? చాలామంది దీనిని లైట్ తీసుకుంటారు కానీ దీన్నివల్ల మీరు ప్రమాదంలో పడతారు. ఈ చిన్న వ్యసనం మీ శరీరాన్ని లోపల నుండి గుల్ల చేస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మనం రోజంతా మొబైల్ ఫోన్లు, కీబోర్డులు, తలుపు హ్యాండిల్స్, డబ్బు వంటి ఎన్నో వస్తువులను తాకుతాము. మన కంటికి కనిపించని వేలాది బ్యాక్టీరియా, క్రిములు గోళ్ల కింద చేరుతాయి. వాటిని కొరికినప్పుడు ఆ క్రిములు నేరుగా కడుపులోకి వెళ్లి విరేచనాలు, వాంతులు, తీవ్రమైన కడుపు నొప్పికి దారితీస్తాయి. నిరంతరం గోళ్లు కొరకడం వల్ల దంతాల ఆకారం దెబ్బతినడమే కాకుండా చిగుళ్లు బలహీనపడి ఇన్ఫెక్షన్లు వస్తాయి. మనస్తత్వవేత్తల అభిప్రాయం ప్రకారం.. ఇది కేవలం శారీరక అలవాటు మాత్రమే కాదు.. ఒక మానసిక సంకేతం. మెదడు ఒత్తిడికి గురైనప్పుడు ఇలాంటి పనులు చేయిస్తుంది. ఏమీ తోచనప్పుడు కూడా మనసు ఒక సౌకర్యవంతమైన చర్య కోసం గోళ్లను ఆశ్రయిస్తుంది. ఈ చెడు అలవాటుకు స్వస్తి పలకడం అసాధ్యమేమీ కాదు. గోళ్లు ఎప్పుడూ చిన్నగా, శుభ్రంగా ఉంటే కొరకడానికి అవకాశం ఉండదు. మెడికల్ షాపుల్లో దొరికే చేదుగా ఉండే నెయిల్ ఉత్పత్తులను వాడండి. నోట్లో వేలు పెట్టగానే ఆ చేదు వల్ల అలవాటు గుర్తుకొచ్చి ఆపేస్తారు. స్ట్రెస్ బాల్స్ లేదా పెన్నులతో ఆడటం ద్వారా చేతులకు పని చెప్పండి. దీంతో గోళ్ల జోలికి వెళ్లకుండా ఉంటారు. ఒత్తిడి వల్ల ఇలా చేస్తుంటే.. కాసేపు ప్రశాంతంగా గాలి పీల్చుకోవడం లేదా సంగీతం వినడం ద్వారా మనసును మళ్లించండి. గోళ్లు కొరకడం అనేది కేవలం అందానికి సంబంధించిన విషయం కాదు.. అది మీ ఆరోగ్యానికి సంబంధించిన ప్రశ్న. చిన్న వయసులోనే ఈ అలవాటును గుర్తిస్తే త్వరగా మానుకోవచ్చు. సమస్య తీవ్రంగా ఉంటే డాక్టర్‌ను సంప్రదించడం ఉత్తమం.

# జైషా.. నఖ్వీ కాదు.. భారత్, పాక్ మ్యాచ్ జరగడానికి చక్రం తిప్పిన అసలు హీరో ఎవరంటే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇస్లామాబాద్: టీ20 వరల్డ్ కప్ 2026లో ఇండియా, పాకిస్తాన్ మ్యాచ్ విజయవంతంగా ముగిసింది. 2026, ఫిబ్రవరి 15న కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఈ హై ఓల్టేజ్ మ్యాచులో ఆల్ రౌండ్ షోతో అదరగొట్టిన భారత్ 61 పరుగుల తేడాతో దాయాది దేశాన్ని చిత్తుచేసింది. అయితే.. ఈ మ్యాచుకు ముందు ఎన్ని నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయో అందరికీ తెలిసిందే. వరల్డ్ కప్ నుంచి బంగ్లాదేశ్?ను ఐసీసీ భర్తరఫ్ చేయడం.. బంగ్లాకు మద్దతుగా ఇండియా మ్యాచును బాయ్ కాట్ చేస్తున్నట్లు పాకిస్తాన్ ప్రకటించడం.. దీంతో ఇండియా, పాక్ మ్యాచ్ జరుగుతుందా లేదా అని అభిమానుల్లో టెన్షన్.

ఈ క్రమంలో రంగంలోకి దిగిన ఐసీసీ పాకిస్తాన్?తో చర్చలు జరిపి ఎట్టకేలకు ఇండియా, పాక్ మ్యాచ్ యధావిధిగా జరిగేలా చూసింది. బాయ్ కాట్ విషయంలో పాక్ యూటర్న్ తీసుకుని ఈ మ్యాచ్ సక్సెస్ ఫుల్?గా జరగడంలో ఐసీసీ చైర్మన్ జై షా కీ రోల్ ప్లే చేసినట్లు ఊహాగానాలు వినిపించాయి. కానీ చిరకాల ప్రత్యర్థుల మధ్య మ్యాచ్ షెడ్యూల్ ప్రకారం జరిగేలా చక్రం తిప్పింది ఐసీసీ, ఐసీసీ చైర్మన్ జై షా కాదంట. శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సాయకే ఈ హై ఓల్టేజ్ మ్యాచ్ జరగడం చక్రం తిప్పిన అసలైన హీరో అంట. ఈ విషయాన్ని స్వయంగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ వెల్లడించాడు.శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సాయకే సకాలంలో జోక్యం చేసుకుని టీ20 వరల్డ్ కప్?లో భారత్, పాక్ మ్యాచ్ జరిగేలా కృషి చేశారని నఖ్వీ పేర్కొన్నారు. ఇండియా, పాక్ మ్యాచ్ విజయవంతంగా జరగడంలో కృషి చేసినందుకు దిస్సాయకేకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నాడు. దిస్సాయకే తమ రాష్ట్రపతి, ప్రధానికి ఫోన్ చేసి ఇండియా, పాక్ మ్యాచ్ నిర్వహణకు ఒప్పించారని తెలిపారు. దిస్సాయకే కాల్ చేసిన వెంటనే ఇండియాతో మ్యాచ్ ఆడేందుకు ప్రభుత్వం తమకు అనుమతి ఇచ్చిందని నఖ్వీ వెల్లడించారు. సకాలంలో జోక్యం చేసుకుని 2 బిలియన్ల మంది ప్రజలకు వినోదం అందించిన అసలైన హీరో దిస్సాయకే అని నఖ్వీ కొనియాడారు. భద్రతా పరమైన కారణాలతో టీ20 వరల్డ్ కప్?లో ఇండియాలో పర్యటించేందుకు బంగ్లాదేశ్ నిరాకరించింది. తమ మ్యాచులను ఇండియా బయట నిర్వహించాలని బంగ్లా ఐసీసీని కోరింది. కానీ ముందుగానే షెడ్యూల్ ఖరారు కావడంతో బంగ్లా అభ్యర్థనను ఐసీసీ తిరస్కరించింది. మెగా టోర్నీ నుంచి బంగ్లాదేశ్?ను భర్తరఫ్ చేసి స్కాట్లాండ్?కు అవకాశం ఇచ్చింది.

బంగ్లాదేశ్?ను భర్తరఫ్ చేయడంతో ఆ జట్టుకు మద్దతుగా టీ20 వరల్డ్ కప్?లో ఇండియాతో మ్యాచ్?ను బాయ్ కాట్ చేయాలని పాక్ నిర్ణయించుకుంది. ఇండియా, పాక్ మ్యాచ్ రద్దు అయితే భారీగా ఆర్థిక నష్టం వచ్చే అవకాశం ఉండటంతో ఐసీసీ రంగంలోకి దిగి చర్చలు జరిపింధ్ఝి. 2026 టీ20 వరల్డ్ కప్?కు ఇండియాతో పాటు అతిథ్యమిస్తోన్న శ్రీలంక కూడా పాకిస్తాన్?తో సంప్రదింపులు జరిపింది.

శ్రీలంకలోని కొలంబోలో జరగనున్న ఇండియా, పాక్ మ్యాచ్ రద్దు అయితే తమకు తీవ్రమైన ఆర్థిక నష్టం వాటిల్లుతోందని.. ఈ మేరకు శ్రీలంక ప్రెసిడెంట్ దిస్సాయకే పాక్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఐసీసీ, శ్రీలంక బోర్డు చర్చలతో దిగొచ్చిన పాక్ బాయ్ కాట్ విషయంలో యూటర్న్ తీసుకుని ఇండియాతో మ్యాచ్ ఆడేందుకు అంగీకరించింది.

# క్రికెట్ + కల్చర్.. టీ20 వరల్డ్‌కప్‌లో నేపాల్ బౌలర్ మహాదేవ్ సెలబ్రేషన్






**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో నేపాల్ జట్టు చరిత్ర సృష్టించింది. స్కాట్లాండ్‌పై గెలిచి, 12 ఏళ్ల తర్వాత టీ20 వరల్డ్‌కప్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో నేపాల్ టీమ్ 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. టోర్నీ నుంచి ఇప్పటికే నిష్క్రమించినప్పటికీ, ఈ విజయంతో నేపాల్ క్రికెట్ అభిమానుల మనసులు గెలుచుకుంది. రోహిత్ పౌడెల్ నాయకత్వంలో ఆడిన నేపాల్ జట్టు ఆత్మవిశ్వాసంతో కనిపించింది. స్టేడియంలో పెద్ద సంఖ్యలో హాజరైన నేపాల్ క్రికెట్ ఫ్యాన్స్ ఈ గెలుపుని ఘనంగా జరుపుకున్నారు. చాలా మంది నేపాల్ ప్లేయర్స్ అద్భుతమైన ప్రదర్శన చేయగా.. ఒక ఆటగాడు మాత్రం తన ప్రత్యేకమైన సెలబ్రేషన్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు.నేపాల్ పేసర్ సోంపాల్ కామీ చేసిన 'మహాదేవ్ ధ్యానం సెలబ్రేషన్' ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వికెట్ తీసిన వెంటనే మైదానంలో కూర్చొని, కాళ్లు మడిచి, చేతులు జోడించి ధ్యానం చేస్తున్నట్టుగా సంబరం చేసాడు. ఈ సెలబ్రేషన్‌పై అభిమానులు స్పందిస్తున్నారు. బౌలింగ్‌లో కూడా సోంపాల్ కామీ హీరోగా నిలిచాడు. స్కాట్లాండ్ బ్యాటర్లను ఇబ్బంది పెడుతూ నాలుగు ఓవర్లలో కేవలం 25 పరుగులు మాత్రమే ఇచ్చి కీలకమైన మూడు వికెట్లు పడగొట్టాడు.

ముందుగా బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లకు 170 పరుగులు చేసింది. ఒక దశలో వారు 200 పరుగులు దాటేలా కనిపించినా, నేపాల్ బౌలింగ్, ఫీల్డింగ్ మెరుగ్గా ఉండటంతో స్కోర్‌ను అదుపులో పెట్టగలిగారు. స్కాట్లాండ్ తరఫున మైఖేల్ జోన్స్ 45 బంతుల్లో 71 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 171 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ టీం ధైర్యంగా బ్యాటింగ్ చేసింది. డిపేంద్ర సింగ్ ఐరీ కేవలం 23 బంతుల్లో హాఫ్ సెంచరీ కొట్టి జట్టును విజయానికి దగ్గర చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో మూడు సిక్సులు, నాలుగు ఫోర్లు ఉన్నాయి. చివరకు నేపాల్ కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి.. మరో 4 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని చేరుకుంది. ఈ విజయంతో నేపాల్ టీం టోర్నీ నుంచి నిష్క్రమించినా, తమ పోరాటంతో ప్రపంచ క్రికెట్ అభిమానుల ప్రశంసలు అందుకుంటుంది. ప్రత్యేకంగా సోంపాల్ కామీ చేసిన సెలబ్రేషన్ ఈ మ్యాచ్‌కు మరింత హైప్ వచ్చేలా చేసింది.

# టీ20 ర్యాంకింగ్స్... నెంబర్ వన్ పీఠం అభిషేక్ దే.. టాప్-10లోకి ఎంటరైన ఇషాన్ కిషన్

**టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ అగ్రస్థానం పదిలం**

**భారీగా ఎగబాకి టాప్ 10లోకి దూసుకొచ్చిన ఇషాన్ కిషన్**

**ఆల్ రౌండర్ల జాబితాలో సైమ్ అయూబ్ నంబర్ 1**

**బౌలింగ్‌లో రెండో స్థానానికి ఎగబాకిన రషీద్ ఖాన్**




**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన టీ20 ప్లేయర్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో అతను పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నప్పటికీ, బ్యాటింగ్ జాబితాలో నంబర్ వన్ ర్యాంక్‌ను కాపాడుకోవడం విశేషం. మరోవైపు, విధ్వంసక వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ మరిన్ని స్థానాలు ఎగబాకి టాప్-10లోకి ప్రవేశించాడు.టీ20 ప్రపంచకప్‌లో భాగంగా అమెరికా, పాకిస్థాన్‌లపై డకౌట్ అయిన అభిషేక్ ఫామ్ గురించి ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ, అతను బ్యాటింగ్ శిఖరాగ్రాన తన ఆధిక్యాన్ని కొనసాగించాడు. ఇక, ప్రపంచకప్‌లో వరుసగా రెండో హాఫ్ సెంచరీ నమోదు చేసిన ఇషాన్ కిషన్ ఏకంగా 17 స్థానాలు మెరుగుపరుచుకుని 8వ ర్యాంకును దక్కించుకున్నాడు. కేవలం 40 బంతుల్లో 77 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకోవడం అతనికి కలిసొచ్చింది. శ్రీలంక ఆటగాడు పతుమ్ నిస్సంక మూడో స్థానానికి చేరుకున్నాడు.ఆల్ రౌండర్ల జాబితాలో పాకిస్థాన్‌కు చెందిన సైమ్ అయూబ్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. భారత్‌పై మూడు వికెట్ల ప్రదర్శనతో, జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజాను వెనక్కి నెట్టి నంబర్ వన్ అయ్యాడు.బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ ఒక స్థానం ఎగబాకి రెండో ర్యాంకుకు చేరుకున్నాడు. దీంతో అగ్రస్థానంలో ఉన్న భారత బౌలర్ వరుణ్ చక్రవర్తికి అతను మరింత చేరువయ్యాడు. భారత బౌలర్లు అక్షర్ పటేల్ (14వ ర్యాంక్), జస్ప్రీత్ బుమ్రా (15వ ర్యాంక్) కూడా తమ స్థానాలను మెరుగుపరుచుకున్నారు.

# మరీ ఇంత గ్యాప్ అంటే ఎలా కార్తికేయ?



యాషికా అన్నంద్ బోల్డ్ గాంభీర్యంతో ఫ్రేమ్‌ని నిప్పులు చెరిగారు

సినీ ఇండస్ట్రీలో సక్సెస్ కు టాలెంట్ ఎంత అవసరమో.. వరుస సినిమాలతో సందడి చేస్తుండడం కూడా అంతే అవసరం. ఒక సినిమా తర్వాత మరొక మూవీకి మధ్య కాస్త బ్రేక్ ఉండడం అన్ని విధాలుగా మంచిదే కానీ.. ఆ గ్యాప్ మరీ ఎక్కువైతే మాత్రం ప్రేక్షకుల్లో ఐడెంటిటీ తగ్గిపోవడం ఖాయం. ఇప్పుడు ఇదే పరిస్థితి యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కార్తికేయ గుమ్మకొండ విషయంలో కనిపిస్తోంది.కార్తికేయ అంటే వెంటనే అందరికీ గుర్తు రాకపోయినా.. ఆర్ఎక్స్ 100 మూవీ హీరో అంటే మాత్రం టక్కున గుర్తుకొస్తారు. దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఆ సినిమా అప్పట్లో సంచలన విజయం సాధించింది. ఆ చిత్రంతో కార్తికేయకు మంచి గుర్తింపు వచ్చింది. యూత్ లో ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ కూడా క్రియేట్ అయింది. అదే సమయంలో అప్ కమింగ్ మూవీలపై అందరి దృష్టి పడింది.ఆ తర్వాత బెదురు లంక వంటి పలు తెలుగు చిత్రాల్లో హీరోగా నటించి తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు కార్తికేయ. కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ప్రయోగాలు చేశారు. హీరోగా మాత్రమే కాకుండా విలన్ గా కూడా నటించగల టాలెంట్ ఉన్న నటుడిగా పేరు తెచ్చుకున్నారు. అందుకు ఎగ్జాంపుల్ గా కోలీవుడ్ స్టార్ అజిత్ కుమార్ నటించిన వాలిమై సినిమాలో విలన్ పాత్రలో మెప్పించారు. ఆ పాత్ర ఆయనకు తమిళ ప్రేక్షకుల్లో గుర్తింపు తీసుకొచ్చింది.అయితే గత కొంతకాలంగా కార్తికేయ నుంచి కొత్త ప్రాజెక్టుల అనౌన్స్మెంట్లు లేకపోవడం అభిమానులను నిరాశపరుస్తుంది. 2024లో వచ్చిన భజే వాయు వేగం మూవీ తర్వాత ఆయన నుంచి మరో సినిమా గురించి క్లారిటీ రాలేదు. ఆ సినిమా కూడా పెద్దగా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోవడంతో ఆయన అప్ కమింగ్ ప్రాజెక్టులపై చర్చలు జరుగుతున్నాయి.ఇండస్ట్రీలో వినిపిస్తున్న టాక్ ప్రకారం, కార్తికేయ తన తదుపరి సినిమా షూటింగ్ ను పూర్తి చేసి టీజర్ తో సడెన్ గా సర్ప్రైజ్ ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నారట. భజే వాయు వేగం విషయంలో కూడా ఇదే ప్లాన్ ఫాలో అయ్యారని చెబుతున్నారు. అయితే ఆ విషయం ఎంతవరకు నిజమో క్లారిటీ లేదు. కానీ ఇలాంటి ప్లాన్లు ఎప్పుడూ వర్కౌట్ అవుతాయనే గ్యారెంటీ లేదు.ప్రస్తుత రోజుల్లో ప్రేక్షకులు సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు అప్డేట్స్ కోరుకుంటున్నారు. కనీస సమాచారం లేకుండా హీరో పూర్తిగా కనిపించకుండా ఉంటే, ఆసక్తి తగ్గిపోవడం సహజం. దీంతో స్టార్ ఇమేజ్ దెబ్బతినే ప్రమాదం ఉంది. ఏదేమైనా కార్తికేయ వంటి టాలెంటెడ్ నటుడు కెరీర్ లో ఇలాంటి పెద్ద గ్యాప్ తీసుకోవడం రిస్క్ అనే చెప్పాలి. సరైన కథ, ప్లాన్ తో ప్రేక్షకుల ముందుకు వస్తేనే ఆయన మళ్లీ ఫామ్ లోకి రావచ్చు. ఇకపై కార్తికేయ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాలి.



పాలక్ తివారీ ఎత్నిక్ గాంభీర్యంతో మెరిసి పోయాడు



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965